thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చూరకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 359 | కరీంనగర్ గురువారం, 6 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## వాయుసేనలో ప్రైవేటు భాగస్వామ్యం తప్పనిసరి

న్యూఢిల్లీ : భారత వాయుసేన సామర్థ్యం పెంపునకు ప్రైవేటు భాగస్వామ్యాన్ని తీసుకోక తప్పదని ఉన్నత స్థాయి కమిటీ అభిప్రాయపడింది. స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యల్లో భాగంగా ప్రైవేటు సంస్థల సహకారం తీసుకొని లోటుపాట్లను సరిదిద్దుకో వాల్సి ఉందని తెలిపింది. సకాలంలో యుద్ధ విమానాలు అందక ఇబ్బం దులు ఎదురవుతున్నట్టు సాక్షాత్తూ వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ బహిరంగంగా చెప్పిన నేపథ్యంలో కమిటీ చేసిన ఈ సూచనకు ప్రాధాన్యం ఏర్పడింది. రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలోని సాధికారిక కమిటీ రక్షణ మంత్రికి అందజేసిన నివేదికలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రస్తావించింది. యుద్ధ విమానాల తయారీ, ఇతర అంశాల్లో ప్రైవేటు భాగస్వామ్యం తీసుకోవాలని ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సు చేసింది.



## రేవంత్ రెడ్డిని కలిసిన ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి

హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డిని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ బుధవారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి వచ్చిన ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షిని ముఖ్యమంత్రి సాదరంగా ఆహ్వానించి ఆమెకు పూల బొకే అందించారు. అనంతరం శాలువా కప్పి సత్కరించారు. నూలు వడికే చరఖా, మొక్కను బహుమతిగా అందజేశారు. ఆ సమయంలో సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఉన్నారు. అనంతరం పార్టీ కార్యక్రమాలు, టీచర్స్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి గల కారణాలపై సమీక్ష నిర్వహించినట్లు తెలుస్తోంది. దీనికి తోడు వచ్చే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలపై, అభ్యర్థుల ఎంపికపై చర్చ జరిగినట్లు సమాచారం.

### ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక, పార్టీ పదవులు, స్థానిక ఎన్నికలపై...

# కాంగ్రెస్ సర్కార్ ఫుల్ ఫోకస్!

**ఫీడ్ బ్యాక్ పై సీఎంతో మీనాక్షి చర్చ...** సుమారు గంటకు పైగా జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక విషయంలో ఎలాంటి విధి విధానాలు పాటించాలనేదానిపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ అవకాశం కోసం భారీగా పోటీ ఉన్న నేపథ్యంలో అభ్యర్థుల ఖరారు విషయంలో ఏ రకంగా వడపోత చేపడితే పార్టీకి ఇబ్బందులు లేకుండా ఉంటుంది అనే అంశంపై చర్చించినట్లు తెలుస్తోంది. అలాగే నిన్న మెదక్, మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గ నేతలతో మీనాక్షి నటరాజన్ సమీక్ష నిర్వహించారు.

ఈ సమీక్షకు సంబంధించిన ఫీడ్ బ్యాక్ పై సీఎంతో మీనాక్షి చర్చించినట్లు తెలుస్తోంది. కాగా కాంగ్రెస్ పార్టీకి లాయల్ గా ఉండేవారికే ఎమెల్సీగా అవకాశం ఇవ్వాలని పార్టీ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పీసీసీకి పెద్ద ఎత్తున దరఖాస్తులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. కాగా, రేపు కేబినెట్ భేటీ జరగనున్నది.

అనంతరం కేబినెట్ నిర్ణయాలు, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక విషయంలో అధిష్టానంతో చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్లుండి మరోసారి ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ భేటీ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, 'తెలంగాణలో కాంగ్రెస్ పాలనను మరింత బలోపేతం చేసేందుకు పార్టీ అధిష్ఠానం తోడుగా నిలుస్తోంది. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ సూచనలు, మార్గదర్శకాలు రాష్ట్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేస్తాయి' అని అన్నారు. మరోవైపు, మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ, 'తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చేలా చర్యలు తీసుకుంటుంది. పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి' అని పేర్కొన్నారు. ఈ సమావేశం తెలంగాణ రాజకీయాల్లో కొత్త ఊపును తీసుకురావొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కీలక మార్గదర్శకాలు అందజేస్తోంది. ఈ భేటీ ద్వారా రాబోయే నెలల్లో కాంగ్రెస్ పార్టీ తన ప్రచార వ్యూహాన్ని మరింత ఉద్ధృతం చేసే అవకాశం ఉంది. తెలంగాణలోని స్థానిక ఎన్నికలు, ఇతర రాష్ట్రాల్లోని అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ తన బలాన్ని పెంచే చర్యలు తీసుకోవచ్చని అంచనా.



## పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి విజయం

కరీంనగర్ : తెలంగాణలో కరీంనగర్–నిజామాబాద్–మెదక్–ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉత్కంఠగా సాగింది. మూడు రోజులపాటు సాగిన లెక్కింపు ప్రక్రియలో విజయం దోబూచులాడి చివరకు భాజపా అభ్యర్థిని వరించింది. 53 మంది అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత భాజపా అభ్యర్థి సి.అంజిరెడ్డి ఆధిక్యంలో ఉన్నారు. అంజిరెడ్డికి 78,635 ఓట్లు రాగా.. సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి 73,644 ఓట్లతో రెండో స్థానంలో ఉన్నారు. దీంతో నరేందర్‌రెడ్డి లెక్కింపు కేంద్రం నుంచి వెళ్లిపోయారు. అంజిరెడ్డి గెలుపు దాదాపు ఖాయమైనట్టు తెలుస్తోంది. ఫలితాల వెల్లడిపై అధికారులు ఎన్నికల సంఘానికి నివేదించారు. ఈసీ ఆదేశాల మేరకు విజేతను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

# టీడీపీ తెలంగాణలో పుంజుకునే ప్రయత్నాల్లో ఉందా..?




హైదరాబాద్ : తెలుగుదేశం పార్టీ తెలంగాణలో తిరిగి పుంజుకునే ప్రయత్నాలు గట్టిగానే చేస్తున్నట్టు తెలుస్తోంది. ఒకప్పుడు ఇక్కడ ఓ వెలుగు వెలిగిన పార్టీ.. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ దెబ్బతో డీలాపడిపోయింది. ఇక గడిచిన పదేళ్ళలో రాష్ట్రం నుంచి దాదాపుగా తుడిచిపెట్టుకుపోయిందన్న అభిప్రాయం ఉంది రాజకీయవర్గాల్లో. అప్పట్లో టీడీపీలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ నాయకులు ఎక్కువ శాతం బీఆర్ఎస్‌లోకి తర్వాత కాంగ్రెస్‌లోకి చేరిపోయారు. 2014లో జీహెచ్ఎంసీ పరిధితోపాటు కొన్ని జిల్లాల్లో కూడా ఎమ్మెల్యేలు గెలిచిప్పటికీ పార్టీలో ఇమడలేకపోయారు. అదే టైంలో... అటు ఏపీలో పార్టీకి అధికారం రావడంతో... తెలంగాణ టీడీపీ నుంచి ఒకరిద్దరు నేతలు స్ట్రాంగ్‌గానే ఉండేవారు. ఇక 2019లో ఆంధ్రప్రదేశ్‌లో అధికారం కోల్పోయిన తరువాత తెలంగాణలో పార్టీ పరిస్థితి దయనీయంగా మారిపోయింది. తర్వాత 2024లో తిరిగి అధికారాన్ని దక్కించుకున్న టీడీపీ అధిష్టానం.... తిరిగి తెలంగాణ మీద ఫోకస్ పెడుతున్నట్టు తెలుస్తోంది. ఏపీలో బీజేపీ, జనసేన పొత్తుతో కూటమి ఏర్పాటవగా.. తెలంగాణలో సైతం అదే కాంబినేషన్‌లో పూర్వ వైభవం దిశగా అడుగులేయాలమని తపిస్తోందట టీడీపీ. తెలంగాణలో ఒకప్పుడు ఒకే సామాజిక వర్గానికి చెందినవారు, ఆధిపత్యకులాలవారు అధికారం చెలాయించారు. ఎన్టీఆర్ టిడిపిని ఏర్పాటు చేశాక.... అప్పటి వరకు అణచివేతకు గురైన బీసీ కులాల్ని ప్రోత్సహించారు. వారికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారు. ఆ ఊపులో పలువురు బీసీ నాయకులు మంత్రులు అయ్యారు. ఆ విధంగా బీసీల్లో రాజకీయ చైతన్యం రావడానికి తెలుగుదేశం పార్టీ ప్రధాన కారణం. ఇక పరిణమామ క్రమంలో తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష బలపడటం, అలాగే.. రెండు కళ్ళ సిద్ధాంతంతో చంద్రబాబుకు రెండు ప్రాంతాలు సమానమే అన్న భావన పెరగడంతో ఆయన మీద తెలంగాణ వ్యతిరేకి అన్న ముద్ర వేయగలిగారు ఉద్యమాన్ని నడిపిన కేసీఆర్. దీంతో తెలంగాణలో టీడీపీ పూర్తిగా బలహీన పడింది. అదంతా గతం. ఇప్పుడిక తెలుగుదేశం పార్టీ ఏపీలో అధికారంలో ఉండడం, కేంద్రంలో చక్రం తిప్పగలిగిన స్థాయికి చేరుకోవడంతో... తెలంగాణలో కూడా పార్టీని బలోపేతం చేయాలని, అందుకోసం బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించడమే శ్రేయస్కరమని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ఇప్పటికే బీజేపీ బలపడుతోంది. 8 ఎంపి సీట్లు, 8 ఎమ్మెల్యే సీట్లు ఉన్న బిజెపితో టీడీపీకి పొత్తు ఉంది. అలాగే జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఇక్కడ కూడా మంచి పాలోయింగ్ ఉంది.

ఈ కాంబినేషన్‌తోపాటు... అణచివేతకు గురవుతున్నామని ఫీలవుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఉన్న బీసీ నేతలను తెలుగుదేశం వైపునకు తిప్పుకుని బలోపేతం కావాలన్నది చంద్రబాబు లక్ష్యంగా తెలుస్తోంది. ఇప్పటికిప్పుడు కాకున్నా... వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి ఇక్కడ కూడా కూటమిగా పోటీచేయాలని భావిస్తోందట టీడీపీ.అందుకే ఇప్పటి నుంచి బీసీ కులాల నుంచి వచ్చే నాయకులను తమ పార్టీ వైపు తిప్పుకోవాలని వ్యూహ రచన చేస్తున్నట్టు సమాచారం. కాంగ్రెస్‌పై ఆగ్రహంతో ఉన్నవాళ్లు, కులగణన సక్రమంగా జరుగలేదని భావిస్తున్న బీసీ సంఘాల నేతలను తన వైపు తిప్పుకోవడానికి బాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటిని బిజెపి, జనసేన మద్దతుతో రంగంలోకి దిగితే.... జీహెచ్ఎంసీతోపాటు ఖమ్మం జిల్లాలో కూడా పార్టీకి ప్రాతినిధ్యం లభిస్తుందని భావిస్తున్నారట తెలుగుదేశం అధినేత. ఇదే జరిగితే కేసీఆర్ కాంగ్రెస్‌ను టార్గెట్ చేసే అవకాశం లేకపోలేదని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే తెలంగాణ నుంచి పారిపోయిన తెలుగుదేశం తిరిగి అడుగుపెట్టిందనే ఆరోపణలకు పదునుపెట్టే అవకాశం లేకపోలేదంటున్నారు పరిశీలకులు.

# ఎమ్మెల్సీ ఎన్నికల హీట్..

## జాక్‌పాట్ కొట్టే లీడర్స్ వీళ్లేనా..!




హైదరాబాద్ : తెలంగాణలో మరో ఎన్నికల సమరానికి తెరలేసింది. వచ్చే నెలలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ రిలీజ్ అయ్యింది. ఈ ఎన్నిక కోసం మార్చి 3 నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. మార్చి 20న పోలింగ్ జరగనుంది. అయితే అసెంబ్లీ బలబలాల ప్రకారం నాలుగు సీట్లు అధికార కాంగ్రెస్‌కు దక్కుతుండగా.. ఒకసీటు మాత్రం కారు పార్టీకి దక్కనుంది. ప్రస్తుతం ఎమ్మెల్యే కోటాలో పోటీ చేసేందుకు కాంగ్రెస్ నేతలు ఢిల్లీ కేంద్రంగా లాబీయింగ్ మొదలు పెట్టినట్టు సమాచారం. తమకు ఒక్క ఛాన్స్ ఇవ్వాలని పలువురు నేతలు కోరుతున్నారట. కానీ నాలుగు సీట్లు భర్తీ విషయంలో మాత్రం అధికార పార్టీ తర్జనభర్జనలు పడుతున్నట్టు తెలిసింది. వచ్చే నెలలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్సీల పదవీకాలం పూర్తి కానుంది. ఇందులో మాజీమంత్రులు సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ ఉన్నారు. అటు యెగ్గే మల్లేశం, శేరి సుభాష్ రెడ్డితో పాటు.. ఎంఐఎం పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్సీ మీర్జా రియజుల్ హసన్ ఎఫెందీ పదవీ కాలం పూర్తి కానుంది. వీరి స్థానంలోనే కాంగ్రెస్ కు చెందిన నలుగురు ఎమ్మెల్సీలు పెద్దల సభకు వెళ్లనున్నారు. ఒక సభ్యుడు మాత్రం గులాబీ పార్టీ నుంచిపోటీ చేయనున్నారు. అయితే అధికార పార్టీ నుంచి పోటీ చేస్తున్న నేతలు అందరూ కీలక నేతలే కావడంతో పదవి ఎవరికి దక్కుతుంది అనేది మాత్రం ఆసక్తికరంగా మారింది. ఇటీవల కరీంనగర్ సిట్టింగ్ ఎమ్మెల్సీగా ఉన్న జీవన్ రెడ్డి.. ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేయడంలేదు.. ఆయన ఎమ్మెల్యే కోటాలో తనను పెద్దల సభకు పంపించాలని పార్టీ పెద్దలను కోరుతున్నట్టు తెలిసింది. అటు ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కూడా ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీని చేస్తారని సమాచారం. సీఎం రేవంత్ రెడ్డికి వేం నరేందర్ రెడ్డి అత్యంత ఆప్తుడు.. అందుకే ఆయన్ను పెద్దల సభకు పంపించి మంత్రిని చేసే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నట్టు టాక్ వినిపిస్తోంది. ఇక ఓసీ కోటా నుంచి హర్కల వేణుగోపాల్, సామా రామ్మోహన్ రెడ్డి పోటీ పడుతున్నట్టు తెలిసింది. ఇక తెలంగాణలో బీసీ లొల్లి తగ్గడం లేదు. రోజురోజుకు చాపకింద నీరులా ఈ ఉద్యమం విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో ఓ బీసీ లీడర్‌ను పెద్దల సభకు పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్టు సమాచారం. బీసీ కోటా నుంచి ఈసారి నీలం మధు ముదిరాజ్, మాజీ ఎమ్మెల్యే యరావత్ అనిల్, మహిళా కాంగ్రెస్ ప్రెసిడెంట్ సునీతారావు, మాజీ ఎంపీలు వీహెచ్, మధుయాష్కీ గౌడ్, చరణ్ కౌశిక్ యాదవ్ పోటీ పడుతున్నారు. వీరిలో ఎవరో ఒక్కరికి ఎమ్మెల్సీ పదవి దక్కే అవకాశం ఉందని గాంధీ భవన్ వర్గాలు అంటున్నాయి.. ఇక మైనారిటీ కోటా నుంచి ఆశావాహుల సంఖ్య భారీగానే ఉందని అంటున్నారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి కేబినెట్‌లో మైనారిటీకి సంబంధించిన మంత్రి కూడా లేరు. దాంతో ఇప్పుడు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎవరు అవుతారు అనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పుడు ఎమ్మెల్యే అయితే మాత్రం మంత్రి పదవి కూడా ఆ నేతకే దక్కే అవకాశం ఉందంటున్నారు. దాంతో కీలక నేతలు ఎవరివంతుగా వాళ్లు లాబీయింగ్ మొదలు పెట్టేశారట. ఇందులో మాజీ మంత్రి షబ్బీర్ అలీ, అజారుద్దీన్, ఫిరోజ్ ఖాన్, పోటీలో ముందు ఉన్నారట. అయితే సీఎం రేవంత్ రెడ్డి మాత్రం కాంగ్రెస్ లీడర్ ఫయిమ్ ఖురేషీ వైపు మొగ్గు చూపుతున్నారని చెబుతున్నారు. అటు ఎస్సీ కోటాలో అద్దంకి దయాకర్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ కూడా పోటీ పడుతున్నట్టు సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల్లో అద్దంకి దయాకర్ తుంగుతుర్తి సీటును త్యాగం చేశారు.

దాంతో ఆయన్ను పెద్దల సభకు పంపిస్తారని చెబుతున్నారు. మొత్తంమీద ఎన్నికల సమరానికి తెరలేవడంతో.. ఆశావాహుల్లో మాత్రం నరాలు తెగె ఉత్కంఠ కొనసాగుతోంది. అయితే ఈసారి పదవలు దక్కని నేతలు.. తిరుగుబాటు ప్రకటించే అవకాశం ఉండటంతో ప్రభుత్వ పెద్దలు టెన్షన్ పడుతున్నట్టు సమాచారం. ఏదీఏమైనా పదవుల పంపకాలు మాత్రం సీఎం రేవంత్ రెడ్డికి పెద్ద తలనొప్పిగా మారాయని గాంధీభవన్ వర్గాలు అంటున్నాయి.



# నేడు తెలంగాణ క్యాబినెట్ భేటీ - పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం కేబినెట్ భేటీ రేపు, మార్చి 6న, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనుంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్‌లో మధ్యాహ్నం 2 గంటలకు కేబినెట్ భేటీ అవుతుంది. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు సహా పలు కీలక అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది బడ్జెట్ సమావేశాల నిర్వహణ, ఆ సమావేశాల్లో ప్రవేశపెట్టాల్సిన బిల్లులపైనా ఈ భేటీలో చర్చించి ఆమోదించనున్నట్లు సమాచారం. వర్గీకరణ, కొత్త రేషన్ కార్డులు, రైతుబంధు పథకాలు మరియు ఇతర కీలక అంశాలు చర్చించబడతాయి. ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక కూడా అందింది. అయితే కులగణలో కొందరు వివరాలు నమోదు చేసుకోకపోవటంతో రెండోసారి నిర్వహించారు. ఈ అంశంపైనా మంత్రివర్గ భేటీలో చర్చించనున్నట్లు తెలిసింది.

**స్థానిక సంస్థల ఎన్నికలు మరియు బీసీ కులగణన...** ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణనపై తీసుకున్న నివేదికను పరిశీలించి, బీసీ సంక్షేమానికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని సమాచారం. ఇప్పటికే కొన్ని జిల్లాలలో కులగణనపై వివరాలు నమోదు చేయడంలో కొంత అవరోధం ఏర్పడింది, దాంతో రెండోసారి సర్వే నిర్వహించడం జరిగింది. ఈ అంశంపై మంత్రివర్గం వివిధ మార్గదర్శకాలు రూపొందించాలని నిర్ణయించింది.

**ఎస్సీ వర్గీకరణపై కీలక చర్చలు...** ఎస్సీ వర్గీకరణపై నివేదిక అందించిన తర్వాత, ఇందులోని గ్రూపుల విభజనపై వివిధ వర్గాల నుంచి వినతులు అందాయి. ఈ అంశంపై మంత్రివర్గం చర్చించి, విధానపరమైన మార్పులను ప్రవేశపెట్టే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రైతుభరోసా, ఇందిరమ్మ పథకాలు, రైతుభరోసా నిధుల చెల్లింపుల పై, తదితర సంక్షేమ పథకాల అమలుపై కూడా ఈ భేటీలో చర్చించనున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం, నిధుల విడుదల, ఇండ్ల లబ్దిదారుల ఎంపిక వంటి అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుంది.

**కేటాయించిన బిల్లులు, ఆమోదం కోసం...** ఈ భేటీలో, ప్రభుత్వ బడ్జెట్ సమావేశాలు, ఆ సమావేశాల్లో ప్రవేశపెట్టాల్సిన బిల్లులు, ఎండోమెంట్ సవరణ బిల్లును కూడా చర్చించనున్నారు. ఈ బిల్లులు అన్ని అధికారికంగా ఆమోదం పొందుతాయి.

**యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు - కీలక నిర్ణయాలు...** తెలంగాణ రాష్ట్రంలో యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డుకు సంబంధించిన నిర్ణయాలు కూడా ఈ భేటీలో తీసుకోబడతాయి. బోర్డుకు సంబంధించిన కొత్త మార్పులు, విధానాలు, అవసరమైన చర్యలు ప్రస్తుత పరిస్థితులను మెరుగుపరచడానికి కీలకంగా మారతాయి.

**కొత్త రేషన్ కార్డులు: జారీ ప్రక్రియపై చర్చ...** కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియపై కూడా ఈ భేటీలో చర్చ జరగనుంది. రాష్ట్రంలో ఈ రేషన్ కార్డులు, వాటిలో జరుగనున్న మార్పుల గురించి అధికారులు సమావేశంలో వివరాలను ప్రవేశపెట్టనున్నారు.




లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రంలోని భాజపా, ఇతర రాష్ట్రాల్లోని పార్టీల మధ్య మాటల యుద్ధం జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తుందన్నారు. దీన్ని అంగీకరించమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం ఆయా రాష్ట్రాలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలి.

ఈ విభజన ప్రక్రియ తాజా జనాభా లెక్కల ఆధారంగా ఉంటే పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గే ప్రమాదం ఉంది. దీన్ని ఏమాత్రం అంగీకరించం.

గత 50 ఏళ్లుగా తమిళనాడుతో సహా ఇతర దక్షిణాది రాష్ట్రాలు జనాభా పెరుగుదలను నియంత్రించాయి. ఈక్రమంలో ప్రస్తుత జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాలు విభజించడం సరికాదు. ఒకరి గెలుపు కోసం ఇంకొకరిని శిక్షించడం అన్యాయం. దక్షిణాది రాష్ట్రాల్లోని నియోజకవర్గాల సంఖ్య తగ్గినా.. ఉత్తరప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల్లో ఆ సంఖ్య పెరిగినా సహించేది లేదు. అన్ని పార్టీలతో కలిసి దీనిపై పోరాడతాం. ప్రజాప్రతినిధుల కొరత సాధారణ ప్రజలకు సమస్యే కాదు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, నాణ్యమైన విద్య, వైద్యం, రోడ్లు వంటి అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముందు వాటిపై దృష్టి సారించాలి' అని ప్రకటనలో పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ద్వారా తక్కువ జనాభా ఉన్న రాష్ట్రాల్లో పార్లమెంట్ స్థానాలు తగ్గుతాయంటూ తమిళనాడు కొంతకాలంగా చెబుతోంది.

ఈ వ్యాఖ్యలను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కొట్టిపడేశారు. అయినప్పటికీ దీనిపై పలు రాష్ట్రాల తమ ఆందోళనను వ్యక్తంచేస్తున్నాయి. ఇక, ఈ అంశంపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ బుధవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. అందులో 1971 జనాభా లెక్కల ఆధారంగానే విభజన చేపట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

# పారదర్శకంగా సర్వే చేస్తేనే ఆదర్శంగా ఉంటుంది: తీన్మార్ మల్లన్న



హైదరాబాద్: తనను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినప్పటికీ బీసీ ఉద్యమం ఆగదని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "కులగణన దేశానికి ఆదర్శంగా ఉండాలి.. రాహుల్ గాంధీ తలెత్తుకుని తిరగాలని ఆశించాను. నూటికి నూరు శాతం పారదర్శకంగా సర్వే చేస్తేనే ఆదర్శంగా ఉంటుంది. అగ్రవర్ణాలను ఎక్కువగా చూపించి.. బీసీ వర్గాలను అణచిపెట్టే ప్రయత్నం చేశారు. నేను మాట్లాడింది తప్పు అయితే.. మళ్లీ కులగణనకు ఎందుకు సమయం ఇచ్చారు?" అని మల్లన్న ప్రశ్నించారు.

# ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక.. విధివిధానాలపై కోర్ కమిటీ భేటీ



హైదరాబాద్: ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కోర్ కమిటీ భేటీ అయింది. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. గంటకుపైగా కొనసాగిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికకు అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈనెల 29న ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ ఏర్పడుతున్నాయి. వాటిని భర్తీ చేసేందుకు ఇప్పటికే ఎన్నికల సంఘం నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. ఈ నెల 10న వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవడానికి గడువు విధించింది. ప్రధానంగా ఖాళీ ఏర్పడిన 5 ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి భారాసకు, మిగిలినవి కాంగ్రెస్ పార్టీకి దక్కనున్నాయి. ఈ నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు పీసీసీ కోర్ కమిటీ కసరత్తు మొదలుపెట్టింది. అందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం నిర్వహించారు. మరోసారి సమావేశం కావాలని పీసీసీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ పదవుల కోసం పీసీసీకి భారీ సంఖ్యలో దరఖాస్తులు అందినట్లు తెలుస్తోంది.

# తీన్మార్ మల్లన్న అంశం.. కాంగ్రెస్ నేతలు ఏమన్నారంటే



హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిపై కాంగ్రెస్ బహిష్కృత నేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సంచలన వ్యాఖ్యలు చేశారు. మల్లన్న వ్యాఖ్యలపై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లన్నకు మంత్రి సీతక్క కౌంటర్ ఇచ్చారు. కార్యకర్తల శ్రమతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. కొందరు నేతలు బీజేపీ, బీఆర్ఎస్ గొంతుకలై మాట్లాడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ చేయలేనిది తాము చేశామని.. అభినందించాల్సింది పోయి విమర్శలు చేస్తారా అని ప్రశ్నించారు.

ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో పోల్చుకునే స్థాయి మల్లన్నది కాదని చెప్పారు. కులగణనపై అభ్యంతరాలు ఉంటే శాసనసమండలిలో మాట్లాడాలని అన్నారు. కులగణనకు 50 రోజుల సమయం ఇచ్చామని.. అది సరిపోదా అని మంత్రి సీతక్క నిలదీశారు.

**మీనాక్షి నటరాజన్‌తో మంత్రి సీతక్క భేటీ...** కాగా.. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో మంత్రి సీతక్క, షబ్బీర్ అలీ, జానారెడ్డి, జీవన్ రెడ్డి, వీహెచ్ తదితరులు విడివిడిగా గాంధీభవన్‌లో సమావేశమయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తమ అభిప్రాయాలను చెప్పాలని పీఏసీ సభ్యులను మీనాక్షి నటరాజన్ కోరారు.

**బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు: వంశీ చంద్ రెడ్డి...** ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై ఏఐసీసీ కార్యదర్శి వంశీ చంద్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లన్న వ్యాఖ్యలను ఖండించారు. తన ఓటమికి సీఎం రేవంత్ రెడ్డి కారణం అంటూ మల్లన్న చేసిన వ్యాఖ్యలు కేవలం తన ఉనికి కోసమే అని చెప్పారు. తాను మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా పోటీ చేయాలన్నది అధిష్ఠానం నిర్ణయమని తెలిపారు. తన గెలుపు కోసం సీఎం రేవంత్ రెడ్డి ఎంతో శ్రమించారని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాల్లో భాగంగానే మహబూబ్ నగర్‌లో బీజేపీ గెలిచిందని అన్నారు. ఎమ్మెల్సీ కవిత జైల్లో ఉండటంతో ఆమెను బయటకు తీసుకు రావడం కోసం బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి అమ్ముడుపోయిందని ఆరోపించారు. గతంలో కేసీఆర్ లాంటి నేతలు ఎంపీగా పని చేసిన మహబూబ్‌నగర్ సిట్టింగ్ సీట్లో బీఆర్ఎస్ డిపాజిట్ కోల్పోయి బీజేపీకి మద్దతు ఇచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి నుంచి గ్రామ స్థాయి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ తన గెలుపు కోసం సమష్టిగా కృషి చేశారని వంశీ చంద్ రెడ్డి పేర్కొన్నారు.

**మల్లన్నకు జానారెడ్డి వార్నింగ్...** తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై జానారెడ్డి స్పందించారు. కులగణన అంశంలో తన పాత్ర లేదని చెప్పారు. మల్లన్న గాలి మాటలు మాట్లాడితే కుదరదని హెచ్చరించారు. తప్పు చేసిన వాడిని క్షమించే గుణం తనదని అన్నారు. తనను ఎవరూ తిట్టిన తాను పట్టించుకోనని చెప్పారు. తీన్మార్ మల్లన్న సమావేశంతో తనకు ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. ప్రత్యేక్ష రాజకీయాలకు తాను దూరం. సలహాలు అడిగితే ఇస్తానని తెలిపారు. పరిపాలన చేసే వారు సైతం ఆడిగితేనే సలహాలు, సూచనలు ఇస్తానని అన్నారు. తమ నాయకులు తనను విమర్శిస్తే ఖండిస్తాలేరన్నారు. అలాగని సమర్థించడం లేదని చెప్పారు. ఎందుకో వారినే అడిగి తెలుసుకోవాలని జానారెడ్డి అన్నారు.

**తీన్మార్ మల్లన్న అంశం నాకు సంబంధం లేదు: హనుమంతురావు...** తీన్మార్ మల్లన్న అంశం తనకు సంబంధం లేదని మాజీ ఎంపీ వీ. హనుమంతురావు అన్నారు. పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని మీనాక్షి నటరాజన్‌కు చెప్పానని అన్నారు. ఇవాళ (బుధవారం)గాంధీభవన్‌లో వీహెచ్ మీడియాతో మాట్లాడారు. మీనాక్షి నటరాజన్ తనను ఏమి అడగలేదని చెప్పారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని మీనాక్షి నటరాజన్‌కు చెప్పానని హనుమంతురావు అన్నారు.



# గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : మంత్రి పొన్నం ప్రభాకర్

కోహెడ : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ క్యాంపు ఆఫీస్‌లో నియోజకవర్గంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై వినతులు స్వీకరించారు. కొన్ని సమస్యలను ఆఫీసర్లతో మాట్లడి అక్కడే పరిష్కరించారు. యువత తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రి దృష్టికి తీసుకురాగా క్యాంపు ఆఫీస్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జాబ్ మేళాతో 5వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించామన్నారు. గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టుల కాల్వల కోసం భూసేకరణ వేగంగా జరుగుతుందని త్వరలోనే ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందిస్తామన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు సూచించారు. కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు.

# ఎమ్మెల్యే వేముల వీరేశానికి న్యూడ్ కాల్.. స్క్రీన్ రికార్డ్ చేసి.. అదే వీడియోను ఎమ్మెల్యేకే పంపారు..!

సైబర్ నేరగాళ్లు బరితెగించారు. డబ్బుల కోసం ఎమ్మెల్యేకే న్యూడ్ చేసి బెదిరించడం కలకలం రేపింది. స్క్రీన్ రికార్డ్ చేసి ఎమ్మెల్యేకే వీడియో పంపడం.. స్పందించక పోవడంతో అదే వీడియోను కార్యకర్తలకు పంపించడం నల్గొండ జిల్లాలో సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే.. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశానికి ఒక వీడియో కాల్ వచ్చింది. అనుచరులతో మాట్లాడుతుండగా ఫోన్ రావడంతో లిఫ్ట్ చేయగా అది న్యూడ్ కాల్ అని అర్థం అయ్యింది. దీంతో వెంటనే కాల్ కట్ చేసినా.. అప్పటికే స్క్రీన్ రికార్డ్ చేసిన సైబర్ క్రిమినల్స్.. అదే వీడియోను ఆయనకే పంపించి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో షాక్ కు గురయ్యారు ఎమ్మెల్యే వీరేశం. సైబర్ నేరగాళ్ల డిమాండ్ కు ఎమ్మెల్యే స్పందించకపోవడంతో బెదిరింపులకు దిగారు. "వీడియో కాంగ్రెస్ లీడర్లందరికీ పంపిస్తాం.. మీ ఇష్టం.." అంటూ ఎమ్మెల్యేనే హెచ్చరించారు. అంతే కాకుండా "ఇది మీ జీవితంతో ముడిపడి ఉన్న అంశం" అంటూ బెదిరింపులకు దిగారు. ఎమ్మెల్యే వీరేశం నుంచి రిప్లై రాకపోవడంతో పలువురు అభిమానులు, అనుచరులకు రికార్డ్ చేసిన వీడియో పంపించారు నేరగాళ్లు. ఎమ్మెల్యే స్పందించకపోవడంతో అదే వీడియోను నియోజకవర్గంలోని అభిమానులకు ఫార్వార్డ్ చేశారు కేటుగాళ్లు. దీంతో తమకు ఇలాంటి వీడియోలు వచ్చాయని అభిమానులు ఫోన్ చేయడంతో ఎమ్మెల్యే వీరేశం కంగుతిన్నారు. ఈ వ్యవహారంలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు ఎమ్మెల్యే వీరేశం. సైబర్ నేరగాళ్లనుంచి ప్రజాప్రతినిధులు, అధికారులకు న్యూడ్ కాల్స్ రావడం ఇదే మొదటి సారి కాదు. గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎమ్మెల్యే కూడా ఇటువంటి పరిస్థితిని ఎదుర్కొన్నారు. అదేవిధంగా గతంలో ఏపీ హైకోర్టు మెంబర్ కు కూడా ఇలాంటి ఘటన ఎదురైంది. న్యూడ్ కాల్ చేసి ఆ తర్వాత రూ.25 వేల ఇస్తే సరి లేదంటే వైరల్ చేస్తామని బెదిరించడం ఆ మధ్య సంచలన సృష్టించింది. డబ్బుల కోసం సైబర్ నేరగాళ్లు కామన్ మ్యాన్ నుంచి ఎమ్మెల్యేల వరకు ఎవరినీ వదలటం లేదు. తాజాగా నకిరేకల్ ఎమ్మెల్యేకు ఈ చేదు అనుభవం కలగడం సంచలన సృష్టిస్తోంది.

# కేసీఆర్‌పై కోపంతో రైతులకు అన్యాయం చేయొద్దు..: హరీష్‌రావు




సిద్దిపేట జిల్లా: బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రంగనాయక సాగర్‌లోకి నీటిని విడుదల చేసినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. చిన్న కోడూరు మండలం, చంద్లపూర్‌లోని రంగనాయక సాగర్ ప్రాజెక్ట్‌ను హరీష్ రావు బుధవారం సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సిద్దిపేట నియోజక వర్గంలో 50 వేల ఎకరాల్లో పంట సాగు అవుతుందని, తన కోరిక మేరకు ఒక్క టీఎంసీ నీటిని ఉత్తమ్ కుమార్ రెడ్డి విడుదల చేశారన్నారు. గత ప్రభుత్వం (బీఆర్ఎస్) చేసిన మంచి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం తుడిచి పెట్టాలని చూస్తోందని, ఎస్ఆర్ఎస్పీ నీరు తగ్గినా కూడా కాళేశ్వరం ద్వారా రెండు పంటలకు సాగునీరు విడుదల చేశామని హరీష్ రావు చెప్పారు. మేడిగడ్డలోని ఒక్క బ్లాక్‌లోని ఒక పిల్లర్ మాత్రమే కుంగితే బీఆర్ఎస్ పై బురద జల్లి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఇప్పుడు గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయని, కేసీఆర్‌పై కోపంతో తెలంగాణ రైతులకు అన్యాయం చేయవద్దని కోరారు. కల్లులేని కబోదుల్లగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. కాళేశ్వరం తెలంగాణకు వరప్రదయిని అని.. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు కళు తెరవాలని హరీష్ రావు సూచించారు. కాగా ప్రభుత్వ భూముల అమ్మకానికి కాంగ్రెస్ సర్కార్ పన్నాగం వేసిందని మాజీమంత్రి హరీశ్ రావు ఆరోపించారు. భూములు అమ్మే ప్రసక్తే లేదని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. సభను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే ఇంచు భూమిని కూడా అమ్మబోమని ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసి.. ఇప్పుడు రూ. వేల కోట్ల విలువైన భూములను వేలం వేసేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ పేరిట వేలం పాట నిర్వహించేందుకు కన్సల్టెంట్ నియామకానికి గత నెల 28న టెండర్లు పిలవడం సర్కారు దిగజారుడు తనానికి పరాకాష్ఠ అన్నారు. తెలంగాణ దేశానికి రోల్‌మోడల్ అయిందని టెండర్ నోట్‌లో ప్రస్తావించారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో అద్భుతమైన ప్రగతిని సాధించిన తెలంగాణను కాంగ్రెస్ 14 నెలల పాలనలో తిరోగమనం బాట పట్టించారని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా హరీశ్‌రావు విమర్శించారు.

# అసలు విషయం చెప్పేసిన కల్పన కూతురు..

హైదరాబాద్, మార్చి 05: తన కూతురు వల్లే సింగర్ కల్పన ఆత్మహత్యాయత్నం చేసుకుందంటూ ప్రచారం జరుగుతోంది. తన కూతురు తన మాట వినలేదనే కారణంగా మనస్తాపానికి గురైన కల్పన.. నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, ఈ ప్రచారాలు, వార్తలపై కల్పన కూతురు తొలిసారి రియాక్ట్ అయ్యింది. కల్పన ఆత్మహత్యాయత్నంపై సమాచారం అందుకున్న ఆమె కూతురు.. హుటాహుటిన కేరళ నుంచి హైదరాబాద్ చేరుకుంది.

ఈ సందర్భంగా పోలీసులు ఆమె స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. మరి పోలీసులకు కల్పన కూతురు ఏం చెప్పింది.. పూర్తి వివరాలు తెలుసుకుందాం.

**కల్పన కూతురు స్టేట్‌మెంట్ ఇదే..** కల్పన ఆత్మహత్యాయత్నంపై ఆమె కూతురు స్పందించింది. తన తల్లి కల్పన ఆత్మహత్యాయత్నం చేయలేదని తెలిపింది. నిద్రమాత్రలు ఓవర్ డోస్ వేసుకుందన్నారు. డాక్టర్ సూచించిన నిద్రమాత్రలే వేసుకుందని వివరించింది. మానసిక ప్రశాంతత కోసం నిద్రమాత్రలు వేసుకుంటోందని కల్పన కూతురు తెలిపింది. తమ కుటుంబంలో ఎలాంటి సమస్యా లేదన్నారు. తన తల్లి కల్పన హైదరాబాద్‌లో లా పీజీ చేస్తోందని వివరించింది. కల్పన మానసిక ఒత్తిడికి గురవుతూ, నిద్రలేమి సమస్యతో బాధపడేదని పేర్కొంది.

**పోలీసులు ఏం చెప్పారంటే..** కల్పన పెద్ద కూతురు స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డ్ చేశారు. అంతకుముందు.. కేరళ నుంచి హైదరాబాద్ రమ్మంటే కూతురు రావడం లేదని కల్పన మనస్థాపనం చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. కేరళ వెళ్లిన సందర్భంలో కూడా ఈ విషయంపై ఇరువురి మధ్య గొడవలు జరిగాయట. హైదరాబాద్‌కి వచ్చిన తరువాత మరోసారి కూతురుని తన వద్దకు రావాలని కల్పన కోరిందట. అయినప్పటికీ ఆమె అంగీకరించలేద. దీంతో తన కూతురు తన మాట వినడం లేదని కల్పన మనస్తాపానికి గురైందని, అలా నిద్ర మాత్రలు వేసుకున్నట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. కల్పన మొదటి భర్త కూతురు కేరళలో చదువుతోంది. అక్కడి నుంచి హైదరాబాద్‌కు వచ్చేయాలని కల్పన ఆమెను అనేకసార్లు కోరింది. ఈ విషయంలోనూ ఇద్దరి మధ్య గొడవలు జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు.



# సూర్యరాయాంధ్ర నిఘంటు నిర్మాత మహీపతి సూర్యారావు

## - మార్చి 6... పీఠాపురం సంస్థానాధీశుల వర్ధంతి



రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు పిఠాపురం సంస్థానా న్ని పరిపాలించిన వారిలో చివరి వాడు. సాహిత్య చక్రవర్తి, కళా ప్రపూర్ణ, సాహిత్య పోషకులు, డాక్టర్ రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దర్ 1907–1948 పిఠాపురం సంస్థానాధీదులుగా ప్రసిద్ధులు. ఆయన 1885, అక్టోబర్, 5 న మంగాయ మ్మ, రావు వేంకట మహీపతి గంగాధర రామారావు దంపతులకు జన్మించాడు. ఐదు సంవత్సరాల వయసు వచ్చే సమయానికి తండ్రి మరణించాడు. అప్పుడు గంగాధర రామారావు దత్తపుత్రుడు వారసు డు కాదని, రాజ్యాధికారం తనదే అని కోర్టుకు ఎక్కాడు. ఈ వ్యాజ్యం ఎక్కువ రోజులు నడిచి చివరకు విజయలక్ష్మి ఆయననే వరించింది. ఈ వ్యాజ్యం కోర్టులో ఉన్నంత కాలం, అనంతరం ఆయన మైనారి టీ తీరేవరకు ఈ సంస్థానం కోర్ట్ ఆఫ్ వార్డ్స్ అధీనంలో ఉంది. ఈ సమయంలో ఆయన మద్రాసు లోని న్యూయింగ్టన్ కళాశాలలో ఉండి విద్యాభ్యాసం చేశాడు. ఈ సమయంలోనే సంస్కృతం, తెలు గు, కన్నడం, తమిళం, ఆంగ్ల భాష లను నేర్చుకుని ఈ ఐదు భాషలలో ఉత్తమ గ్రంథాలను పఠించాడు. తెలుగు, ఇంగ్లీషు భాషలలో కవిత్వం చెప్పగలిగే నేర్పును సంపాదించాడు. తర్వాత నూజివీడు సంస్థానాధిపతియైన రాజా వెంకట రంగయ్యప్పారావు ప్రథమ పుత్రిక అయిన ఆండాళమ్మను 1906, ఏప్రిల్ 2 న వివాహం చేసు కున్నాడు. వంశాచారమును బట్టి ఆండాళమ్మ అత్తింటికి వచ్చిన వెంటనే చిన్నమాంబా దేవిగా తన పేరును మార్చుకున్నది. తర్వాత 1907, ఫిబ్రవరి 19 న పిఠాపురం సంస్థానపు సింహాసనాన్ని అధిష్టిం చాడు. 1948లో సంస్థానాలు, జమీందారీ వ్యవస్థ రద్దయ్యే వరకు ఇతడు పిఠాపురం మహారాజుగా వెలుగొందాడు. ఆయనకు చిన్న మాంబా దేవి ద్వారా మొదట 1910లో గంగాధర రామారావు అనే పుత్రుడు జన్మించాడు. తర్వాత వారికి సూర్యారావు అనే కుమారుడు, మంగయమ్మ, భావ యమ్మ, సీతాదేవి, కమలాదేవి అనే కుమార్తెలు కలిగారు. ఆయన కుమార్తె సీతాదేవి బరోడా సంస్థాన పు మహారాణి అయ్యింది. రాజా సూర్యారావు గారు 79 సంవత్స రాలు జీవించి 1964, మార్చి 6 వ తేదీన మరణించాడు. ఆయన తన తండ్రిచేత స్థాపించ బడిన పిఠాపురం హైస్కూలు, కాకినాడ కాలేజీలను అమితమైన ధనం వెచ్చించి అభివృద్ధి చేసి దక్షిణ ఆంధ్ర రాష్ట్రంలో అటువంటి విద్యాసంస్థలు మరొకటి లేదని పించాడు. కాకినాడ కాలేజీని ఫస్ట్ గ్రేడ్‌గా ఉద్ధరించి ఎన్నో భవనాలను కట్టించాడు. ఆ కాలేజీలో చదివే స్త్రీలకు, పేద విద్యార్థులకు ఉచితం గా చదువు చెప్పాడు. అంతే కాకుండా పట్టభద్రులై విదేశాలకు వెళ్లి, ఉన్నతవిద్య పొందగోరే వారికి సంపూర్ణ ధనసహాయం చేశాడు. పిఠాపురం హైస్కూలులో హరిజన విద్యార్థినీ విద్యార్థుల కోసం వసతి గృహాన్ని నెలకొల్పి దానికయ్యే వ్యయాన్ని అంతా తానే భరించా డు. వారికి ప్రైవేటు టీచర్లను కూడా ఏర్పరిచి అనేకమందిని వృద్ధిలోనికి తీసుకు వచ్చాడు. రాజమండ్రి లోని వీరేశలింగోన్నత పాఠశాల ఆయన పోషణతోనే నడిచింది. రఘుపతి వేంకటరత్నం నాయుడు ప్రేరణతో కాకినాడలో బ్రహ్మసమాజ ప్రార్థనా మందిరాన్ని, అనాథ శరణాలయాన్ని ఏర్పాటు చేశాడు. రాణీ చిన్నమాంబాదేవి కోరికపై కాకినాడ లేడీస్ క్లబ్‌కు 40 ఎకరాల స్థలాన్ని ఇచ్చాడు. రాణీ ఆధ్వర్యంలో పిఠాపురంలో ఘోషా స్కూలును నడిపాడు. 1920 ప్రాంతములో విశ్వకవి రవీంద్రనాథ టాగూరు పిఠాపురం సందర్శించి నప్పుడు ఇతడు సుమారు లక్షరూపాయలు పారితోషికంగా ఇచ్చాడు. ప్రాచ్య, పాశ్చాత్య విద్యలను సమదృష్టితో గౌరవించి వాటి అభివృద్ధికై ఎంతో ధనాన్ని వెచ్చించాడు. ఆయన ఔదార్యము తోనే తెలుగు దేశము లోని ఆనాటి ప్రతి సాహిత్య సంస్థ అభివృద్ధిని చెందింది. ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజము, విజ్ఞాన చంద్రికా మండలి, ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాలలకు విశేషమైన ధన సహాయం చేశాడు. జయంతి రామయ్య స్థాపించిన ఆంధ్ర సాహిత్య పరిషత్తును ప్రోత్సహించి సూర్యరాయాంధ్ర నిఘంటువు నిర్మాణానికి కారకుడైనాడు. అంతే కాకుండా ఎన్నో ప్రాచీన గ్రంథాలను పరిషత్తు ద్వారా లక్షల రూపాయలు వెచ్చించి ముద్రించారు. ఆయన సాహిత్య ప్రపంచానికి చేసిన సేవ అంతా ఒక ఎత్తు, సూర్యరాయాంధ్ర నిఘంటు నిర్మాణానికి, ప్రచురణకు పాటుపడటం ఒక ఎత్తు. 1911, మే 12 న జరిగిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభలో జయంతి రామయ్య పంతులు నిఘంటు నిర్మాణానికి చేసిన ప్రతిపాదన విని, ఆ నిఘంటు నిర్మాణానికయ్యే మొత్తం వ్యయం భరించడానికి సంసిద్ధుడైనాడు. ఆ ప్రకటనకు సభలోని వారంతా ఆనంద పడ్డారు. జయంతి రామయ్య ఆధ్వర్యంలో ప్రారంభమైన నిఘంటువుకు "శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు" అని నామకరణం చేశారు. ఈ నిఘంటు నిర్మాణానికి కాశీభట్ట సుబ్బయ్య శాస్త్రి, తంజనగరము తేవప్పెరు మాళ్ళయ్య, పురాణపండ మల్లయ్య శాస్త్రి, పేరి పాపయ్య శాస్త్రి, శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రి, కూచి నరసింహం, చర్ల నారాయణ శాస్త్రి, పిశుపాటి చిదంబర శాస్త్రి, వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి, దర్భా సర్వేశ్వర శాస్త్రి, పిశుపాటి విశ్వేశ్వర శాస్త్రి, ప్రయాగ వేంకటరామ శాస్త్రి, అమలాపురపు విశ్వేశ్వర శాస్త్రి, బులుసు వేంకటే శ్వర్లు, చిలుకూరి వీరభద్ర శాస్త్రి, దువ్వూరి సూర్యనారాయణ శాస్త్రి, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి, చెఱుకుపల్లి అప్పారాయ శాస్త్రి, ఇంద్రగంటి సూర్య నారాయణ శాస్త్రి, చిలుకూరి విశ్వనాథ శాస్త్రి, ఆకుండి వేంకట శాస్త్రి, ఓలేటి సూర్యనారాయణ శాస్త్రి, పాలెపు వెంకటరత్నం, సామవేదం శ్రీరామమూర్తి శాస్త్రి, పన్నాల వేంకటాద్రిభట్ట శర్మ, దివాకర్ల వేంకటావధాని మొదలైన పండితులు పాటుపడ్డారు. పిఠాపుర సంస్థాన చరిత్రలో రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు కాలం స్వర్ణయుగంగా చెప్పుకోవచ్చు. ఆయన సంస్థానం లో ఆస్థాన పండితులుగా శ్రీపాద లక్ష్మీనరసింహ శాస్త్రి (తర్కశాస్త్రం), తాతా సుబ్బరాయ శాస్త్రి (వ్యాకరణం), చిలుకూరి నారాయణ శాస్త్రి, వేదుల సూర్యనారాయణ శాస్త్రి, గుదిమెళ్ల వేంకట రంగాచార్యులు (విశిష్టాద్వైతము), వడలి లక్ష్మీనారాయణ శాస్త్రి (వేదం), దెందుకూరి నరసింహ శాస్త్రి (వేదాంతం), తుమురాడ సంగమేశ్వర శాస్త్రి (సంగీతం) మొదలైన దిగ్గంతులు ఉండేవారు. ఈ పండితుల సహకారంతో ఆయన ప్రతి యేటా పీఠికాపుర సంస్థాన విద్వత్పరీక్షల పేరుతో విజయ దశమి నవరాత్రి ఉత్సవాల సందర్భంలో శాస్త్ర పరీక్షలు నిర్వ హించి, ఉత్తీర్ణులైన వారిని కానుకల తో సత్కరించేవాడు. ప్రబంధ రచనలో కూడా పోటీలు నిర్వహించే వాడు. ఆనాటి సుప్రసిద్ధ పండితులు ఎందరో ఈ పరీక్షలలో బహూకృతులైనవారే. పానుగంటి లక్ష్మీనరసింహారావు, వేంకట రామకృష్ణ కవులు ఆయన ఆస్థాన కవులుగా ఉన్నారు. వీరు కాక చిలకమర్తి లక్ష్మీనరసింహం, కందుకూరి వీరేశలింగం, టేకుమళ్ళ అచ్యుత రావు, దేవగుప్తాపు భరద్వాజము, పెండ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి, వారణాసి సుబ్రహ్మణ్య శాస్త్రి, శొంఠి భద్రాద్రి రామ శాస్త్రి, వేంకట పార్వతీశ కవులు, దాసరి లక్ష్మణకవి, వేదుల రామచంద్రకీర్తి, శ్రీరాం వీరబ్రహ్మకవి, మధునా పంతుల సత్యనారాయణ శాస్త్రి, కూచి నరసింహము, నడకు దుటి వీరరాజు మొదలైన ఎందరో కవులు ఆయన చేత సన్మాన సత్కారాలనుఅందుకున్నారు. 1929, జనవరి 29 న మద్రాసు గవర్నరు వెల్లింగ్టన్ ప్ర భువు ఆయనకు మహారాజా అనే బిరుదును ఇచ్చి గౌరవించాడు. 1938, అక్టోబరు 1 వ తేదీన ఆంధ్ర విశ్వ విద్యాలయం వారు గౌరవ డి.లిట్. పట్టాను ప్రదానం చేశారు. 1953లో ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించారు. రాజా సూర్యారావు గారు 79 సంవత్సరాలు జీవించి 1964, మార్చి 6 వ తేదీన మరణించాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# హిందీ భాష వ్యాప్తికి మోటూరి ఎనలేని సేవలు - మార్చి 6...మోటూరి సత్యనారాయణ వర్ధంతి



మోటూరి సత్యనారాయణ హిందీ భాష ప్రచారానికి ఎనలేని సేవలు అందించిన విద్యావేత్త. భారత రాజ్యాంగాన్ని రూపొందించిన భారత రాజ్యాంగ సభలో సభ్యులు. 1966 వరకు రాజ్యసభ (భారత ప్రభుత్వ ఎగువ సభ) లో నామినే టెడ్ సభ్యులు. భారత రాజ్యాంగం లో హిందీని అధికారిక భాషగా మార్చడంలో ఆయన ముఖ్యపాత్ర పోషించారు. రాజభాష కమిషన్ సభ్యులుగా, స్వాతంత్ర్య సమర యోధులుగా, రాజ్యసభ సభ్యులు గా, హిందీ వికాస సమితి స్థాపకులు గా, హిందీ ప్రచార సభ ప్రధాన కార్యదర్శిగా, బహుభాషా వేత్తగా బహుముఖ సేవలు అందించిన ప్రతిభా శాలి. భారత ప్రభుత్వ పద్మశ్రీ, పద్మ భూషణ్ పురస్కార గ్రహీత. మోటూరి సత్యనారాయణ (ఫిబ్రవరి 2, 1902 – మార్చి 6, 1995) 1902, ఫిబ్రవరి 2 వ తేదీన కృష్ణా జిల్లా దొండపాడు గ్రామంలో పెద పిచ్చయ్య, రత్తమ్మ దంపతు లకు జన్మించారు. ప్రాథమిక విద్య అనంతరం తెలుగు, సంస్కృతం అభ్యసించారు. ఆంధ్ర జాతీయ కళాశాలలో ఉన్నతులైన గురువుల వద్ద శిక్షణ పొంది హిందీ బాగా అభ్యసించారు. తర్వాత ఇంగ్లీషు, తమిళం, కన్నడం, మలయాళం, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ మొద లైన భాషలు కూడా నేర్చుకున్నారు. ఆయనకు రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక, ఐతిహాసిక, వైజ్ఞానిక, సాంకేతిక విషయాలలో లోతుగా ప్రవేశం ఉండేది. అయన హిందీ ప్రచారంతో జీవితాన్ని ప్రారంభించి క్రమంగా సంఘటకులుగా, కార్య దర్శిగా, చివరకు 1938లో హిందీ ప్రచార సభకు ప్రధాన కార్యదర్శి అయి 1961 వరకు కొనసాగారు. ఆ సంస్థ ప్రథమ ప్రధాన కార్యదర్శి పండిత హరి హర శర్మకు కుడి భుజంగా ఉండి సహకరించారు. అయన దూరదృష్టి, అవగాహన వల్లనే ఈ సభ హిందీ సాహిత్య సమ్మేళనం, ప్రయాగవారి బంధనం నుండి విముక్తి పొంది 1927లో స్వతంత్ర సంస్థగా ఆవిర్భవించింది. మోటూరి ప్రధాన కార్యదర్శిగా ఉన్నంతకాలం దక్షిణ భారత హిందీ ప్రచార సభ చరిత్రలో సువర్ణా క్షరాలతో లిఖింప దగినది. 1936లో ప్రచారసభకు 4 రాష్ట్రాలలో, 4 ప్రాంతీయ శాఖల నిర్మాణం అయన దూరదృష్టిని నిరూపిస్తుంది. మోటూరి సత్య నారాయణ... మహాత్మాగాంధీ, రాజేంద్ర ప్రసాద్ లకు అత్యంత విశ్వాస పాత్రులు. 1946లో జరిగిన సభ రజతోత్స వానికి బాపూజీ 12 రోజులు ఉండి సమావేశాలు జరిపించారు. ప్రతి దినం గాంధీ ప్రార్థనా సమావేశాలలో వేలాది మంది పాల్గొనేవారు. మద్రాసు కార్పొరేషన్ నుండి త్యాగరాయ నగరంలో సుమారు ఐదున్నర ఎకరాల భూమిని సంపాదించి అప్పటి అవసరాల కనుగుణంగా భవనాలను నిర్మిం చారు. ముద్రణాలయం, పుస్తక ప్రచురణ, పరీక్షలు నిర్వహించడం ద్వారా ఆదాయం సమకూర్చారు. హిందీ ప్రచారాన్ని పెంపొందించ డానికి ప్రతి రాష్ట్రంలోను, కొన్ని జిల్లాలలోను, మండలాల వారీగా సంరక్షకులను ఏర్పాటుచేసి నూతన ప్రణాళికల ద్వారా దక్షిణ భారత మంతా మారుమూలల వరకు హిందీని వ్యాపింప జేశారు. మోటూరి నేతృత్వ కృషి ప్రజలలో హిందీ పట్ల ప్రేమ, గౌరవం పెంచింది. 1942 లో క్విట్ ఇండియా ఉద్యమం లో జైలు శిక్ష అనుభ వించారు. స్వాతంత్ర్య సమర యోధులుగా తామ్రపత్ర గ్రహీతలయ్యారు. రాజకీయ రంగంలో కూడా విలువైన సేవలు అందించారు. భారత రాజ్యాంగ చట్టంలో 17వ భాగం రాజభాష అధ్యాయ నిర్మాణంలోను, దాని డ్రాఫ్టింగ్, రాజ్యాంగ సభలో నెగ్గించడంలో అయన కృషి, సహకారం ఎంతో ఉన్నాయి. రాష్ట్ర పతి ద్వారా 1954 నుండి 1966 వరకు వరుసగా రెండుసార్లు రాజ్య సభ సభ్యుడిగా నామినేట్ చేయ బడ్డారు. 1956లో రాజభాషా కమి షన్ కు సభ్యులుగా పని చేశారు. తెలుగు భాషా సమితి స్థాపక కార్యదర్శిగా "తెలుగు విజ్ఞాన సర్వస్వం" 16 భాగాలలో ప్రచురిం చారు. అదే విధంగా హిందీ వికాస సమితిని కూడా స్థాపించి హిందీలో "విశ్వవిజ్ఞాన సంహిత" పేరుతో హిందీ విజ్ఞాస సర్వస్వాలను ప్రచురింప చేశారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆయనను కళాప్రపూర్ణతో గౌరవిస్తే, కొన్ని విశ్వ విద్యాలయాలు గౌరవ డాక్టరేట్ తో సన్మానించాయి. భారత ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ (1958), పద్మభూషణ్ (1962) పురస్కారాల్ని ఇచ్చి గౌరవించింది. అయన సేవలను పురస్కరించు కుని హైదరాబాదులో రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన 1957లో పెద్ద ఎత్తున అభినందన సభ జరిపి అభినందన గ్రంథం సమర్పించారు. ఆయన 1995 సంవత్సరం మార్చి 6 వ తేదీన పరమపదించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# ఆన్ లైన్ గేమ్స్ ఆడొద్దన్నందుకు కుటుంబాన్ని చంపేసిన ఇంటర్ విద్యార్థి!



నేటి యువతకు విచక్షణ ఉండటం లేదు. చిన్న చిన్న కారణాలకే తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నారు. సోషల్ మీడియా ప్రభావం, పరిసరాల ప్రభావంతో యువత ఎంతకైనా తెగించవచ్చు..ఏమైనా చేసేయవచ్చు..అనే ఆలోచనలో ఉంటున్నారు. కుటుంబ బంధాలు మరుస్తున్నారు. క్షణికావేశంలో పెను నష్టానికి కారణమవుతున్నారు. ఆన్ లైన్ గేమ్స్ ఆడొద్దు..సెల్ ఫోన్ ఎక్కువగా వాడొద్దన్నందుకు తాము ఆత్మహత్య చేసుకోవడమో..ఇతరులను కొట్టడమో, చంపడమో చేస్తున్నారు. ఇటీవల ఇలాంటి నేరాలు పెరిగి ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా ఒడిశాలో ఓ దారుణం జరిగింది. ఆన్ లైన్ గేమ్స్ ఆడొద్దన్నారని ఓ విద్యార్థి ఏకంగా తన తల్లిదండ్రులు, సోదరిని హత్య చేశాడు. ఒడిశాలోని జగత్సింగపూర్ జిల్లా సదర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జయబాడా గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున తల్లిదండ్రులతో సహా తోబుట్టువును దారుణంగా చంపేశాడు. ఇంటర్ చదివే సూర్యకాంత శెట్టి..తండ్రి ప్రశాంత శెట్టి(58), కనకలత(45), సోదరి రోజాలిన్(16) ల తలలపై బలంగా మోదీ హత్య చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడి అదుపులోకి తీసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ముగ్గురి డెడ్ బాడీలను పోస్టుమార్టానికి తరలించారు. ఆన్ లైన్ గేమ్స్ కు బానిసైన ఇంటర్ చదివే విద్యార్థి సొంత కుటుంబాన్ని హత్య చేయడం ఒడిషా రాష్ట్రంలో సంచలనం రేకెత్తించింది. నేటి సమాజంలో ఆన్ లైన్ గేమ్స్, వీడియో గేమ్ లు యువతపై పెను ప్రభావం చూపిస్తున్నాయి. విద్యార్థులు అవగాహన లేమితో ఆన్ లైన్ గేమ్స్ ఆడటం వాటిలో నష్టపోవడం, లక్షల రూపాయలను అందులో పోగొట్టుకుని ఆత్మహత్యల దాక వెళ్తున్నారు. మరికొందరు వీటి వల్ల అప్పుల పాలై ఇతరులను చంపడం చేస్తున్నారు. ఆన్ లైన్ గేమ్స్ ఆడొద్దు.. సోషల్ మీడియా చూడొద్దు అంటున్న తల్లిదండ్రులు, తోబుట్టువులను కొట్టడానికి, చంపడానికి వెనకాడడం లేదు. వీటి ద్వారా యువతలో నేర స్వాభావం పెరిగిపోతోంది. ఇది సమాజంలో అరాచకాలకు దారితీస్తోంది. ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టడి చేయడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజికవేత్తలు, ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. ఆన్ లైన్ గేమ్స్ యాప్స్ ను బ్యాన్ చేయడంతో పాటు.. వాటి వల్ల జరిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు టెక్నాలజీలో ముందుండాలని, సోషల్ స్టేటస్ లో భాగంగా ఖరీదైన సెల్ ఫోన్లు కొనివ్వడం, పాకెట్ మనీకి వేల రూపాయలు ఇవ్వడం వంటివి మానుకోవాలని సైకాలజిస్టులు సూచిస్తున్నారు. సమాజంలో ఆన్ లైన్ విపరీత పోకడలకు పోతోందని ఈ విషయంలో తల్లిదండ్రులు, ప్రభుత్వాలు జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు.

# పేరుకే పట్టభద్రులు.. ఓటేయటం రాదా? 10 శాతం చెల్లని ఓట్లు?

పేరుకే పట్టభద్రులా అన్నట్లుగా మారింది తాజాగా తెలంగాణలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక. ఈ ఎన్నిక ఫలితాన్ని తేల్చేందుకు ఓట్ల లెక్కింపు వేళ.. ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి. ఈ ఎన్నిక కోసం ఓట్లు వేసినోళ్లంతా పీజీలు.. పీహెచ్ డీలు.. కనీసం డిగ్రీ చదివిన వారే. అలాంటి ఓటర్లకు ఓట్లు వేయటం రాదా? అన్నదిప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. దీనికంటే ఆశ్చర్యకరమైన అంశం ఇంకొకటి ఉంది. టీచర్ల ఎమ్మెల్సీల ఎన్నికల్లో ఓట్లు వేసిన టీచర్ల ఓట్లలో కూడా చెల్లని ఓట్లు పెద్ద ఎత్తున ఉండటంతో ముక్కున వేలేసుకునే పరిస్థితి. పల్లలకు పాఠాలు చెప్పే టీచర్లకు తమ ఓటు తాము వేసుకోకపోవటం దేనికి నిదర్శనం? అన్నదిప్పుడుచర్చగా మారింది. కరీంనగర్ – మెదక్ – ఆదిలాబాద్ – నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు 3.55 లక్షల ఓట్లు ఉన్నాయి. వీటిల్లో



తాజా ఎన్నికల్లో పోల్ అయిన ఓట్లు 2,52,100 మాత్రమే. అంటే.. దాదాపు 1.03 లక్షల ఓట్లు పోల్ కాలేదు. ఇక.. పోల్ అయిన ఓట్లలో 28వేల ఓట్లు చెల్లనివిగా గుర్తించారు. అంటే.. దగ్గర దగ్గర 11 శాతం ఓట్లు చెల్లకపోవటం దేనికి నిదర్శనం? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. చదువుకున్నోళ్లు ఓట్లు వేసే విషయంలో తప్పులు చేస్తారా? అన్న సందేహంతో మరోసారి వెరిఫై చేశారు. అప్పుడు కూడా అలాంటి ఫలితమే రావటం గమనార్హం. ఇక.. కరీంనగర్ – మెదక్ – ఆదిలాబాద్ – నిజామాబాద్ జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 897 ఓట్లు.. వరంగల్ – ఖమ్మం – నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ పరిధిలోనూ 499 ఓట్లు చెల్లలేదు. పిల్లల కు పాఠాలు చెప్పే టీచర్లు తాము వేయాల్సిన ఓటును కూడా సరిగా వేయకపోవటం దేనికి నిదర్శనం? అన్నదిప్పుడు చర్చగా మారింది. ఇదిలా ఉంటే.. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల వేదన అంతా ఇంతా కాదు. ఎందుకంటే.. ఈ ఎన్నికల్లో ఓటర్లుగా ఉన్న పట్టభద్రులు.. టీచర్లు సైతం ఓటు వేసేందుకు డబ్బులు తీసుకున్నట్లుగా చెబుతున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కొందరు అభ్యర్థులు ఓటుకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు పంచినట్లుగా ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో పట్టభద్రుల అభ్యర్థుల ఎన్నికల్లో ఓటర్లకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఇంతలా ఖర్చు చేస్తే కొందరు ఓటు వేయటానికే వెళ్లకపోవటం.. వేసినోళ్లలో తప్పుగా వేయటం ఏమిటంటూ కొందరు అభ్యర్థులు లబోదిబోమంటున్న పరిస్థితి. ఓటర్ల తప్పులు తమ పాలిట శాపాలుగా మారుతాయన్న ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

# ఎయిర్ పోర్టులో 14.8 కేజీల బంగారం పట్టివేత.. సినీ నటి అరెస్ట్

బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా బంగారం పట్టుబడింది. దుబాయ్ నుండి వచ్చిన కన్నడ సినీ నటి రన్యా రావు వద్ద నుంచి 14.8 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు DRI (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు తెలిపారు.

**– తరుచుగా దుబాయ్ ప్రయాణాలు.. అధికారులు అనుమానం**... రన్యా రావు ఇటీవల తరచుగా దుబాయ్ వెళ్లి వస్తున్నారని అధికారులు గుర్తించారు. గత 15 రోజుల్లోనే 4 సార్లు ఆమె దుబాయ్ వెళ్లినట్లు రికార్డులు చెబుతున్నాయి.

ఈ అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా ఉంచిన అధికారులు ఎయిర్ పోర్టులో ఆమెను అదుపులోకి తీసుకుని తనిఖీలు చేపట్టారు.



**–అధిక మొత్తంలో బంగారం పట్టివేత...** రన్యా రావు లగేజీని పరిశీలించగా 14.8 కిలోల బంగారం దొరికినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. తగిన ఆధారాలను సమర్పించలేకపోవడంతో ఆమెను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

ఈ ఘటనపై DRI బృందం ముమ్మరంగా విచారణ చేపట్టింది. బంగారం స్మగ్లింగ్ వ్యవహారంలో రన్యా రావుకు ఎవరైనా సహకరించారా? మరో పెద్ద ముఠా ఉన్నదా? అనే కోణంలో అధికారులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

**–రన్యా రావు ఎవరు?** రన్యా రావు కన్నడ చిత్రసీమలో నటిగా గుర్తింపు పొందారు. కిచ్చా సుదీప్ హీరోగా నటించిన 'మాణిక్య' చిత్రంతో తెరంగేట్రం చేశారు. ఆ తర్వాత ఆమె 'మాస్టర్ పీస్', 'చంద్రిక', వాఘా , పటాకీ వంటి చిత్రాల్లో నటించారు. అయితే, ఆమెకు స్మగ్లింగ్ సంబంధం ఉందా? లేక కేవలం ఎవరైనా ఇరికించారా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలను అధికారులు త్వరలో వెల్లడించనున్నారు. బంగారం స్మగ్లింగ్ కేసులు దేశంలో రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో నటిపై అనుమానంతో ఆమెను అరెస్ట్ చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## సంపాదకీయం

### మూడో భాష మీద సీఎం స్టాలిన్ మెలిక సరే..

# వాస్తవం ఏంటి?

ఒక ఇష్యూను టేకప్ చేసిన తర్వాత దాన్ని వదిలిపెట్టకుండా కొనసాగించే విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఎంత పట్టుదలగా ఉంటారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందునా.. ద్రవిడ సిద్ధాంతాన్ని.. తమిళ భాషకు సంబంధించిన అంశాలపై ఆయన మరింత గట్టిగా వ్యవహరిస్తుంటారు. మోడీ సర్కారు మీదా ఇప్పటికే నిప్పులు చెరుగుతున్న ఆయన.. కేంద్ర విధానాలపై తనకున్న భిన్నాభిప్రాయాల్ని వ్యక్తం చేసే విషయంలో అస్సలు తగ్గట్లేదు. ఇప్పటికే లోక్ సభ ఎంపీ నియోజకవర్గాల పునర్విభజనపైనా.. అందులో ఉత్తరాది అధిపత్యం మీదా ప్రశ్నల మీద ప్రశ్నలు వేస్తున్న ఆయన.. మూడో భాష అంశంపైనా తరచూ సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. దక్షిణాది మీద హిందీని బలవంతంగా రుద్దుతున్నారన్న ఆయన.. ఇప్పుడో ప్రశ్నను లేవనెత్తారు. మూడో భాషగా హిందీని నేర్పాలంటున్నారు సరే.. ఉత్తరాదిన మూడో భాషగా దేన్ని నేర్పుతారు? అంటూ సరికొత్త మెలిక ప్రశ్నను సంధించారు. జాతీయ విద్యా విధానంలో మూడు భాషల్ని నేర్పాలన్న సంగతి తెలిసిందే. ఇందులో ఇంగ్లిషు.. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన భాషతో పాటు.. మూడో భాషగా హిందీని నేర్పాలన్న కేంద్రం తీరును స్టాలిన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. త్రిభాషా సూత్రాన్ని దక్షిణాదిన అమలు అంశాన్ని ప్రస్తావిస్తూ.. మరి ఉత్తరాదిన అమలు చేస్తే ఏ భాష నేర్పిస్తారో చెప్పాలని క్వశ్చన్ చేశారు. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో ఒక పోస్టు చేశారు. తమిళనాడు విద్యార్థులు మూడో భాషను నేర్చుకునేందుకు ఎందుకు నిరాకరిస్తున్నారంటూ కొందరు మమ్మల్నిఅడుగుతున్నారు. కానీ.. ఉత్తరాదిలో మూడో భాషగా ఏ భాషను నేర్పుతున్నారో చెప్పటం లేదు. అక్కడ రెండు భాషల్ని మాత్రమే బోధిస్తున్నట్లయితే ఇక్కడ మాత్రం మూడు భాషల్ని నేర్చుకోవాల్సిన అవసరం ఏముంది? అన్నది సీఎం స్టాలిన్ ప్రశ్న. అటు స్టాలిన్ వైపు కాకుండా.. ఇటు మోడీ సర్కారు వైపు కాకుండా.. ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడుకోవాలంటే.. ఉత్తరాదిన చాలా రాష్ట్రాల్లో హిందీతో పాటు వారిదైన సొంత భాష కూడా ఉందన్నది మర్చిపోకూడదు. దక్షిణాది రాష్ట్రాల్ని పక్కన పెడితే.. ఉత్తరాది.. ఈశాన్య రాష్ట్రాల విషయానికి వస్తే.. మధ్యప్రదేశ్ లో హిందీ మాతృభాష. ఆ రాష్ట్రం నుంచి విడిపోయిన ఛత్తీస్ గఢ్ విషయానికి వస్తే అక్కడి ప్రజలకు చత్తీస్ గఢీ మాతృభాష. మహారాష్ట్రకు మరాఠీ ఉంది. గుజరాత్‌కు గుజరాతీ ఉంది. రాజస్థాన్ కు రాజస్థానీ ఉంది. హర్యానా.. పంజాబ్ లలో పంజాబీ, కశ్మీర్ లో కశ్మీరీ.. ఇలా చూస్తే.. దాదాపుగా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రానికి ఒక మాతృభాష ఉందన్నది మర్చిపోకూడదు. ఉత్తరాదిన పశ్చిమ బెంగాల్ విషయానికి వస్తే బెంగాలీ.. ఒడిశాకు ఒరియా.. అసోంలో అస్సామీ.. త్రిపురలో బెంగాలీ.. గోవాలో కొంకణి.. మణిపూర్ మణిపురి.. మేఘాలయలో ఖాసీ.. మిజోరంలో మిజో.. నాగాలాండ్ లో అయో.. సిక్కింలో నేపాలీ భాషలు మాతృభాషగా ఉన్నాయి. ఉత్తరాఖండ్.. ఉత్తరప్రదేశ్.. మధ్యప్రదేశ్.. జార?ండ్.. హిమాచల్ ప్రదేశ్.. బిహార్ లలో హిందీ ప్రధాన భాషగా ఉన్నప్పటికి.. వారికంటూ కొన్ని భాషలు స్థానిక ప్రజలకు ఉన్నాయన్నది మర్చిపోకూడదు. బీహార్ విషయానికి వస్తే అక్కడ ఉర్దూ, హిమాచల్ ప్రదేశ్ లో సంస్క్రతం.. జారండ్ లో భోజ్ పురి మొదలు బోలెడన్ని భాషలు ఉననాయి. ఉత్తరప్రదేశ్ లో ఉర్దూ, ఉత్తరాఖండ్ లో సంస్క్రతి భాషల్ని నేర్చుకుంటూ ఉంటారు. మొత్తంగా చూస్తే.. స్టాలిన్ లాంటి అధినేతల స్టేట్ మెంట్లు విన్నంతనే మెలికి పెట్టినట్లుగా ఉన్నప్పటికి.. లోతుల్లోకి వెళితే.. ఆయన వాస్తవాలు మరోలా ఉండటం కనిపిస్తుంది. భావోద్వేగాలు మంచివే కానీ.. అవేమీ దేశ సమైక్యతను ప్రశ్నించేలా మాత్రం ఉండకూడదన్నది మర్చిపోకూడదు.

# తెలుగు సినిమా స్వర్ణయుగ రారాణి కృష్ణకుమారి - మార్చి 6... కృష్ణకుమారి జయంతి




కృష్ణకుమారి (మార్చి 6, 1933 – జనవరి 24, 2018) పాత తరం సినిమా కథానాయిక. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో సుమారు 25 సంవత్సరాలకు పైగా 150 పై చిలుకు చిత్రాల్లో నటించారు. మూడు జాతీయ పురస్కారాలు, రాష్ట్ర ప్రభుత్వ నంది పురస్కారాలు అందుకున్నారు. సావిత్రికి సమకాలీన నటి అయిన ఆమె షావుకారి జానకికి సొంత చెల్లెలు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్,, కృష్ణ, శివాజీ గణేశన్ వంటి దిగ్గజాలతో ఆమె అనేక సినిమాల్లో నటించారు. పశ్చిమ బెంగాల్ లోని నైహతిలో ఓ తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో 1933లో జన్మించారు కృష్ణ కుమా రి. వెంకోజి రావు –.సచీ దేవి ఆమె తల్లిదండ్రులు. ఆంధ్ర ప్రదేశ్ లోని రాజమండ్రి వీరి స్వస్థలం. వేదాంతం జగన్నాథ శర్మ దగ్గర శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారు. ఒకసారి ఆమె తల్లితో సహా స్వప్న సుందరి సినిమా చూడడానికి వెళితే అక్కడకి సౌందరరాజన్ గారి అమ్మాయి భూమాదేవి కూడా వచ్చింది. సినిమా హాల్లో కృష్ణ కుమారిని చూసిన ఆమె నవ్వితే నవరత్నాలు సినిమా కోసం అమా యకంగా కనిపించే కథా నాయిక కోసం వెతుకుతున్నట్లు చెప్పారు. తర్వాత రోజే వారు కృష్ణ కుమారి ఇంటికి వచ్చి తల్లిదండ్రుల అను మతి తీసుకొని ఆమెకు ఆ పాత్ర నిచ్చారు. అలా తెలుగు సినిమా తెరకు 1951 లో నిర్మించిన నవ్వితే నవరత్నాలు సినిమా ద్వారా పరిచయం అయ్యా రు. కానీ దానికంటే ముందు మంత్ర దండం అనే సినిమా విడుదలైంది. తొలి చిత్రంలో నటిస్తుండగానే ఆమెకు 14 సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. అప్పటికి ఆమె వయసు కేవలం 16 ఏళ్ళు మాత్రమే. తర్వా త 1953లో తాతినేని ప్రకాశరావు యన్.ఎ.టి.వారి పిచ్చి పుల్లయ్యలో కథానాయిక వేషం వేయించారు. అందులో మంచి నటన ప్రదర్శించిన కృష్ణకుమారికి పినిశెట్టిగారి పల్లె పడుచు, బంగారు పాప వంటి మంచి చిత్రాలతో పరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. జానపద చిత్రాల కథానాయికగా, అభినయ రాజకుమారిగా తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సొంతం చేసుకున్నారు నటి కృష్ణకుమారి. అసమాన నటన తో ఎన్నో వైవిధ్యమైన పాత్రలకు ప్రాణప్రతిష్ఠ చేసిన ఆమె తెలుగు చిత్రసీమలో విలక్షణ నటిగా తనకంటూ ప్రత్యేకతను చాటు కున్నారు. తరువాత ఇలవేల్పు, జయ విజయ, అభిమానం, దేవాం తకుడు మొదలైన చిత్రాలలో వివిధ కథానాయకుల సరసన నటించినా, తన నటనకు గుర్తింపుతెచ్చిన చిత్రా లు కె.ప్రత్యగాత్మగారి భార్యాభర్తలు (1961), కులగోత్రాలు (1962). 1963లో లక్షాధికారి, బందిపోటు, ఎదురీత, కానిస్టేబుల్ కూతురు చిత్రాల్లో వైవిధ్యం ఉన్న పాత్రలు వేశారు. ప్రభుత్వ బహుమతి పొందిన జగపతీ పిక్చర్స్ వారి అంతస్థులులో నాయికగా నటిం చారు. 1967–68 మధ్య కాలంలో ఉమ్మడి కుటుంబం, భువన సుందరి కథ, రహస్యం, చిక్కడు దొరకడు, స్త్రీ జన్మ వంటి చిత్రాలలో వైవిధ్యమున్న పాత్రలు పోషించారు. వరకట్నంలో నాయికగా గ్లామరస్ పాత్ర తర్వాత చిత్రాలు తగ్గి 1970 దశాబ్దంలో కొన్ని చిత్రాలలో నటించ గలిగారు. సుమారు రెండు దశాబ్దాల నట జీవితంలో ఆమె సుమారు 150 సినిమాలలో నటించారు. వాటిలో ఎక్కువగా తెలుగు సినిమాలైతే, 15 కన్నడ చిత్రాలు, కొన్ని తమిళ భాషా చిత్రాలు. మూడు భాషల చిత్రా ల్లోనూ ఆమే స్వయంగా డబ్బింగ్ చెప్పు కోవడం విశేషం. ఆమె ఆనాటి నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వర రావు, కాంతారావు, కృష్ణంరాజు, జగ్గయ్య, హరనాథ్, అందరు మహా నటులతోను నటించి మెప్పించారు. కాంతారావుతో కలిసి 28 జానపద చిత్రాల్లో నటించారు. 1963 లో కృష్ణ కుమారి 16 సినిమాల్లో కథానాయి కగా నటించారు. ఒక్క ఏడాదిలో అత్యధిక సినిమాల్లో కథానాయికగా నటించడంలో ఆమె రికార్డు ఇప్పటికీ పదిలంగా ఉంది. ఇందు కోసం ఆమె మూడు నెలలపాటు మూడు షిఫ్టులు ఖాళీ లేకుండా పనిచేశారు. బాలీవుడ్ లో కిశోర్ కుమార్ తో ఒకే ఒక సినిమాలో కథానాయికగా నటించారు. అప్పటికి హిందీ చిత్ర పరిశ్రమలో కృష్ణకుమారి పేరుతో వేరే నటి ఉండటంతో రతి అనే పేరుతో పరిచయం అయినారు. వద్దంటే పెళ్లి, గంగా గౌరీ సంవాదం, సతీ సుకన్య, రమా సుందరి, జయ విజయ, పెళ్లి కానుక, దేవాంత కుడు, వినాయక చవితి, ఇరుగు పొరుగు, అగ్గిపిడుగు, మర్మయోగి, ఉమ్మడి కుటుంబం, లక్షాధికారి, బందిపోటు, బంగారు భూమి, గుణవంతుడు, జేబుదొంగ, యశోద కృష్ణ, దేవదాసు, నేరము శిక్ష, మానవుడు దానవుడు, భార్య బిడ్డలు, తల్లా పెళ్లామా, శ్రీకృష్ణావ తారం, అంతస్తులు, గుడి గంటలు, డాక్టర్ చక్రవర్తి, చదువుకున్న అమ్మా యిలు ఎదురీత, కులగోత్రాలు, భార్యాభర్తలు, శభాష్‌రాజా, దీపా వళితో పాటు పలు సినిమాలు ఆమె నటనా ప్రతిభకు తార్కా ణాలుగా నిలిచాయి. ఇండియన్ ఎక్స్ ప్రెస్ మాజీ ఎడిటర్, స్క్రీన్ మేగజైన్ వ్యవ స్థాపకులు, బిజినెస్ మాన్ అయిన కర్ణాటకకు చెందిన అజయ్ మోహన్ కైతాన్ ను కృష్ణ కుమారి పెళ్లి చేసు కున్నారు. ఆమెకు చిన్నప్పటి నుండి భానుమతి అంటే చాలా ఇష్టం. ఆమెతో కలిసి కులగోత్రాలు, పుణ్య వతి సినిమాల్లో నటించినప్పుడు ఎంతో థ్రిల్ ఫీలయ్యానని, మహా నటి సావిత్రి తనను స్వంత చెల్లెల్లా చూసుకొనేదని చేపుతుండే వారు. ఆమెకు మూడుసార్లు జాతీయ అవార్డులు, రాష్ట్రస్థాయిలో నంది అవార్డులు వచ్చాయి. ఆమె కాంచన మాల, సావిత్రి, ఎన్టీయార్ అవార్డులు గెలుచుకున్నారు. బ్రిటన్ లోని బర్మింగ్ హాం సంస్థ వారి లైఫ్ టైం అచీవ్?ట్ అవార్డు పొందారు. కృష్ణ కుమారి 2018, జనవరి 24 ఉదయం బెంగుళూరులో అనారోగ్యంతో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అఖండ మహిమాన్వితుడు... శ్రీ గురు రాఘవేంద్రుడు - ఫాల్గుణ శుక్ల సప్తమి రాఘవేంద్ర స్వామి జయంతి

**పూజ్యాయ రాఘవేంద్రాయ**
**సత్యధర్మ రతాయచ**
**భజతాం కల్పవృక్షాయ**
**నమతాం కామధేనవే.**

శ్రీ గురు రాఘవేంద్ర స్వామి (1595–1671) హిందూ మత ద్వైత సిద్ధాంతానికి సంబంధించిన ఒక ప్రముఖమైన గురువు. 16వ శతాబ్దంలో జీవించారు. ఆయన వైష్ణవాన్ని (విష్ణువుని కొలిచే సిద్ధాంతం) అనుసయించారు, మధ్వాచార్యులు బోధించిన ద్వైతాన్ని అవలంబించారు. ఆయనను శిష్యగణం ప్రహ్లాదుడి అవతారంగా భావిస్తారు. మంత్రాలయంలో వెలసిన శ్రీ రాఘవేంద్ర తీర్థులు భక్త కోటికి కష్టాలు కడ తేరుస్తూ మంత్రాలయం మహర్షిగా భక్తుల పూజలు అందు కుంటున్నారు. మంత్రాలయ ఋషి రాఘవేంద్రులు మానవ కళ్యాణం కోసం వెలిసిన మహిమాన్విత మహనీయుడు శ్రీరాయలు. భక్తులు రాఘవేంద్ర స్వామిని శ్రీరాయలు అని పిలుచు కుంటారు. తమిళ నాడు లోని కుంభకోణం మధ్వ మఠాన్ని 1624 నుండి 1636 వరకూ మఠాధిపతిగా పాలించి ఆపై ఉత్తరానికి యాత్రలు చేసారు. ఆయన శ్రీమూల రాముడి, శ్రీ పంచముఖ ముఖ్య ప్రాణదేవరు (పంచముఖ హనుమంతుడు) యొక్క పరమ భక్తులు. పంచ ముఖిలో తపస్సు చేశారు. పంచ ముఖ హనుమంతుణ్ణి దర్శించారు.(హనుమంతుని పంచముఖ దర్శనం శ్రీరామ చంద్రులు తర్వాత దర్శించినది శ్రీ రాఘవేంద్ర తీర్థులు మాత్రమే) మంత్రాలయంలో తన మఠాన్ని స్థాపించారు. అక్కడే జీవ సమాధి పొందారు. శ్రీ రామవేంద్ర తీర్థ స్వామి విలక్షణ ప్రతిభగల, అద్భుత మహిమలు నెఱపిన మహ నీయుడు. ఆయన తుంగ భద్ర తీరమునందు మంత్రాల యము అను ప్రదేశములో శ్రావణ బహుళ ద్వితీయ నాడు (క్రీ.శ.1671) బృందావనములో ప్రవేశించారు. ఆ దినాన్ని స్వామి ఆరాధనా దినంగా జరుపు కుంటారు. రాఘవేంద్ర తీర్థస్వామి అన్నది ఆ వ్యక్తి సన్యాసాశ్రమపు నామము. పూర్వాశ్రమంలో ఆయన పేరు వెంకట భట్టు. తండ్రి పేరు వీర కృష్ణ భట్టు. తల్లి పేరు గోపమ్మ, ఆ దంపతులకు అతను చివరి కొడుకు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తుడైన వెంకటభట్టు చాలా తెలివైన వాడు. సంస్కృతంలో, కావ్యములు వేదాలు, మీమాంస మున్నగునవి ఆయన మధురకు చెందిన శ్రీలక్ష్మీ నరసింహాచారి వద్ద చదువు కున్నారు. తాత శ్రీకృష్ణ దేవరాయల ఆస్థాన వైణికుడిగా వుండేవారు. వెంకట నాథుడి బాల్యం లోనే తల్లిదండ్రులు గతిం చారు. బావగారైన లక్ష్మీనారాయణ చేరదీశారు. బావ పెంపకంలోనే వెంకట నాథుడు సర్వశాస్త్ర పారంగతుడయ్యారు. విద్యాభ్యాసానంతరము సరస్వతి బాయిని వివాహం చేసుకుని, పేదరికం కారణంగా, తన కాపురాన్ని కుంభ కోణమునకు మార్చారు. అక్కడ శ్రీ మధ్వాచార మత గురువులలో ఒకరైన శ్రీ సుధీంద్ర తీర్థ స్వామి వారికి శిష్యుడయ్యారు. గురువు చెప్పగా శిష్యుడు వ్యాఖ్య వ్రాస్తూ ఉంటూ ఉండేవారు. ఒకనాడు ఒక ఘటం గురువుకే విడివడలేదు. ఆలోచించి రేపు చెబుతానని గురువు ఆనాటికి పాఠం చూపించారు. ఆ రాత్రి శిష్యుడు గురువుకు సందేహం వచ్చిన ఘట్టానికి సంబంధించిన వ్యాఖ్య తాను రచించి మరీ నిద్రపోయారు. మరునాడు గురువు శిష్యుని ఎంతగానో పొగడి, ఇతర శిష్యుల సమక్షంలో 'పరిమళ ఆచార్య అను బిరుదం ఇచ్చారు. కొన్నాళ్లకు శ్రీ సుధీంద్ర తీర్థ స్వామికి జబ్బు చేయగా, తనకు అవసాన కాలం సమీపించిన విషయం తెలుసుకుని, తన అనంతరం మధ్వ పీఠం నడవ డానికి వెంకట



భట్టే తగిన వాడని నిర్ణయించారు. ఆజ్ఞాపూర్వకంగా గురువు చెప్పినది శిష్యుడు విన్నా, తనకు నడి వయస్సు భార్య యువతి, ముక్కు పచ్చలారని, ముద్దు కుమారుని కలిగి ఉన్న పరిస్థితులలో విచారించి, భగవత్ కైంకర్యంనకే తన భవిష్య జీవితాన్ని అంకితం చేయడానికి కృత నిశ్చయు డయ్యారు. సుధీంద్రులు వెంకట నాథుని తంజావూరు చెంతగల హనుమంత పురం లోని తన ఆశ్రమానికి తీసుకునిపోయి శాస్త్రోక్తంగా సన్యాస దీక్షనిచ్చి పీఠాధిపత్యం అప్పగించారు. దీక్షానామం "శ్రీ రాఘవేంద్ర తీర్థస్వామి" అనే పేరు స్వీకరించారు. కొద్ది కాలానికి అనంతరం సుధీంద్ర తీర్థస్వామి తనువు చాలించారు. శ్రీ రాఘవేంద్రుడు పీఠ అధిపతి అయ్యారు. ఆయన ప్రహ్లాదుని అపరావతారమని, అందువలన యెన్నో యోగ మహిమలు నెరపగలుగతున్నారని ప్రఖ్యాతి కలిగింది. కాలక్రమాన రాఘవేంద్ర స్వామి వృద్ధుడయ్యారు. భౌతిక కాయం బృందావనంలో ప్రవేశింప వలసిన కాలం వచ్చిందని తెలుసు కున్నారు. ప్రహ్లాదుడు యాగం చేయడం చేత పవిత్రత కూర్చుకున్నదని ప్రఖ్యాతి గల మాంచాలి అనే గ్రామాన్ని స్వామి తన బృందావన స్థానంగా ఎంచుకున్నారు. ఆ గ్రామం తుంగ భద్ర తీరాన ఆదోని తాలూకా ఉత్తరపు కొనను ఉన్నది. గ్రామ దేవత పేరు మాంచాలమ్మ. మాంచాలమ్మ ఆలయాన్ని పట్టి ఆ ఊరికి మాంచాలి అనే పేరు వచ్చింది. స్వామి బృందావనం వెళ్ళాక, అక్కడికి వెళ్లిన రోగులు కుష్టు, మూగ, గుడ్డి మున్నగు దారుణ వ్యాధులతో బాధపడే వారు. మంత్ర ముగ్ధులయి రోగ నిర్ముక్తులు అవుతూ ఉండడం వల్ల దానికి మంత్రాలయం అనే పేరు వచ్చింది. ఆ గ్రామాన్ని నవాబు సిద్ధి మస్సానెత్‌ఖాన్, స్వామికి (మద్రాస్ డిస్ట్రిక్ట్ గెజిటీర్ పునర్ముద్రణ 1916 చాప్టర్ 15 ఆదోని తాలూకా పేజీ 213) శ్రోత్రియంగా ఇచ్చారు. మద్రాసు గవర్నర్ థామస్ మన్రోకు రాఘవేంద స్వామి చూపిన అద్భుతాలు బళ్లారి జిల్లా గెజిటీర్‌లో చూడవచ్చు. అలా రాఘవేంద్రుల యశశ్చంద్రికలు దశదిశలా పాకాయి. వెంకన్న పంతులు విశేష ధనం వెచ్చించి అక్కడ స్వామి బృందావనానికి ఏర్పాట్లు చేసి గుళ్లు గోపురాలు కట్టించారు. రాఘవేంద్రస్వామి సంగీతంలో కూడా నిష్ణాతులే, ఆయన కాలంలో ఆయనో గొప్ప వైణికుడు కూడా. గురువు తరువాత మఠం బాధ్యత లు స్వీకరించి ఆపై దక్షిణ భారత దేశమంతా విజయం చేయటానికి వెళ్లి వచ్చి, మార్గంలో ఎన్నో అద్భుతాలను తన శిష్య బృందానికి చూపిస్తూ మధ్వప్రోక్త ద్వైత సిద్ధాంతానికి బాగా ప్రచారం చేసారు. అసమాన శేముషీ దురంధరుడైన రాఘవేంద్రు నికి టిప్పణాచార్య చక్రవర్తిగా బిరుదు లభించింది. వ్యాకరణ శాస్త్రం లో ఆయన ప్రజ్ఞా పాటవా లకు మెచ్చి మహా భాష్యకార బిరుదంతో సన్మానించారు. ఆయన స్వతంత్ర రచనల్లో జైమిని పూర్వ మీమాంస సూత్రాలకు రాసిన భాష్యం భట్ట సంగ్రహం భారతీయ తత్వశాస్త్రానికి అపు రూపమైన కానుక. వివిధ భాషలకు సులభంగా వ్యాఖ్యానాలు రచించి మధ్వ సిద్ధాంత ఔన్నత్యాన్ని ప్రతిపాదించారు. ఐతరేయోపనిషత్తు మినహా తొమ్మిది ప్రధాన ఉపనిషత్తులకు వ్యాఖ్యానాలు రచించారు. 1671 లో తన శిష్యబృందంతో రాబోయే 800 సంవత్సరాలు జీవించే ఉంటానని చెప్పి మంత్రాలయంలో జీవ సమాధి పొందడానికి సంసిద్ధుడైనాడు. క్రీస్తుకు 1671 వ సంవత్సరం శ్రావణ బహుళ ద్వితీయ గురువారం నాడు శ్రీ రాఘవేంద్ర స్వామి బృందావనంలో ప్రవేశించారు. వేదమంత్ర పఠనం జరుగుతూ ఉండగా స్వామి అందులో కూర్చున్నారు. అక్కడ చేరిన వేలకొలది భక్తులు హరినామ కీర్తన సాగిస్తూ ఉండగా స్వామి నైమిత్తికాలు పూర్తి చేసుకుని శుచియై చేతిలో వీణను పట్టుకుని సమాధిలో ప్రవేశించారు. శ్వాసని నిలిపివేసి మనోలయం చేశారు. గండకీ నది నుంచి తెప్పించిన 1200 సాలిగ్రామాలతో బృందావన సమాధిని మూసి వేశారు. సమాధి గతుడైన తర్వాత ఆయన చూపిన మహిమలు, చేసిన అద్భుతాలు కోకొల్లలు. 700 సంవత్సరాలు సూక్ష్మరూపంలో బృందావనంలో ఉండి తన భక్తులను అనుగ్రహిస్తానని ఆయన ప్రకటన చేశారు. శ్రీరాఘవేంద్రులు జ్ఞాన సంపన్నుడు, సిద్ధ పురుషుడు. మంత్రాలయం లోని బృందావన సన్నిధానంలో భక్తులు పొందే శాంతి సంతృప్తుల మాటల కందనివి. అలజడి, అశాంతి, ఆందోళనలతో నిండిన నేటి నాగరిక సమాజానికి అటువంటి సత్పురుషుల సాహి త్యం, సాన్నిహిత్యం, సాన్నిధ్యం ఎంతో అవసరం. అది నిరంతరం వెలిగే అఖండ జ్యోతి. బ్రతికి ఉండగా జరిపిన అద్భుత మహిమలు స్వామి బృందావనంలో ప్రవేశించాక కూడా చేస్తూ వచ్చారు. చేస్తూరావడం చేతనే మంత్రాల యంలో శ్రావణ బహుళ ద్వితీయ ఏటేట గొప్ప తీర్థదినమై వరలుతూ ఉంది. మధ్వమత స్థులేకాక లింగాయతులు మున్నగు భిన్న మతస్థులు కూడా ఈ తీర్థానికి విశేషంగా వస్తారు. తీర్థం మూడు రోజులు సాగుతుంది. స్వామి తీర్థంతో పాటు గ్రామదేవత సంబంరం కూడా సాగుతోంది. మహిమాన్వితు లైన రాఘవేంద్ర స్వామి జయంతి వేడుకలు ఆరు రోజుల పాటు సంప్రదాయ రీతిలో నిర్వహించడం సాంప్రదాయం. 404వ పట్టాభిషేకం, మార్చి6వ తేదీ రాఘవేంద్ర స్వామి 430వ జన్మదినం సందర్భంగా మూల బృందావనానికి పంచా మృతం అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించ నున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సీఎం రేవంత్‌తో చర్చకు సై.. మల్లన్న ఛాలెంజ్

హైదరాబాద్, మార్చి 5: పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారంటూ తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై మల్లన్న ఈరోజు (బుధవారం) మీడియాతో మాట్లాడుతూ... తనను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయించి రేవంత్ రెడ్డి చాలా పెద్ద పొరపాటు చేశారని అన్నారు. బీసీలకు రాజ్యాధికారం ఎందుకు రాదో.. చూస్తామన్నారు. "నన్ను సస్పెండ్ చేస్తే.. బీసీ ఉద్యమం ఆగిపోతుందన్న భ్రమలోంచి రేవంత్ బయటకు రావాలి. నాలాంటి వాళ్ళు పక్కన ఉండొద్దని సీఎం రేవంత్ రెడ్డి కోరుకుంటున్నారు. ఈడబ్ల్యూఎస్ కోటాకు ఇబ్బంది ఉండకూడదన్న ఉద్దేశంతోనే కుల గణనను తప్పుగా చూపారు. 90 ఏళ్ళ తర్వాత కుల గణన చేస్తే.. చపట్లు కొట్టేటోడు కూడా లేడు. కుల గణనపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చకు రెడీ. పీసీసీ అధ్యక్షుడిపై ఒత్తిడి చేసి రేవంత్ రెడ్డికి నన్ను సస్పెండ్ చేయించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తానన్న రాహుల్ గాంధీ హామీతోనే కాంగ్రెస్‌లో చేరాను. తన పక్కన వారు బానిస మాదిరి బతకాలని రేవంత్ కోరుకుంటారు. రేవంత్ చేసిన కులగణన చిత్తు కాగితంతో సమానం. సొంత మంత్రులకే ముఖ్యమంత్రి పేరు గుర్తుకు రావటం లేదు" ఘాటుగా వ్యాఖ్యలు చేశారు.

**బీసీలను తొక్కి పెట్టారు..** 2011లో రాహుల్ గాంధీ చేసిన పనినే తాను చేసినట్లు తెలిపారు. మన్మోహన్ తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను రాహుల్ గాంధీ చించలేదా?.. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు ఒక న్యాయం.. మల్లన్నకు ఒక న్యాయమా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం అగ్రవర్ణాలకు మాత్రమే అని వెల్లడించారు. ముఖ్యమంత్రి, మంత్రులు.. కులగణనలో నిర్లక్ష్యంగా పాల్గొన్నారని తెలిపారు. అగ్రవర్ణాలను ఎక్కువ చూపి.. బీసీలను తొక్కి పెట్టారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి.. పదే పదే తప్పులు మాట్లాడుతూ దొరికిపోతున్నారని అన్నారు.

**నన్ను గెలిపించారా..** ప్లాన్ ప్రకారం కాంగ్రెస్‌ను ఖతం చేసే పనిలో సీఎం రేవంత్ ఉన్నారంటూ సంచలన కామెంట్స్ చేశారు. సీఎం రేవంత్ .. ప్రధాని మోదీ ఒకరికి ఒకరు సహకరించుకుంటున్నారన్నారు. మల్కాజిగిరి, చేవెళ్ళ, మహబూబ్‌నగర్ ఎంపీలను బీజేపీ గెలవటానికి రేవంత్ సహకరించారని ఆరోపించారు. బలమైన కేసీఆర్‌తో తాను కొట్లాడినప్పుడు రేవంత్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ ఎంపీగా వంశీచంద్ రెడ్డిని.. రేవంత్ రెడ్డే ఓడించారన్నారు. మహబూబ్‌నగర్, మల్కాజిగిరి ఎంపీలను గెలిపించుకోలేని రేవంత్ .. తనను గెలిపించారా అంటూ మండిపడ్డారు. రేవంత్ కూర్చున్న సీఎం కుర్చీకి పునాది పడటానికి తాను కారణమని స్పష్టం చేశారు.

# నక్షా రీసర్వే ప్రక్రియ ప్రారంభం

జగిత్యాల : డిజిటల్ ఇండియాలో భాగంగా భూముల రికార్డుల ఆధునికీకరణకు కేంద్ర ప్రభుత్వం నక్షా పేరిట చేపట్టిన రీసర్వే కార్యక్రమం జగిత్యాల బల్దియా పరిధిలో శనివారం మొదలైంది. గత నెలలో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే చేపట్టగా తాజాగా ఫీల్డ్ సర్వే ప్రారంభించారు. మొదట నిర్దేశిత హద్దులతో జగిత్యాల బల్దియా మ్యాపు సిద్ధం చేసేందుకు గ్రామాల వారీగా సర్వే నంబర్లను రీసర్వే చేస్తున్నారు. భవనాలు, ఖాళీ స్థలాలు, అన్ని రకాల భూములను రీసర్వే చేసిన టైటిల్ రికార్డులను సర్వే ఆఫ్ ఇండియా సర్వర్‌లో డిజిటల్ రూపంలో నిక్షిప్తం చేయనున్నారు. రీసర్వే ఆధారంగా నిర్దేశిత హద్దులతో రూపొందించిన జగిత్యాల బల్దియా మ్యాపు అందుబాటులోకి రాగానే పూర్తిస్థాయిలో రీసర్వే చేపట్టేందుకు సర్వేశాఖ వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. పట్టణానికి ఆనుకొని మోతె, ధరూర్, తిప్పన్నపేట, నర్సింగాపూర్, నూకపల్లి తదితర గ్రామాలు ఉండగా తాజాగా వీటికి సంబంధించిన సుమారు 350 వరకు సర్వే నంబర్లను రీసర్వే చేయనున్నారు. వీటికి తోడు అందుబాటులో ఉన్న పాతకాలపు హద్దురాళ్లను గుర్తించి మొత్తం వివరాలు సేకరిస్తున్నారు. జగిత్యాల



బల్దియా ఇచ్చిన పీఎల్‌యూ మ్యాపు మేరకు అర్బన్ ల్యాండ్ బౌండరీల ఆధారంగా హద్దులను నిర్ధారిస్తున్నారు. వీటితో పాటు పాత హద్దురాళ్ల వివరాలు, గత నెల 8న ఆర్‌వీ ప్రైవేటు కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో హెలికాప్టర్ ద్వారా 6 గంటల పాటు చేపట్టిన ఏరియల్ సర్వే చిత్రాలతో సరిపోల్చుకొని హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో నిర్దేశిత హద్దులతో కూడిన జగిత్యాల బల్దియా మ్యాపు అందుబాటులోకి రానుంది. తుది మ్యాపు అందుబాటులోకి రాగానే పూర్తిస్థాయి రీసర్వే చేపట్టనున్నారు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రీసర్వే ప్రారంభించాం. జగిత్యాల బల్దియా మ్యాపు ఆధారంగా హద్దులు నిర్ధారించేందుకు స్థానికంగా నోటిఫికేషన్ జారీ కావాల్సి ఉంది. మొదట బల్దియా ఇచ్చిన మ్యాపు హద్దులు నిర్ణయించేందుకు, పట్టణానికి ఆనుకొని ఉన్న గ్రామాలకు సంబంధించిన సర్వే నంబర్లను రీసర్వే చేస్తున్నాం. సమీప భవిష్యత్తులో పూర్తిస్థాయి రీసర్వే మొదలయ్యే అవకాశం ఉంది.

డి.విఠల్‌రావు నాయక్, డివిజన్ సర్వే అధికారి

# జన చైతన్యంతోనే జీవ వైవిధ్యం

పెద్దపల్లి : జీవ వైవిధ్యానికి వెన్నెముక లాంటి అడవి జంతువులు కనుమరుగవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అటవీ ప్రాంతాల్లో చెట్ల నరికివేతతో వన్యప్రాణులు జనాల్లోకి వస్తూ వేటగాళ్ల ఉచ్చుకు బలైపోతున్నాయి. అడవుల శాతం పెంపునకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నా పెద్దగా ఫలితాలు కనిపించడం లేదు. అడవి జంతువుల సంరక్షణకు కఠినమైన చట్టాలు అమలవుతున్నా వేటకు అడ్డుకట్ట పడటం లేదు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో పరిస్థితిపై కథనం.

**తగ్గిపోతున్న అటవీ విస్తీర్ణం**

ఉమ్మడి జిల్లాలో 1266.16 చదరపు కిలోమీటర్ల మేర అడవులు విస్తరించాయి. 940.27 చ.కి.మీ.లలో చిట్టడవులు ఉన్నాయి. వాస్తవంగా మొత్తం భూ భాగంలో 33 శాతం ఉండాల్సిన అటవీ విస్తీర్ణం అక్రమార్కుల గొడ్డలి వేటుతో ఏటా తగ్గుతోంది. పోడు వ్యవసాయం పేరిట వన సంపద తరిగిపోతోంది. నాలుగేళ్ల కిందట పెద్దపల్లి జిల్లాలో పెద్దపులి సంచరించింది. కొద్ది రోజుల పాటు అటవీ ప్రాంతంలో సంచరించి గోదావరి దాటి మంచిర్యాల జిల్లాలో ప్రవేశించింది.

**ఉల్లంఘిస్తే శిక్షలు కఠినం**

వన్యప్రాణులను వేటాడితే వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్-1972 చట్టం ప్రకారం కఠిన శిక్షలు అమలు చేస్తున్నారు. జంతువులను చంపితే ఏడేళ్ల కారాగార శిక్ష పడుతుంది. ఉమ్మడి జిల్లాలో గత సంవత్సర కాలంలో 12 మందిపై కేసులు నమోదయ్యాయి.

**మాటు వేసి వేట** అడవుల్లో చెలిమలు, నీటి కుంటల ప్రాంతాల్లో వేటగాళు మాటు వేస్తున్నారు. ఉచ్చులు బిగించి, విద్యుత్తు తీగలు అమర్చి వన్యప్రాణులను వధిస్తున్నారు.

ఆహారం కోసం జనావాసాల్లోకి వచ్చిన వాటిని గుట్టు చప్పుడు కాకుండా అంతమొందిస్తున్నారు. జంతువుల మాంసం, చర్మం, కొమ్ములను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అరణ్యంలో కొన్ని చోట్ల కార్చిచ్చులు, ఎరగడి మంటలతో అరుదైన జంతువులు ప్రాణాలు వదులుతున్నాయి.

**నాలుగేళ్లకోసారి సర్వే**

వన్యప్రాణుల గణనకు నాలుగేళ్లకోసారి జాతీయ సర్వే నిర్వహిస్తున్నారు. సెక్షన్, బీట్‌ల వారీగా ఒక్కో బృందంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది ఇందులో పాల్గొంటారు.

శాఖాహార, మాంసాహార జంతువుల కదలికలకు అనుగుణంగా వేర్వేరుగా విభజిస్తారు.

400 మీటర్ల చొప్పున జంతువుల ఆనవాళ్లను పరిశీలించి, సమాచారాన్ని 'ఎకలాజికల్' యాప్‌లో నమోదు చేస్తారు.

**మొసళ్ల సంరక్షణ కేంద్రం**

పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఖానాపూర్ సమీపంలో ఎల్‌మడుగు వన్య ప్రాణుల సంరక్షణ(మొసళ్ల పెంపక) కేంద్రం ఉంది. ఇక్కడి గోదావరిలో 40 అడుగుల లోతులో నీరు ఉండగా ఏ కాలంలోనూ ఎండిపోదు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఇక్కడి గోదావరి నిండు కుండలా మారిన సమయంలో మొసళ్లు సమీపంలోని బావులు, పొలాల్లోకి కొట్టుకుపోయాయి. వాటిని పట్టుకొచ్చి అధికారులు సంరక్షిస్తున్నారు. ఇప్పటికే కొన్ని మృత్యువాత పడ్డాయి.

అవగాహన కల్పిస్తున్నాం

జిల్లాలో అడవుల నరికివేత, వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సమీప గ్రామాల్లో చట్టాలపై చైతన్యం కల్పిస్తున్నాం. అటవీ ప్రాంతాల్లో కార్చిచ్చు వ్యాప్తి చెందకుండా నియంత్రిస్తున్నాం. కుంటలు, తొట్లు నిర్మించి వాటిలో నీరు నింపి వన్యప్రాణుల దాహార్తి తీరుస్తున్నాం.

శివయ్య, పెద్దపల్లి జిల్లా అటవీ అధికారి

ఉమ్మడి జిల్లాలోని అటవీ జంతువులు

అడవి పందులు: 4,780

కొండ జింకలు: 1,379 కుందేళ్లు: 3,870 అడవి కోళ్లు: 1,763

నెమళ్లు: 869 మెకం: 374 సాంబార్: 184 మనుబోతు: 259

ఇతర జంతువులు: 3,729

# భద్రత వ్యవస్థలు డొల్ల.. దొంగల పంజా



హైదరాబాద్: రాజధానిలో ఏటీఎం దొంగతనాలు కలకలం రేపుతున్నాయి. తాజాగా నగర శివారు రావిర్యాలలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో చోరీ జరిగింది. నిందితులు కట్టర్లు, ఇనుపరాడ్లతో యంత్రాన్ని ధ్వంసం చేసి డబ్బులు కొల్లగొట్టి పరారయ్యారు. తాజా ఘటన ఏటీఎంలు, బ్యాంకుల దగ్గర భద్రతా వ్యవస్థల్ని ప్రశ్నార్థకం చేస్తోంది. కనీసం సెక్యూరిటీ గార్డు కూడా లేకపోవడాన్ని అవకాశంగా తీసుకొని ఏటీఎంను కొల్లగొట్టారు. ఇటీవల బీదర్‌లో ఏటీఎంలో డబ్బు నింపే క్రమంలో బిహార్ ముఠా కాల్పులు జరిపి రూ.93లక్షలతో అఫ్జల్‌గంజ్ చేరింది. నిందితులు ఇక్కడ కాల్పులు జరిపి తప్పించుకున్నారు.

**అంతులేని నిర్లక్ష్యం..**కొన్ని బ్యాంకులు భద్రత విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు దోపిడీలు జరిగినప్పుడు బహిర్గతమవుతోంది. పోలీసులు ఆర్‌బీఐ ప్రమాణాల ప్రకారం భద్రతా వ్యవస్థల్ని ఏర్పాటు చేసుకోవాలన్నా పట్టించుకోవడం లేదు. ఇటీవల రాచకొండ పోలీసులు బ్యాంకుల భద్రతపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కమిషనరేట్ పరిధిలోని 489 వివిధ బ్యాంకుల శాఖల్ని పోలీసులు సందర్శించారు. సగానికిపైగా బ్యాంకుల్లో పాత భద్రతా వ్యవస్థల్నే కొనసాగిస్తున్నట్లు గుర్తించారు.

ఏదైనా ఘటన జరిగితే ఏటీఎం, స్థానిక ఠాణాను అప్రమత్తం చేస్తూ అనుసంధానించే వ్యవస్థలుండాలని ఆర్బీఐ స్పష్టంగా చెప్పింది. ఇవి లేకే దొంగల పని తేలికవుతోంది. ఈ సమస్యను గుర్తించిన రాచకొండ కమిషనర్ బ్యాంకుల ప్రతినిధులతో సమావేశమై సమస్యల్ని పరిష్కరించుకోవాలని సూచించినా ఫలితం లేదు.

నలుగురు 4 నిమిషాల్లో ఏటీఎంను కొల్లగొట్టారు

రూ.29.69 లక్షలతో ఉడాయించారు

ఆదిభట్ల ఠాణా పరిధిలో ఘటన

ఆదిభట్ల, న్యూస్‌టుడే: పక్కా ప్లాన్‌తో నలుగురు కారులో వచ్చారు.. నాలుగు నిమిషాల్లో ఏటీఎంను కొల్లగొట్టారు.. రూ. 30 లక్షలతో ఉడాయించారు.. సంచలనం రేపిన ఈ సంఘటన ఆదిభట్ల ఠాణా పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. రావిర్యాలలోని ఎస్‌బీఐ ఏటీఎంలో ఆదివారం తెల్లవారుజామున 2:13 గంటలకు నలుగురు దుండగులు మాస్కులు ధరించి ఏటీఎంకు వచ్చారు. సీసీ కెమెరాలు రికార్డు కాకుండా వాటిపై నల్లటి స్ప్రేను చల్లారు. అలారం మోగకుండా కేబుళ్లను తెంపేశారు. కట్టర్, రాడ్లతో ఏటీఎంను ధ్వంసం చేసి రూ.29,69,900 తీసుకెళ్లారు. చోరీ జరిగినట్లు ప్రధాన కేంద్రానికి ఆటోమేటిక్ కాల్ రావడంతో అధికారులు వెంటనే ఆ శాఖ ఉద్యోగులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ రాజు, సీఐ రాఘవేందర్‌రెడ్డి వెళ్లారు. వివరాలు సేకరించారు. బ్యాంక్ మేనేజర్ కొర్ర శ్రీవాణి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకోవడానికి పోలీసులు మూడు బృందాలతో గాలిస్తున్నారు. ఆరాంఘర్ వరకు దుండగుల కదలికను గుర్తించారు.

# కంచికి చేరని క్రైం కథా చిత్రాలు




హైదరాబాద్: దోపిడీలు.. దొంగతనాలు.. హత్యలు.. నేరం ఏదైనా కొన్ని కేసుల్లో నేరగాళ్ల ఆచూకీ నెలల తరబడి చిక్కడం లేదు. సంచలనం రేపిన కేసుల్లోనూ పురోగతి కనిపించడం లేదు. వారాలు, నెలల పాటు గాలిస్తున్న పోలీసులు.. ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. ఇందుకు సరైన ఆధారాలు లేకపోవడం ఒకెత్తయితే.. కొత్తగా నమోదయ్యే కేసులతో పాత కేసుల్ని వదిలేస్తున్నారనే ఆరోపణ ఉంది. దీంతో దర్యాప్తు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా మారుతోంది. ఇదే అదనుగా నేరగాళ్లు కొత్త వేషంతో దర్జాగా తిరుగుతున్నారు. గతేడాది అక్టోబరులో అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి డీడీకాలనీలో వృద్ధ దంపతులను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా కొట్టి చంపేశారు. ఈ జంట హత్యల వెనుక మిస్టరీ ఇప్పటికీ వీడలేదు.

ఇద్దరు నేరగాళ్లు కర్ణాటకలోని బీదర్, నగరంలోని అఫ్జల్‌గంజ్‌లో కాల్పులు జరిపి 45 రోజులు దాటిపోయింది. నిందితుల జాడ కోసం ముమ్మరంగా వేటాడినా పోలీసులకు చిక్కలేదు. దర్యాప్తు అక్కడే నిలిచిపోయింది.

గతేడాది సెప్టెంబరులో పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో పాల వ్యాపారి ఇంట్లో రూ.2.02 కోట్ల సొమ్ము చోరీ అయ్యింది. ఈ కేసులో ఆరుగురు అరెస్టయ్యారు. అసలు సూత్రధారి రూ.82 లక్షలతో పరారయ్యాడు.

**తొలుత హడావుడి.. ఆ తర్వాత నిస్తేజం**

నేరం ఏదైనా ఘటన జరిగిన తర్వాత సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ డేటా, వేలిముద్రలు, ఘటనాస్థలిలో లభించే ఇతర ఆనవాళ్ల ఆధారంగానే దర్యాప్తు ముందుకు సాగుతుంది. నగరంలో పెద్ద ఘటన జరిగి నిందితులు పరారైనప్పుడు.. పోలీసులు ప్రత్యేక బృందాలతో రోజుల తరబడి గాలిస్తుంటారు. వీలైనన్ని ఆధారాలు సంపాదించి వెంటాడుతుంటారు. కీలక కేసుల్లో ఈ ప్రక్రియ మరింత వేగంగా జరుగుతుంటుంది. నిందితులు చిక్కితే సరి.. లేదంటే వారికి సహకరించినవారి అరెస్టులతోనే దర్యాప్తు ఆగిపోవడం విమర్శలకు దారి తీస్తోంది. నేరగాళు ఇతర రాష్ట్రాలు, దేశాలకు పారిపోవడం ఒకెత్తయితే.. ఆధారాలు లేక అసలు ఎక్కడికెళ్లారు..? అజ్ఞాతంలో ఉన్నారో తెలుసుకోలేక దర్యాప్తు ముందుకు వెళ్లలేని పరిస్థితి. ఈ లోపు కేసు మీద అందరి దృష్టి తగ్గిపోయి పోలీసులు కూడా విరామం ఇస్తున్నారు. ఇంతలో కొత్త నేరాలు.. ఇతర కేసులతో పాతవి మరుగున పడిపోతున్నాయి. పోచారంలో జరిగిన దొంగతనం కేసు దీనికి నిదర్శనం. ' కొన్ని కేసుల్లో ఒక దశ వరకు మాత్రమే ఆధారాలు చిక్కుతాయి. నిందితుడు ఎక్కడికెళ్లాడో చెప్పలేని పరిస్థితి ఎదురవుతోంది.' అని ఓ అధికారి తెలిపారు.

**అధునాతన సాంకేతికత ఏమైంది..?**

అత్యుత్తమ సాంకేతిక వినియోగం.. నేరగాళ్లను కనిపెట్టడంలో ముందుంటారని తెలంగాణ పోలీసులకు దేశంలోనే మంచి పేరుంది. దేశంలో మరే రాష్ట్రంలో లేని సీసీ కెమెరాలు నగరంలోనే ఉన్నాయి. పెద్ద సంఖ్యలో గస్తీ వాహనాలు, వాహనం వేగంగా వెళ్తున్నా రిజిస్ట్రేషన్ నెంబరు గుర్తించే సాంకేతికత మన పోలీసుల సొంతం. ఈ స్థాయిలో వనరులున్నా.. కొన్ని కీలక కేసుల్లో నిందితుల జాడ పట్టలేకపోవడం చర్చనీయంగా మారుతోంది. ఇటీవల అఫ్జల్‌గంజ్ కాల్పుల ఉదంతం తర్వాత పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నిందితులు వీటిని తప్పించుకుని ఎంచక్కా చెన్నైకి పారిపోయారు. డీడీకాలనీలో వృద్ధ దంపతుల కేసులో ప్రాథమికంగా కొందర్ని విచారించారు. ప్రత్యేక బృందాలతో గాలించినా ఇప్పటికీ నిందితుల జాడ మాత్రం చిక్కలేదు.

# అసంపూర్తి వలయం.. ప్రమాదాలకు నిలయం



తాండూరు : తాండూరు మండలం చెంగోల్, అంతారం తండా, అంతారం, ఖాంజాపూర్ మీదుగా చేపటిన 12 కి.మీ. బాహ్య వలయ రహదారి నిర్మాణానికి 2016-17 సంవత్సరంలో రూ.78 కోట్లు మంజూరయ్యాయి. వాటితో 2019-20 సంవత్సరంలో పనులు ప్రారంభించారు. తాండూరు గ్రామీణ సీఐ కార్యాలయం పక్కన జాతీయ రహదారి నుంచి ఖాంజాపూర్ గేటు వద్ద హైదరాబాద్ రహదారి వరకు నిర్మాణం పూర్తయింది. 21 మంది రైతులకు పరిహారం అందని కారణంగా అంతారం, అంతారంతండా వద్ద కొద్దిదూరం కంకర వేసి వదిలేశారు. ఇది మినహా మిగిలిన దాదాపు 8కి.మీ. రహదారి నిర్మాణం పూర్తయి రెండున్నర సంవత్సరాలు దాటింది. రైతులకు పరిహారం చెల్లించని కారణంగా రహదారిని అందుబాటులోకి తీసుకురాకుండా వదిలేశారు. పర్యవేక్షణ లేకపోవడంతో తరచూ ఈ రోడ్డుపై ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

అదుపులేని నాపరాయి లారీల రాకపోకలు: గనుల నుంచి వచ్చే నాపరాయి లారీలు రద్దీ కారణంగా నేరుగా హైదరాబాద్ రహదారి చేరేందుకు బాహ్యవలయ రహదారి మీదుగా పంపిస్తున్నారు. ఇవి అతివేగంతో వెళ్తూ చెంగోల్ రహదారి మార్గంలో వెళ్లే వాహనాలను ఢీకొడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అలాగే రహదారి పక్కన కొద్దిదూరం వరకు నాపరాయి వ్యర్థాల కుప్పలను కుమ్మరించారు. వీటివల్ల కూడా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇలా చేస్తే మేలు

నాపరాయి వ్యర్థాల కుప్పల్ని తొలగించాలి.

బాహ్యవలయం, చెంగోల్ రహదారి కలిసే చోట నాలుగు మార్గాల్లో వాహనాల వేగాన్ని అదుపు చేసేందుకు వేగనిరోధకాలను నిర్మింపజేయాలి.

మూలమలుపు దాటాకా చెంగోల్ మార్గం ఉన్నట్లు వాహనదారుల్ని అప్రమత్తం చేసేందుకు వీలుగా సూచిక బోర్డులు అమర్చాలి.

నాపరాయి లారీలు మితిమీరిన వేగంతో వెళ్లకుండా ఉండేందుకు పోలీసులు తనిఖీలు నిర్వహించి అవగాహన కల్పించాలి.

కొన్ని ఉదాహరణలుచెంగోల్ శివారున బాహ్యవలయ రహదారిపై వేగంగా వచ్చిన లారీ ఒక్కసారిగా స్కూటీని ఢీకొట్టింది. రెప్పపాటు వ్యవధిలో జరిగిన ప్రమాదంలో కళ్ల ముందే కుమారుడు దుర్మరణం చెందగా కాసేపటి తర్వాత తండ్రి తనువు చాలించాడు.

వారం క్రితం చెంగోల్‌కు చెందిన మహేష్ ద్విచక్ర వాహనాన్ని బాహ్యవలయపై లారీ ఢీకొట్టింది.

రెండు వారాల క్రితం ద్విచక్ర వాహనంపై పట్టణానికి వెళ్తున్న చిన్నెల్లిశ్రీకాంత్‌ను బాహ్యవలయ రహదారిపై లారీ ఢీకొట్టింది.

# గోదాం తరలింపుపై వీడని చిక్కుముడి

పెద్దపల్లి: జిల్లాకేంద్రంలో ఆర్టీసీ డిపో ఏర్పాటు ప్రక్రియ 'ఒక అడుగు ముందు.. రెండడుగులు వెనక్కి..' అన్న చందాన సాగుతోంది. గత డిసెంబరులో డిపో ఏర్పాటుకు ఉత్తర్వులు వెలువడిన అనంతరం స్థలాన్ని గుర్తించారు. మండల పరిషత్తు, పంచాయతీరాజ్ కార్యాలయాల సముదాయంతో పాటు పౌర సరఫరాల గోదాములను కూడా ఖాళీ చేసి ఆర్టీసీకి అప్పగించాల్సి ఉంది. ఈ మేరకు జనవరి 18లోగా ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వీటిలో పౌర సరఫరాల గోదాము మినహా సముదాయంలోని అన్ని కార్యాలయాలను మరో చోటుకు తరలించి భవనాలను, స్థలాన్ని ఆర్టీసీకి అప్పగించారు.

**టాస్క్ కేంద్రం ఉంటుందా!**

మండల పరిషత్తు ఆవరణలో గతేడాది నిర్మించిన టాస్క్ కేంద్రాన్ని మరో చోటుకు తరలించేందుకు ఇప్పటివరకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ సముదాయంలోని ఎంపీడీవో, ఉపాధిహామీ, మండల విద్యాధికారి, భవిత కేంద్రం, ఆబ్కారీ ఈఎస్, పంచాయతీరాజ్ ఈఈ, ఎస్ఈ, క్యూసీ కార్యాలయాలన్నింటినీ తరలించగా, టాస్క్



కేంద్రాన్ని మాత్రం అక్కడే కొనసాగిస్తున్నారు. డిపో ఏర్పాటు అనంతరం కూడా కొనసాగించాలంటే డిపో మీదుగానే ఆ భవనంలోకి వెళ్లాల్సి ఉంటుంది. లేదంటే ప్రత్యేక దారిని నిర్మించాలి. అలాగే మండల పరిషత్తు సముదాయంలో స్టేషన్ రోడ్డులో నిర్మించిన వాణిజ్య సముదాయాన్ని కూడా ఆర్టీసీకి అప్పగిస్తారా! ఇన్నాళ్లూ సంరక్షించిన మండల పరిషత్తు పర్యవేక్షణలోనే ఉంచుతారా! అన్న విషయమై పాలకులు స్పష్టమైన నిర్ణయం తీసుకుంటేనే డిపో ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగుతుంది.

**కూలీల పంచాయితీతో అనిశ్చితి**

పౌరసరఫరాల శాఖ గోదాంలో ఎంఎల్‌ఎస్(మండల స్థాయి నిల్వ) కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రం ద్వారా రేషన్ దుకాణాలకు ప్రభుత్వం బియ్యం సరఫరా చేస్తోంది.

ఎంఎల్‌ఎస్ కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్‌లోని గోదాములోకి తరలించేందుకు అధికారులు యత్నించారు. కానీ ఎంఎల్‌ఎస్ కేంద్రానికి చెందిన హమాలీలను అనుమతించబోమని మార్కెట్‌లో పని చేసే హమాలీలు తేల్చిచెప్పారు. మార్కెట్ పరిధిలోని గోదాముల్లో తాము తప్ప ఇతరులు పనులు చేయడాన్ని అంగీకరించబోమని మొండికేశారు. దీనిపై అధికారులు పలు దఫాలుగా నిర్వహించిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో గోదాము తరలింపు ప్రక్రియ ముందుకు సాగడం లేదు. మరోవైపు పరిసర ప్రాంతాల్లోని ఇతర గోదాములను కూడా అధికారులు పరిశీలించారు. పెద్దబొంకూర్ సమీపంలోని గోదాములోకి తరలించే అవకాశాలను పరిశీలిస్తున్నారు.

# పారిశ్రామిక ప్రాంతం.. అభివృద్ధి మంత్రం

గోదావరిఖని: నగరపాలిక అభివృద్ధిలో ఇకపై పరిశ్రమలు భాగస్వాములు కానున్నాయి. స్థానిక పరిశ్రమలకు సంబంధించిన సీఎస్సార్ నిధులతో ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, నిర్వహణపై దృష్టి పెట్టాలంటూ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రణాళికలు రూపొందించి ఆయా పరిశ్రమలకు ప్రతిపాదనలు పంపించారు. ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం కాకుండా కాలనీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచి.. పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రహదారులు, మురుగు కాలువల నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఆయా పరిశ్రమలు కార్మికుల కాలనీల్లో పారిశుద్ధ్య, నీటి సరఫరా, వీధి దీపాలు తదితర వసతులు కల్పిస్తుండగా ఇకపై ప్రభావిత ప్రాంతాల బాధ్యతలు వహించాలని కోరారు. ఇందుకు పరిశ్రమలు సానుకూలంగా స్పందించి వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అందుకు అనుగుణంగా పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. నిధుల కేటాయింపునకు సంబంధిత పరిశ్రమల కేంద్ర కార్యాలయాలకు లేఖలు రాశాయి.

**వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పనులు**

రామగుండం నగరపాలిక ప్రాంతంలో ఎక్కువగా సింగరేణి కార్మికులు ఉండగా.. ఎన్టీపీసీ పరిశ్రమ పరిసర ప్రాంతాల్లో ప్రభావిత కాలనీలున్నాయి. సింగరేణి క్వార్టర్లలోనే సంస్థ కార్మికులు ఉంటుండగా.. యాజమాన్యమే పారిశుద్ధ్యం, వీధిదీపాలు, తాగునీటి సదుపాయంతో



పాటు వివిధ అభివృద్ధి, నిర్వహణ పనులు చేపడుతోంది. కార్మికులు నివసించే ఇతర కాలనీల నిర్వహణ సంస్థే చేపట్టాలని నగరపాలిక ప్రతిపాదించింది. టౌన్‌షిప్ నిర్వహణ, ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి పనులు చేపడుతున్న ఎన్టీపీసీ యాజమాన్యం ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన, నిర్వహణ బాధ్యతలు సైతం చేపట్టాలంది. ఇదే తరహాలో రామగుండం ఎరువుల కర్మాగారానికి సైతం ప్రతిపాదనలు పంపింది. పనులకు ఎన్టీపీసీకి రూ.50 కోట్లు, ఆర్‌ఎఫ్‌సీఎల్‌ను రూ.3.5 కోట్లు కేటాయించాలని కోరింది. చెత్త సేకరణ తదితర వాహనాల కొనుగోలు, నిర్వహణ వ్యయాలు కలిపి నగరపాలిక ప్రతిపాదనలు పంపించగా కేవలం కొనుగోళ్ల సంబంధిత నిధులు మాత్రమే మంజూరయ్యే అవకాశమున్నట్లుగా అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే పారిశుద్ధ్య నిర్వహణలో కీలకమైన అత్యాధునిక యంత్రాలతో కూడిన వాహనాలు, చెత్త తరలింపులో కీలకమైన ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలను కొనుగోలు చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆయా పరిశ్రమలు కేటాయించే నిధులతో నగరపాలిక నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టి రామగుండం నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి.

చురకలు



# సరఫరా పెరిగినా.. ట్యాంకర్లకు డిమాండే

హైదరాబాద్: మహానగరంలో జలమండలి సరఫరా చేసే నీటి పరిమాణం అవసరం మేరకు ఉన్నా పలు ప్రాంతాల్లో ట్యాంకర్లకు భారీగా డిమాండ్ పెరగడంపై జలమండలి దృష్టిసారించింది. గతేడాది ఇబ్బందులు ఎదురైన ప్రాంతాల్లో ఈసారి పునరావృతం కాకుండా సరఫరాను పెంచింది. అయినా జనవరి, ఫిబ్రవరి నెలల్లో ట్యాంకర్లకు డిమాండ్ 60 శాతానికి పెరగడంతో అధికారులు చర్యలు చేపట్టారు. ట్యాంకర్లు ఎక్కువ బుక్కవుతున్న ప్రాంతాల్లో సరఫరా ఎలా, ఎన్ని గంటలు చేస్తున్నారు.. నిర్దేశించిన మేరకే అవుతోందా.. ? ఇలాంటి కీలక అంశాలను పరిశీలిస్తున్నారు. ఇటీవల జరిగిన జనరల్ మేనేజర్ల సమావేశంలో ఎండీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. నీటి సరఫరా పెరిగిన తర్వాత కూడా ట్యాంకర్లు ఎందుకు ఎక్కువ బుక్ అవుతున్నాయని ప్రశ్నించారు. సరఫరా సక్రమంగా ఉండేలా చూస్తూ ట్యాంకర్ల డిమాండ్‌ను తగ్గించడంపై జనరల్ మేనేజర్లు దృష్టిసారించాలని ఆదేశించారు.

**గత ఏడాదితో పోలిస్తే..**

గతేడాదితో పోలిస్తే మణికొండలోని డివిజన్-18లో ట్యాంకర్ల డిమాండ్ 161 శాతం పెరిగింది. ఇక్కడ గతేడాది ఫిబ్రవరిలో 2875 ట్యాంకర్లు సరఫరా కాగా ఈ ఏడాది ఫిబ్రవరిలో 7513 ట్యాంకర్లు సరఫరా అయ్యాయి. ఆసిఫ్‌నగర్ డివిజన్‌లో గతేడాది కంటే ఈ ఫిబ్రవరిలో ఆసిఫ్‌నగర్ డివిజన్‌లో 144 శాతం, నిజాంపేట డివిజన్‌లో 102 శాతం, దుర్గం చెరువు డివిజన్‌లో 94 శాతం. అల్వాల్, నారాయణగూడ, కూకట్‌పల్లి డివిజన్లలో 55 శాతం పైగా ట్యాంకర్లు పెరిగాయి.





జలమండలి పరిధిలో 22 డివిజన్లు ఉండగా ఈసారి 17 డివిజన్లలో గత ఏడాదికంటే ట్యాంకర్ల డిమాండ్ పెరిగింది. గత ఫిబ్రవరి కంటే ఈసారి 63 శాతం ట్యాంకర్లు పెరిగాయి. గతంలో 58,868 ట్యాంకర్లు సరఫరా కాగా.. ఈసారి 95,783 చేశారు.

అత్యధిక డిమాండ్ మణికొండ, ఎస్సార్ నగర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, నిజాంపేట, ప్రగతినగర్, మాదాపూర్‌లో ఉంది. నగరంలో సరఫరా అయ్యే ట్యాంకర్లలో 80 శాతం ఈ ప్రాంతాల్లోనే ఉన్నట్లు జలమండలి విశ్లేషించింది. డిమాండ్‌కు అనుగుణంగా ట్యాంకర్లను సరఫరా చేస్తున్నా అవసరాలను పరిగణనలోకి తీసుకుని ట్యాంకర్ల సరఫరాలో హేతుబద్ధీకరణ ఉండాలని జలమండలి నిర్ణయించింది.

# వివరాల నమోదుకు 'అపార్' కష్టాలు

హైదరాబాద్: దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో కేజీ నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ఒకే గుర్తింపు కార్డు ఉండాలన్న లక్ష్యంతో కేంద్రం 'అపార్' కార్డు అందిస్తోంది. ఆన్‌లైన్‌లో సంబంధిత వివరాల నమోదుకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని విద్యాసంస్థలు అష్టకష్టాలు పడుతున్నాయి. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మరికొన్ని రాష్ట్రాల్లో ఈ కార్డులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే విద్యార్థులకు అందించాయి. ఇక్కడ మాత్రం ఆన్‌లైన్ నమోదులో సమస్యలు ఏర్పడుతున్నాయి. ఆధార్, పాఠశాల రికార్డుల్లో ఒకలా ఉంటేనే.. వివరాలు నమోదు చేస్తున్నప్పుడు విద్యార్థుల పేర్లు, చిరునామాలు, తల్లిదండ్రుల పేర్లలో స్వల్ప మార్పులున్నా సాఫ్ట్‌వేర్ తీసుకోవడం లేదు. ఎల్‌కేజీ, ఒకటో తరగతిలో చేర్పించేటప్పుడు ఇంటిపేరు లేకుండా పేరు రాయించడం, ఆధార్‌లో ఇంటిపేరు నమోదు చేయించడంతో పాఠశాల రికార్డుల ప్రకారం ఆధార్‌లో పేరు ఉండకపోవడంతో నమోదు కావడం లేదు. విద్యార్థుల పేర్లను తెలుగులో రాసేప్పుడు ఒక విధంగా... ఆంగ్లంలో రాసేప్పుడు మరోలా ఉండటం, ఆధార్‌లో ఇంకోలా ఉండటంతోనూ సమస్యలు వస్తున్నాయి. శ్రీనివాస్ అన్న పేరును స్కూల్ రికార్డులో 'ఎస్ఆర్ఐ'(శ్రీ) అని రాసుంటే... ఆధార్‌లో ఎస్ఆర్ఈఈ




(శ్రీ)అని ఉంటోంది. ఆధార్ కార్డులో ఉన్నట్టుగానే స్కూల్ రికార్డులో మార్పు చేయాలంటే తల్లిదండ్రుల సమ్మతిపత్రం సమర్పించాలని సూచిస్తున్నారు. మార్పులు, చేర్పులకు వారం, పదిరోజుల సమయం అవసరం కావడంతో నమోదు ఆలస్యమవుతోంది.

స్కూల్ రికార్డులకు అనుగుణంగా ఆధార్ కార్డులో మార్పులు చేయించుకురావాలని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు చెబుతున్నారు.

**భవిష్యత్తులో ప్రయోజనాలు**

అపార్ కార్డుతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. కార్డుపై నంబరును కేంద్ర, రాష్ట్ర విద్యాశాఖ వెబ్‌సైట్లలో నమోదు చేస్తే చాలు.. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఎక్కడ చదివారన్న వివరాలు తెలిసిపోతాయి. ఎప్పటికప్పుడు విద్యార్థుల వివరాలు నవీకరించేందుకు (అప్‌డేట్) వీలుంటుంది. ఇందులో విద్యాప్రయాణం, సాధించిన విజయాలు అన్నీ ఉంటాయి. అపార్ వివరాలను అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ (ఏబీసీ) అనే ఎడ్యులాకర్‌కు అనుసంధానించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలోని ఒక్కో పాఠశాలలో 50శాతం కూడా పూర్తికాలేదు.

# వన్యప్రాణుల నిలయాలు పర్యావరణ నేస్తాలు



హైదరాబాద్: మానవులు, ఇతర జంతుజాతులు కలిస్తేనే ప్రకృతి. మనిషి ప్రగతి సాధిస్తే మొదటగా నష్టం వాటిల్లేది వన్యప్రాణులకే. అడగకుండానే అన్నీ ఇచ్చే పర్యావరణానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మనం విఘాతం కలిగిస్తూనే ఉన్నాం. అడవుల నరికివేత, కాలుష్యం జంతుజాతుల మనుగడకు అడ్డంకిగా మారాయి. వన్యప్రాణుల మనుగడకు ఊతమివ్వడం, అరుదైన జీవులను అంతరించిపోకుండా కాపాడుకోవడం, వాటి సంతతి పెరుగుదలకు చేయూత ఇవ్వడం, వాటి ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించడం, జంతువులను రక్షించాల్సిన అవసరాలపై సాధారణ ప్రజలకు అవగాహన కల్పించడానికి ఏటా మార్చి 3న ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో భాగ్యనగరంలో ఉన్న జంతు ప్రదర్శనశాల, ఇతర పార్కులు అందులో నివసిస్తున్న జంతువులు, వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ప్రత్యేక కథనం.

సంతతి ఉత్పత్తి కేంద్రంగా నెహ్రూ జూ పార్కు

విస్తీర్ణం: 400 ఎకరాలు
సింహాలు: 40
పులులు: 20
చుక్కల జింకలు: 150
రామచిలకలు: 50

వీటితో పాటు మొత్తం 3,000లకు పైగా జంతువులు, పక్షులున్నాయి. భాగ్యనగర సందర్శనకు వచ్చిన వారిలో దాదాపు అందరూ నెహ్రూ జంతు ప్రదర్శనశాలను సందర్శిస్తారు. సుమారు 400 ఎకరాల్లో ఏర్పాటైన ఈ జూపార్కులో జంతువుల సహజ ఆవాస కేంద్రాలుగా ఓపెన్ ఎన్‌క్లోజర్లు నిర్మించారు. దీంతో పాటు 2020 నుంచి వరుసగా అయిదుసార్లు ఐఎస్ఐ గుర్తింపు లభించింది.

జూలోని జంతువులకు నెలకు 18వేల క్వింటాళ్ల మాంసం, 1,700 కిలోల చేపలతో పాటు పౌడర్ ఫీడ్, గడ్డి, ఫలాలు, కూరగాయలు, కోడిగుడ్లు అందిస్తారు. జూలో రాత్రిపూట సంచరించే నిశాచర జంతువుల హౌజ్‌ను 1987లో ఏర్పాటు చేశారు. దేశంలోనే ఇదే మొదటిది కావడం విశేషం. ఇందులో గుడ్లగూబలు, ముళ్లపందులు, గబ్బిలాలు తదితర జంతువులు, పక్షులుంటాయి.

అంతరించి పోతున్న రాబందు ఈ జూలో ఇటీవల ఓ గుడ్డు పెట్టింది. దీంతో ఈ జూ పార్కును రాబందుల సంతానోత్పత్తి కేంద్రంగా సీజడ్ఏ గుర్తించింది. ఇక్కడ 14 ఏళ్ల క్రితం ఆరు మూషిక జింకలతో ప్రారంభమైన సంతానోత్పత్తి కేంద్రంలో సుమారు 500 మూషిక జింకలు జన్మించాయి.

మృగవని పార్కులో

విస్తీర్ణం: 1,200 ఎకరాలు
చుక్కల జింకలు: 450
సాంబారు జింకలు: 40
అడవి దుప్పిలు: 250
నెమళ్లు: 250
పక్షి జాతులు: 150
కుందేళ్లు: 150
బ్లాక్ కోబ్రాలు: 5

ఒక వైపు హిమాయత్‌సాగర్.. మరోవైపు ఉస్మాన్(గండిపేట)సాగర్ జంట జలాశయాల అందాలు.. ఆహ్లాదకరమైన వాతావరణం.. పచ్చని చెట్లు.. పక్షుల కిలకిలారావాలు.. జింక పిల్లల పరుగులు.. పురివిప్పి నాట్యం చేస్తూ స్వాగతం పలికే నాట్యమయూరాలతో 'మృగవని జాతీయ జింకలపార్కు' పర్యాటకులకు కనువిందు చేస్తోంది. వివిధ రకాల సీతాకోక చిలుకలు, కోబ్రాలు, పాములు, తాబేళ్లు, అడవి పిల్లులు, ఉడుములు ఉన్నాయి. అడవిలో 650 రకాల మొక్కలు ఉండగా.. ఇందులో 150 రకాల ఔషధ మొక్కలు ఉండటం గమనార్హం. వన్యప్రాణుల దాహాన్ని తీర్చడానికి 14 చెక్‌డ్యాంలు, 15 కుంటలు, రెండు చెరువులను గతంలోనే నిర్మించారు. పదేళ్ల క్రితం నగరంలో నిర్వహించిన జీవవైవిధ్య సదస్సు సమయంలో ప్రభుత్వం చిలుకూరు మృగవని జాతీయ జింకల పార్కులో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి రూ.కోటి నిధులు వెచ్చించింది.

జింకలకు నిలయంగా హరిణ వనస్థలి

ఎల్బీనగర్‌లో ఆటోనగర్‌కు ఆనుకుని హరిణ వనస్థలి నేషనల్ పార్కు ఉంది. 453 హెక్టార్లలో విస్తరించి ఉంది. 1994లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అటవీప్రాంతాన్ని 'మహవీర్ హరిణవనస్థలి నేషనల్ పార్కు'గా ఏర్పాటు చేసి, సందర్శకులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. అరుదైన కృష్ణ జింకలు, మచ్చల జింకలు, కోతులు, పాములు, నెమళ్లు, ఉడుములు, ముంగిసలు కనువిందు చేస్తుంటాయి. ఈ వేసవిలో అవి ఇబ్బందులు పడకుండా ఎక్కడికక్కడ నీటి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 600పైగా కృష్ణ జింకలు, మరో 600కు పైగా మచ్చల జింకలు ఉంటాయి. కృష్ణజింకల బ్రీడింగ్ సెంటర్‌గా ఈ పార్కును పరిగణిస్తారు.

# ఎక్కే బస్సు ఎక్కడుందో?




హైదరాబాద్: నిల్చున్న బస్టాపునకు ఎక్కాల్సిన బస్సు ఎంత దూరంలో ఉందో తెలుసుకోవచ్చు. బస్టాపునకు అది ఎప్పుడొస్తుందనే సమాచారమూ తెలిసిపోతుంది. జీహెచ్‌ఎంసీ కొత్తగా రూపొందించిన 'బస్సుల సమాచార వ్యవస్థ'తో అది సాధ్యం కాబోతుంది.

**హైటెక్ హంగులతో..**

జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మొత్తం 10వేల కిలోమీటర్ల రోడ్లుండగా, అందులో ప్రధాన 2వేల కిలోమీటర్లపై సిటీ బస్సులు కనిపిస్తుంటాయి. ఆ రోడ్లపై జీహెచ్‌ఎంసీ దాదాపు 1,500 బస్టాపులను ఏర్పాటు చేసింది. ఆర్టీసీ ఆ రహదారులపై దాదాపు 3వేల సిటీ బస్సులు నడుపుతోంది. రోజూ సుమారు 20లక్షల మంది ప్రయాణిస్తుంటారు. మెట్రో స్టేషన్ల కింద ఉండే బస్టాపులు అదనం. దాదాపు ఏడేళ్ల క్రితం జీహెచ్‌ఎంసీ ఆయా బస్టాపులను నిర్మించింది. ఆర్టీసీ, జీహెచ్‌ఎంసీ మధ్య సమన్వయం లేకపోవడంతో ఇప్పటికే చాలా బస్టాపులు అసౌకర్యాలతో ప్రయాణికులకు నరకం చూపుతున్నాయి. దీంతో ఆధునిక డిజైన్లతో బస్టాపులను పునరుద్ధరించాలని, లండన్ నగరంలో మాదిరి హైటెక్ హంగులతో కూడిన షెల్టర్లను కట్టేందుకు జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం కసరత్తు చేస్తోంది. బస్సుల కోసం బస్టాపుల్లో ఎదురు చూస్తోన్న ప్రయాణికులకు సమయం, దూరం వంటి వివరాలను తెలిపే డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. ఆధునికీకరణలో భాగంగా ఇటీవల ఏర్పాటు చేసిన కొత్త బస్టాపులు: 248

మొత్తం: 1432
సిటీ బస్సులు: 2,800

**పీపీపీ పద్ధతిలో..** నగరంలోని అన్ని బస్టాపుల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసి, బస్సుల్లోని జీపీఎస్‌తో అనుసంధానం చేసేందుకు ఆర్టీసీ సంస్థతో చర్చలు పూర్తయినట్లు జీహెచ్‌ఎంసీ చెబుతోంది. ఈ విధానం పీపీపీ పద్ధతిలో ఉండనుంది. ప్రకటనల ద్వారా ఏజెన్సీకి వచ్చే ఆదాయంతోనే.. డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసి, బస్సులు, బస్టాపులను అనుసంధానం చేసేలా నిబంధన పెడతామని చెబుతోంది. బోర్డుల కొనుగోలు, వాటి నిర్వహణ, సాఫ్ట్‌వేర్ తయారీ ఖర్చులన్నీ ప్రైవేటు సంస్థ భరించాలని అధికారులు చెబుతున్నారు.

# పరీక్షలకే 'పరీక్ష'



హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో అసౌకర్యాలు నెలకొన్నాయి. అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో కొన్నిచోట్ల పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 837 పరీక్షా కేంద్రాల్లో 1,77,425 మంది విద్యార్థులు ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకూ పరీక్షలు రాయనున్నారు. అన్ని కేంద్రాల్లోనూ తాగునీరు, నిరంతర విద్యుత్తు, బెంచీలు సమకూర్చుతామని యంత్రాంగం చెప్పినా.. ఇప్పటికీ కొన్నిచోట్ల తాగునీటి సదుపాయం లేదు. ఆయా కేంద్రాల్లో నీళ్ల క్యాన్లు తెప్పించాలని నిర్ణయించారు.

**కనీస సౌకర్యాలూ లేవు...**

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని 30 శాతానికి పైగా కేంద్రాల్లో అసౌకర్యాలే ఉన్నాయి. పాతబస్తీ సహా కార్వాన్, గోల్కొండ, ఖైరతాబాద్, షేక్‌పేట, అమీర్‌పేట ప్రాంతాల్లోని కొన్ని పాఠశాలల్లో తాగునీరు లేదు. గతంలో జలమండలి అధికారులతో మాట్లాడి ఉచిత తాగునీరు ఇస్తామని చెప్పినా కొన్నింటికే పరిమితమయ్యారు. ఉచిత విద్యుత్ ఇస్తామని గతంలో ప్రకటించినా... ఇంకా అమలు కావడంలేదు. కొన్ని కేంద్రాల్లో పారిశుద్ధ్య లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఎల్బీనగర్, రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, శంషాబాద్ ప్రాంతాల్లోని కొన్ని పాఠశాలలు, మేడ్చల్ పరిధిలోని జవహర్‌నగర్, మేడ్చల్, బోడుప్పల్, పిర్జాదీగూడ, శామీర్‌పేట్ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు పరీక్ష రాసేందుకు సరైన బల్లలు లేవు. కొన్ని మరమ్మతులకు గురయ్యాయి.

**ఇంకా సమయం ఉంది..** పరీక్షలు ప్రారంభమయ్యేలోగా ఫ్యాన్లు, తాగునీరు, శౌచాలయాలకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఎండల నేపథ్యంలో తాగునీరు, ఓఆర్ఎస్ పొట్లాలు అందుబాటులో ఉంచాలి. గ్రూప్-1 పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచినట్టుగా పదో తరగతి పరీక్షా కేంద్రాల్లోనూ ఒకరు లేదా ఇద్దరు వైద్య సిబ్బందిని నియమిస్తే... విద్యార్థులు, విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి ఉపయుక్తంగా ఉంటుంది.

# జమకాని వంట గ్యాస్ రాయితీ

కరీంనగర్ : కరీంనగర్ లోని విద్యానగర్‌కు చెందిన రమేష్‌కు నాలుగు నెలలవుతున్నా వంట గ్యాస్ రాయితీ డబ్బులు తన ఖాతాలో జమకావడంలేదు. ఆదర్శనగర్‌లో నివాసముంటున్న అశోక్‌ది ఇదే పరిస్థితి. ప్రారంభంలో జమకాగా ప్రస్తుతం కావడంలేదు. దీనిపై ఎవరిని సంప్రదించాలనే విషయం తెలియక పలువురు లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు.

**రూ.లక్షకుపైగా లబ్ధిదారులు**

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనికోసం ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించగా 2,76,913 మంది దరఖాస్తు చేసుకుంటే.. 1,43,899 మంది అర్హులుగా తేలారు. ఈ పథకం ప్రవేశపెట్టేనాటికి ఒక్కో గ్యాస్ సిలిండర్ ధర రూ.974లుండేది.

**తగ్గించిన చమురు సంస్థలు**

ఈ పథకం ప్రవేశపెట్టిన తరువాత గ్యాస్ సిలిండర్ ధరలను ఆయా చమురు సంస్థలు కొద్దికొద్దిగా తగ్గిస్తూ వచ్చాయి. ప్రస్తుతం రూ.875లకే సిలిండర్‌ను విక్రయిస్తున్నాయి. దీనికి కేంద్ర ప్రభుత్వం రూ.47లను రాయితీగా ప్రతి వినియోగదారునికి జమచేస్తోంది. దీంతో రూ.828లు వినియోగదారుడు చెల్లిస్తున్నాడు. రాష్ట్ర ప్రభుత్వ పథకంలో భాగంగా రూ.500లకే సిలిండర్ ఇవ్వాలంటే ఒక్కో సిలిండర్‌కు రూ.328లు ఆయా లబ్ధిదారుని ఖాతాలో జమకావాలి. కాని నాలుగు నెలలుగా జమకావడంలేదు.

**పరిమితిపై సందిగ్ధం?**

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌కు రూ.47ల రాయితీని 12 సిలిండర్ల వరకే వర్తింపజేస్తోంది. ఇదే మాదిరి రాష్ట్ర ప్రభుత్వం రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకానికి ఏమైనా పరిమితులు విధించిందా అనే ప్రశ్న లబ్ధిదారుల్లో తలెత్తుతుంది. దీనిపై ఆయా చమురు సంస్థల డీలర్లను సంప్రదిస్తే దీనిపై అవగాహన లేదని సమాధానమిస్తున్నారు. జిల్లా అధికారులకు సైతం అవగాహన లేకపోవడంతో ఎందుకు రాయితీ జమకావడంలేదో సమాధానం ఉండటంలేదు. ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

# పట్టణాల్లో.. పార్కింగ్ కష్టాలు

కరీంనగర్ : జిల్లా కేంద్రాలు, నగరపాలికలు, పురపాలికల్లో పార్కింగ్ కష్టాలు తీరడం లేదు. పట్టణాల్లో కనీసం వాహనాలు నిలిపేందుకు స్థలాలు లేక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పుర, నగరపాలికల అధికారులు ఆ వైపే ఆలోచన చేయడం లేదు. వివిధ పనుల కోసం వచ్చే వాహనాలు వందల్లో ఉంటుండగా వీటిని ఎక్కడ పడితే అక్కడ నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

**స్థలాల ఎంపికలో నిర్లక్ష్యం**

ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో ప్రధాన వ్యాపార, వాణిజ్య ప్రాంతాల్లో రాకపోకలు సాగించడానికి వీల్లేకుండా విపరీతమైన రద్దీ ఉంటుంది. ఈ ప్రాంతాల్లో ఎలాంటి పార్కింగ్ సౌకర్యం లేక వాహనాలను దుకాణాల ముందే నిలపడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కరీంనగర్‌లోని టవర్ సర్కిల్, మార్కెట్ ప్రాంతంలో పార్కింగ్ స్థలం లేదు. అన్నపూర్ణ కాంప్లెక్స్ దుకాణాల సముదాయానికి సంబంధించిన స్థలంలోనే వాహనాలు నిలుపుతున్నారు. అయినా సరిపోక తీవ్ర ఇబ్బందులు తలెతుతున్నాయి. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో ఆర్అండ్‌బీ కార్యాలయ ఆవరణలో మల్టీపర్పస్ పార్కింగ్ ఏర్పాటు చేస్తామనే ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది.

**చలానా మాత్రం తప్పదు**

పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్ల పక్కన, దుకాణాల ఎదుట వాహనదారులు వాహనాలు నిలుపుతున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని ట్రాఫిక్ పోలీసులు చలానా విధిస్తున్నారు. పార్కింగ్ వసతి కల్పించకుండా వాహనదారుల జేబులు మాత్రం ఖాళీ చేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఇదీ పరిస్తితి..**



కరీంనగర్ ప్రధాన వ్యాపార ప్రాంతాల్లో పార్కింగ్ సౌకర్యమే లేదు. రద్దీ సమయాల్లో, పండుగల సమయాల్లో వాహనాలు నిలిపేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కారులో రావడమంటే సాహసం చేయాల్సిందే. కోరుట్లలో కల్లూరు రోడ్డు, ఇందిరా రోడ్డు, టీచర్ క్లబ్ రోడ్డు వైపు రహదారులను ఆక్రమించి వాహనాలు నిలుపుతుండటంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల వద్దా పార్కింగ్ లేదు. పార్కింగ్ ప్రదేశాలు లేక జాతీయ రహదారి పక్కన ద్విచక్ర వాహనాలు నిలుపుతుంటారు.

జగిత్యాలలో రహదారుల పక్కనే వాహనాలు నిలుపుతున్నారు. పోలీసులు వాటికి జరిమానా విధిస్తున్నారు. మున్సిపాలిటీ తరఫున పార్కింగ్ సౌకర్యం కల్పించడం లేదు. జమ్మికుంటలో ఏడు వ్యాపార ప్రాంతాలు ఉండగా పార్కింగ్ సౌకర్యం లేక వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

హుజూరాబాద్‌లో ఎనిమిది వ్యాపార ప్రాంతాలు ఉండగా ఎక్కడా వాహనాలు నిలిపేందుకు ప్రత్యేక స్థలాలు లేవు.

గోదావరిఖని పట్టణంలో ప్రధాన ప్రాంతాలు మూడు ఉండగా రోడ్డు పక్కన, కొన్నిచోట్ల రోడ్లపైనే వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. పెద్దపల్లిలో నాలుగు ప్రాంతాల్లో రద్దీ ఉంటుండగా వాహనాలు నిలపడానికి ఎక్కడా స్థలం లేదు. గతంలో ఉన్న జెండా కూడలి పార్కింగ్ స్థలాన్ని చిరు వ్యాపారులు ఆక్రమించడంతో ఆ ప్రాంతం ఇరుకుగా మారింది. సిరిసిల్లలో ఎనిమిది ప్రధాన వ్యాపార ప్రాంతాలు ఉండగా పార్కింగ్ స్థలాలు లేక వాహనదారులు రహదారుల పక్కన వాహనాలు నిలుపుతున్నారు.

# నదీ తీరంలో నారసింహుడి కల్యాణం

ధర్మపురి: ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే కల్యాణ వేదిక మార్పుకు అధికారులు దేవాదాయశాఖకు ప్రతిపాదనలు పంపారు. ఈ నెల 10న ఉత్సవాలు ప్రారంభం కానుండగా.. స్వామివారి కల్యాణోత్సవం 11న జరగనుంది. ఏటా దేవస్థానంలోని శేషప్ప కళావేదికపై కల్యాణోం జరుగుతోంది. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు, పోలీసులకు భద్రత పరంగా ఇబ్బందిగా ఉంటోంది. పెద్ద సంఖ్యలో ఉన్నతాధికారులు, వీఐపీలు తరలివస్తారు. స్వామివారు వేదికపైకి చేరే సమయానికే ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో నిండిపోతోంది. దీంతో ఉత్సవమూర్తి దర్శన భాగ్యం కొద్ది మందికే లభించేది. స్థానికులు, దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకి నిరాశే ఎదురయ్యేది. దీంతో కొన్నేళ్లుగా కల్యాణవేదిక మార్పుపై భక్తులు, స్థానికులు అధికారులకు విజ్ఞప్తులు చేస్తున్నారు. **30 వేల మంది కూర్చునే అవకాశం**

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, ఇంజినీరింగు అధికారులతో వేదిక మార్పుపై ఆదివారం చర్చించారు. ఆలయ అర్చకులు, వేద పండితుల అభిప్రాయాలను తీసుకుని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలను పంపించారు. అనుమతులు రాగానే బ్రాహ్మణసంఘం భవనం పక్కన శ్రీమఠం ఖాళీ స్థలంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించాలని భావిస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పనులు చేపట్టారు. ఇక్కడ ఉత్సవాన్ని నిర్వహిస్తే తెలుగు కళాశాల ముందు ఖాళీ స్థలంలో వాహనాలను నిలుపుకోవచ్చని.. తెనుగువాడ నుంచి నేరుగా రహదారి గోదావరినది వరకు ఉండటంతో రవాణా పరంగా అనుకూలంగా ఉంటుందని ఆలోచిస్తున్నారు. ప్రస్తుతం శేషప్ప కళావేదికపై నుంచి కేవలం 5 వేల మంది మాత్రమే స్వామివారిని దర్శిస్తుండగా.. నూతన స్థలంలో 30 వేల మంది భక్తులు కూర్చునే అవకాశముంటుంది.

# పల్లెల్లో ఆర్థిక సౌరభాలు

నల్గొండ : రైతులు, మహిళా సంఘాలు, ఇతరులు ఆర్థిక పరిపుష్టి సాధించడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. అర్హులకు ప్రయోజనం అందించేందుకు పీఎం కేయిఎస్‌యుఎం-ఏ పథకాన్ని అమలు చేస్తోంది. దీని ప్రకారం వ్యవసాయానికి అనుకూలంగా లేని, బంజరు భూముల్లో సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రెడ్కో సంస్థ అర్హత కలిగిన రైతుల నుంచి సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. నిలకడగా 25 సంవత్సరాల పాటు ఆదాయం పొందే ప్రాజెక్టు ఇది. ఈనెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
అర్హులెవరంటే..రైతులు(వ్యక్తిగతంగా), రైతు ఉత్పత్తి సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, మండల గ్రామ సమాఖ్యలు, పంచాయతీ స్థానిక సంస్థలు భూమిని లీజుకు తీసుకొని కూడా సౌర ప్లాంట్ యూనిట్‌ను నిర్ణీత సామర్థ్యంతో ఏర్పాటు చేసుకోవచ్చు.
ముఖ్యాంశాలిలా..
మొత్తం 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యం
ఒక్కో యూనిట్ సామర్థ్యం: 500 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల



వరకు.ఒక మెగావాట్ సౌర విద్యుదుత్పత్తికి మూడున్నర నుంచి నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ప్లాంట్ నిర్మించాల్సి ఉంటుంది.
ఉత్పత్తి చేసిన సౌర విద్యుత్‌ను తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(టీజీ-ఈఆర్‌సీ) నిర్ణయించిన టారిఫ్ ప్రకారం కొనుగోలు చేస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు వెబ్‌సైట్: %www.tgredco.telangana.gov.in% ను సంప్రదించాలి.
పూర్తి సమాచారం, సందేహాలు నివృత్తికి..రెడ్కో జిల్లా కార్యాలయం నల్గొండలో సంప్రదించాలి. టెలిఫోన్ నంబర్: 08682 224447, చరవాణి నెంబరు: 98318 78596, 63049 03923 సంప్రదించవచ్చు.

**భూములు పరిశీలిస్తున్నాం**

పాండురంగారావు, రెడ్కో సంస్థ ఉమ్మడి జిల్లా మేనేజర్, నల్గొండ
ఉపయోగంలో లేని భూముల్లో సౌర ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. దీనిపై మహిళా సంఘాలు, రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సకాలంలో ఆన్‌లైన్ దరఖాస్తులు పూర్తి చేసి సమాచారం పొందవచ్చు. కలెక్టర్ ఆదేశంతో నల్గొండ జిల్లాలో సౌర విద్యుదుత్పత్తికి కావాల్సిన ప్రాంతాలను పరిశీలిస్తున్నాం. సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో పరిశీలించాల్సి ఉంది.

# సమస్యల స్వాగతం

కొడిమ్యాల : కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 8 నుంచి 12 వరకు జరగనున్నాయి. ఏటా అయిదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు, జాతర నిర్వహిస్తున్నా భక్తులకు సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. జాతరకు తరలివచ్చే భక్తులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి.
పారిశుద్ధ్య లోపం..భోజనాల అనంతరం పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ఇతర వ్యర్థాలు, చెత్తను ఆలయ ఆవరణలోనే పడేస్తున్నారు. ఎప్పటికప్పుడు సిబ్బంది చెత్తను తొలగించకపోవడంతో ఆలయ పరిసరాలు అశుభ్రతకు నిలయంగా మారుతున్నాయి. ఉత్సవాల సమయంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటుందని భక్తులు పేర్కొంటున్నారు. అధికారులు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరుతున్నారు. ఆలయ పరిసరాల్లో మరుగుదొడ్లు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. ఆలయానికి వచ్చే మహిళలు అవస్థలు పడుతున్నారు. ఉత్సవాల సమయంలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నా ఉపయోగంలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
నీళ్ల ట్యాంకుకు వెళ్లే దారిలో పిచ్చిమొక్కలు, చెత్త
ప్రమాదకరంగా ఘాట్‌రోడ్డు...గుట్టపైకి వెళ్లడానికి ఏర్పాటు చేసిన ఘాట్ రోడ్డుకు ఎలాంటి రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ప్రమాదవశాత్తు అదుపుతప్పి వాహనాలు పడిపోయే అవకాశం ఉంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఘాట్ రోడ్డుపై సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. జాతర సమయంలో ఆలయ పరిసరాల్లోకి రాకుండా పోలీసులు వాహనాలను నిలిపివేస్తారు. ఇదే అదనుగా కొందరు ఆలయ సమీపంలో ప్రైవేటు ప్రార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తున్నారు. పోలీసులు ప్రత్యేక దృష్టిసారించి పార్కింగ్ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

**అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు**

బ్రహ్మోత్సవాలు, జాతరకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక సిబ్బందితో పారిశుద్ధ్య నిర్వహణ, బ్లీచింగ్ చేయిస్తాం. తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు ఉన్నవాటిని వినియోగంలోకి తెస్తాం. ఘాట్‌రోడ్డుపై మట్టి పోయించి గుంతలు పూడ్చివేసి మరమ్మతు చేయించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.వెంకన్న, ఈవో

# నాణ్యతా ప్రమాణాలు పట్టేదెవరికి?

పెద్దపల్లి : రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఉద్దేశించిన ఈ-నామ్ వ్యవస్థ వ్యాపారులకు వరంగా మారింది. పెద్దపల్లి మార్కెట్‌లో రైతులు తెచ్చిన పత్తికి నాణ్యతతో సంబంధం లేకుండా ధరలు నిర్ణయిస్తున్నారు. ఈ విషయంలో భారత పత్తి సంస్థ(సీసీఐ) చెల్లించే మద్దతు ధరను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ప్రస్తుత సీజన్ ఆరంభంలో 8 శాతం తేమ కలిగిన పత్తి క్వింటాలుకు రూ.7,520 ఉండగా ఇటీవల నాణ్యత తగ్గిందనే ఉద్దేశంతో సీసీఐ మద్దతు రూ.7,430కు కుదించింది. పత్తిలోని వివిధ ప్రమాణాల స్థాయిని బట్టి మద్దతు ధర అటు ఇటుగా మారుతోంది.**పట్టించుకోని అధికారులు**సీసీఐ పత్తిలో 8-12 వరకు తేమ శాతాన్ని అనుమతిస్తుంది. నిబంధనల ప్రకారం ఒక శాతం తేమ పెరిగితే ధర కూడా ఒక శాతం తగ్గుతుంది. 12 శాతం ఉంటే రూ.7,132కు కొనుగోలు చేస్తుంది. ఈ నిబంధనను వ్యాపారులకు వర్తింపజేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. శుక్రవారం పెద్దపల్లి మార్కెట్‌కు వచ్చిన పత్తిలో తేమ 18 శాతం ఉండగా ధర రూ.5003గా నిర్ణయించారు. ఈ మేరకు సంచిపై మార్కర్‌తో రాశారు. నిబంధనల ప్రకారం రూ.6,687 వరకు చెల్లించాలి. మార్కెట్‌లో నమోదైన గరిష్ఠ ధరను ప్రామాణికంగా తీసుకున్నా రూ.6,319 చెల్లించాలి. శుక్రవారం మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.7,022 వరకు నమోదైంది. అయితే ఇవేవీ వ్యాపారులకు ప్రామాణికంగా కనిపించడం లేదు.

**వ్యాపారికి నచ్చిందే ధర**


పెద్దపల్లి మార్కెట్‌లో 11 మంది క్రియాశీలక అడ్తీదారులుండగా వీరి వద్ద 7 నుంచి 8 మంది కొనుగోలుదారులు ఖరీదు చేస్తున్నారు.
వారం రోజులుగా ఇద్దరు, ముగ్గురు కొనుగోలుదారులే తీసుకుంటున్నారు. మిల్లర్లు మార్కెట్‌వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇక ఆన్‌లైన్‌లో ఇతర మార్కెట్‌కు చెందిన ట్రేడర్లు కొనుగోలు చేసే స్థాయిలో వ్యవస్థం అభివృద్ధి చెందలేదు. నాణ్యతను నిర్ణయించే పరికరాలు అందుబాటులో లేవు. సిబ్బందిని కూడా నియమించలేదు.

# సమస్యలకు చికిత్స చేయండి




కరీంనగర్ : నన్ను అందరూ పెద్ద దవాఖానా అని పిలుస్తారు. రోగులకు మెరుగైన సౌకర్యాలు అందించడంలో నిధులు లేక నిరుపేదగా మారాను. నన్ను నమ్ముకొని ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులతోపాటు, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలోని కొంతమంది ఇక్కడకు వస్తుంటారు. రెండేళ్ల కిందట వైద్య విధాన పరిషత్‌లో ఉన్న నన్ను వైద్య కళాశాలలోకి మార్చారు. జిల్లావాసులకు మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు అందిస్తానని ఆశించాను. కానీ నిధులు లేకపోవడంతో రోగిగా మారాను. జిల్లాయంత్రాంగం, ప్రజాప్రతినిధులు నా సమస్యను అర్థం చేసుకొని నిధులు కేటాయిస్తారని లేఖ రాస్తున్నాను. ఉమ్మడి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. నా దగ్గర ట్రామా కేర్ లేకపోవడంతో సుమారు 4000 మంది తీవ్రగాయాలై వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. ఆ సేవలు అందుబాటులో లేక ప్రైవేట్ దవాఖానాకు వెళ్లి రూ.లక్షలు ఖర్చు చేసి అప్పులపాలయ్యారు.
జిల్లాలో క్యాన్సర్ మహమ్మారి పెరిగిపోతోంది. నా వద్ద సరైన సేవలు లేకపోవడంతో.. ఉమ్మడి జిల్లాలోని సుమారు 90 వేల మంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. కరీంనగర్‌లో పేదోడి గుండెపోటుతో నా గుండె పగులుతోంది. నా వద్ద చికిత్స లేక ఉన్నతాసుపత్రికి తీసుకెళ్లడానికి సమయం లేక ప్రైవేట్‌లో చేరి గుండెలు కరిగేలా రోదిస్తున్నారు.
ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉండటం నాకే 'వ్యర్థ'మనిపిస్తోంది. బిల్లులు చెల్లించాలనే సరికి చిన్న ఆసుపత్రిలా 'లెక్క'లు కడుతున్నారు. వారికి పెద్ద ఆసుపత్రిలా కనిపించడం లేదా? అని అనిపిస్తుంది. 542 పడకల ఆసుపత్రికి 330 పడకలకు మాత్రమే పారిశుద్ధ్య బిల్లు చెల్లిస్తున్నారంటే అధికారులకు నాపై ఎంత అ'శ్రద్ధ' పెట్టారో అర్థమవుతోంది.
వైద్యుల చేతిలో పరికరాలు లేకపోవడంతో వారు శస్త్రచికిత్స గదిలో చెందుతున్న ఆవేదన చూసి నాకెప్పుడు 'శస్త్రచికిత్స' చేస్తారో అని మదనపడిన రోజులెన్నో. నా వద్ద సేవలందక మా పెద్దాసుపత్రి వరంగల్‌కు పంపుదామంటే అంబులెన్సులు లేవు. మరమ్మతుల్లేక మూలన పడి ఉన్నాయి.నాలోని యంత్రాలు సరిగా పనిచేయడం లేదు. ఎక్స్‌రేలకు ఫిల్మ్‌లు, పరీక్షలకు ప్రింటెడ్ నివేదికలు ఇవ్వడానికి డబ్బులు లేకపోవడంతో ఎంత పనిచేసిన నాకు గుర్తింపు రావడంలేదనే ఆవేదన మిగిలింది. జిల్లాలో పేరుమోసిన ప్రజాప్రతినిధులున్నా..నన్ను పట్టించుకునేవారు లేరు.ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కున ఉన్న నాకు దయచేసి కిడ్నీ, గుండె, న్యూరో, క్యాన్సర్, వైద్యులతోపాటు ఎంఆర్ఐ, సీటి, అల్ట్రామిన్, ఎక్సరే, యంత్రాలు, శస్త్రచికిత్స గది 24 గంటలు పనిచేసేలా నిధులు మంజూరు చేయగలరని కోరుకుంటున్నాను.

# పొదుపు మరిస్తే గడ్డుకాలమే!



కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలో 1,218 గ్రామ పంచాయతీలు రెండు నగరపాలక సంస్థలు, 14 పురపాలికల్లో వచ్చే వేసవి నాటికి తాగునీటి కష్టాలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత కనిపిస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జనవరి నెలలోనే పలు గ్రామాల్లో తాగునీటి సరఫరాకు అవరోధాలు ఎదురవుతున్నాయి. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, మధ్యమానేరు, దిగువ మానేరు జలాశయాలతోపాటు పలు చెరువుల్లోని నీటిని శుద్ధి చేసి మిషన్ భగీరథ ద్వారా ఇళ్లకు నీళ్లందించే ప్రక్రియలో అక్కడక్కడ ఇబ్బందులున్నాయి. ముఖ్యంగా జగిత్యాల జిల్లాలోని 5 బల్దియాలకు, 346 గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా నీళ్లందే విషయంలో లోపాలు పూర్తిగా తొలగిపోలేదు. పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లోనూ 20శాతం గ్రామాలకు నీరందించే పథకాలదీ ఇదే పరిస్థితి. ఇంట్రా పైప్‌లైన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం శాపంగా మారింది. ఇప్పటి నుంచే అధికారులు దృష్టి పెడితే వేసవిలో తాగు నీటి ఎద్దడి దరిచేరదు.

**సాగు అవసరాలకు వినియోగం**


ప్రధాన జలాశయాల్లోని నీటిని సాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారు. ఎల్‌ఎండీ నుంచి ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల్లోని పంటలకు కాకతీయ కాలువ ద్వారా నిత్యం 4,229 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో గతేడాదితో పోలిస్తే ఈసారి ఇక్కడి జలాశయంలో నీటి మట్టం కొంత తగ్గింది. ఇదే తరహాలో వరి పంట కోసం ఏప్రిల్‌లోనూ చివరి తడికి నీళ్లు ఇవ్వాల్సి ఉంటుంది. జాగ్రత్తగా నీటిని వినియోగించకుంటే వేసవిలో కరీంనగర్ కార్పొరేషన్‌లో తాగునీటి అవసరాలకు తిప్పలు పడాల్సి వస్తుంది. ఎల్లంపల్లి, మధ్యమానేరు జలాశయాలలో నీటి నిల్వ బాగున్నా.. పొదుపుగా వినియోగిస్తేనే వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. గతేడాదితో పోలిస్తే జగిత్యాల జిల్లాలో 15 శాతం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 6 శాతం లోటు వర్షపాతం నమోదైంది. కురిసిన వర్షాలు, నిల్వ ఉన్న నీళ్లను ప్రణాళిక ప్రకారం ఉపయోగించుకోకుంటే తీరని నష్టం, కష్టం వాటిల్లే వీలుంది.

**లోపాలు సవరిస్తేనే!**

మిషన్ భగీరథ ద్వారా నాలుగు జిల్లాల్లో రూ.3,300 కోట్లు వెచ్చించి 1,351 నీటి ట్యాంకులను నిర్మించారు. 7,692 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. పంచాయతీలతోపాటు మరో 1,126 అనుబంధ గ్రామాలకు తాగునీటి సరఫరాను మెరుగుపర్చారు. అయితే 12 నియోజకవర్గాల పరిధిలో ఆరు గ్రిడ్‌ల ద్వారా శుద్ధ జలాలను అందించే విషయంలో ఇంకా లోపాలున్నాయి. ముఖ్యంగా 18,970 మోటార్లను ఏర్పాటు చేయగా వీటిలో నిత్యం సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. రహదారులు, వాగులు, రైల్వే లైన్ల వద్ద భూగర్భ పైప్‌లైన్లలో లీకేజీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కొన్ని నీటి సంప్‌లకు నీరు అందని దుస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఇలాంటి లోపాలను సవరించి తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. 'వచ్చే వేసవిలో తాగునీటికి ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా తగు శ్రద్ధ వహించాలి. ఇప్పటి నుంచే నీటి వనరుల్లో ఉన్న జలాలను సంరక్షించండి. లోపాలను సవరించుకోండి' ఇటీవల మంత్రి సీతక్క పంచాయతీ

# చెత్త శుద్ధీకరణపై ఆశలు

కరీంనగర్ : నగరంలోని డంపింగ్‌యార్డు గుట్టలుగా పేరుకుపోతుంది. నిత్యం టన్నుల కొద్ది వస్తున్న చెత్త ఎక్కడ వేయాలనే ప్రశ్నకు జవాబే లేదు. రెండేళ్ల కిందట ప్రారంభించిన బయోమైనింగ్ పూర్తి స్థాయి పరిష్కారానికి దారి చూపించలేక పోయింది. 'కరీంనగర్ నగర ప్రజల ప్రధాన సమస్య డంపింగ్‌యార్డు అని అర్థమైంది. దీనిని పరిష్కరించేందుకు సాంకేతికతతోపాటు నిధులు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.' అని ఇటీవల నగరానికి వచ్చిన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ అన్నారు. కేంద్ర మంత్రి హామీతోనైనా సమస్య పరిష్కారం కావాలని నగరవాసులు కోరుకుంటున్నారు.చెత్త నిండిపోవడంతో డంపింగ్‌యార్డు నుంచి మంటలు రావడం, పొగ వ్యాపించడంతో పరిసరాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. కోతిరాంపూర్, అలుగునూర్, రామగుండం బైపాస్‌రోడ్డు, పోచమ్మవాడ, అలకాపురికాలనీ, కమాన్ ప్రాంతం వరకు వాసన వస్తోంది. దీనిని ఇక్కడి నుంచి తరలించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. అయితే చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తుండటంతో అధికారులు సైతం ఏం చేయలేని పరిస్థితిలో ఉన్నారు.స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా 31 నెలల కిందట రూ.16.50 కోట్లతో బయోమైనింగ్ ప్రారంభించారు. ఏడాదిలోగా డంపింగ్‌యార్డు పూర్తిగా శుభ్రం చేసి ఇవ్వాల్సి ఉండగా ప్రక్రియ నిలిచిపోయింది. పలుమార్లు నోటీసులు ఇచ్చినా పనుల పురోగతి మాత్రం కనిపించడంలేదు. శుద్ధి చేసిన చెత్త వేసేందుకు కూడా స్థలం లేకపోవడం, రోజు వారీ వ్యర్థాలను అందులోనే కలిపి వేయడంతో శుద్ధీకరణ ప్రశ్నార్థకంగా మారింది.ఇతర రాష్ట్రాల్లో చెత్తను శుద్ధి చేసి తరలిస్తున్నట్లుగానే ఇక్కడ కూడా సాంకేతికను జోడించి వ్యర్థాలను తరలించే అవకాశముంది.



ప్రస్తుతమున్న నిల్వలతోపాటు నగర వీధుల్లోంచి చెత్తను ఎప్పటికప్పుడు శుద్ధీ చేసేలా ప్రణాళికలు చేయనున్నట్లు సమాచారం. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కూడా ఈ డంపింగ్‌యార్డు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనే లక్ష్యంతోనే కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.తడి, పొడి చెత్తను వేర్వేరు చేయాలి. తడి చెత్తను సేంద్రియ ఎరువు తయారీకి ఉపయోగించవచ్చు. మరోవైపు హుజూరాబాద్‌లో పొడి చెత్తతో విద్యుత్తు తయారు చేసే ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన కూడా చేశారు. ఆ ప్రక్రియ పూర్తయితే డంపింగ్ యార్డులోని చెత్త నిల్వలు తగ్గుముఖం పడతాయని అధికారులు భావిస్తున్నారు. కరీంనగర్‌లోని డంపింగ్‌యార్డు
డివిజన్లు : 60
నగర విస్తీర్ణం : 65.33 చ.కిమీ
ఇళ్ల సంఖ్య : 89 వేలు
చెత్త ఉత్పత్తి : 140 మెట్రిక్ టన్నులు(రోజుకు)
పేరుకుపోయిన వ్యర్థాలు : 3 లక్షల టన్నులు
శుద్ధి చేసింది : 80 వేల మెట్రిక్ టన్నులు

# సహకార సంఘాలకు ప్రత్యేక పాలన తప్పదా?

కరీంనగర్ : సహకార సంఘ పాలకవర్గాల పదవీకాలం పది రోజుల్లో ముగియనుంది. కొత్త పాలకవర్గాల ఏర్పాటుపై ప్రభుత్వం ఇప్పటివరకు నిర్ణయానికి రాలేదు. దీంతో వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఆరు నెలల ముందుగానే ఎన్నికల ప్రక్రియ మొదలవ్వాల్సి ఉండగా.. ఇప్పటివరకు ఊసేలేదు. 2020 ఫిబ్రవరి 13న ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. తర్వాత రోజు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, జిల్లా మార్కెటింగ్ సొసైటీల పాలకవర్గాల సభ్యులను ఎన్నుకున్నారు. వారి పదవీకాలం సైతం ఈనెల 14న ముగియనుంది.

**రెండు నుంచి మూడు సంఘాలకు..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2-3 సంఘాలకు ఒక మండల స్థాయి అధికారిని నియమించే అవకాశాలు ఉన్నాయి. కొత్త జిల్లాల స్థాయిలో సహకార బ్యాంకుల విస్తరణ ఉండకపోవచ్చని తెలుస్తుంది. ఉమ్మడి జిల్లా పరిధిలోనే జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఉంది. కొత్త జిల్లాలు ఏర్పడినపుడు ఆయా జిల్లా స్థాయిలో సహకార బ్యాంకులను విస్తరించాలని ప్రభుత్వం సూచించింది.

**బ్యాంకుల విస్తరణ ఏమైనట్టు..**

జిల్లాలో సహకార బ్యాంకులు విస్తరించాలనే ప్రతిపాదనలు పంపినా..




నేటికి స్పందన రాలేదని తెలుస్తోంది. రైతులు దీర్ఘకాలిక, పారిశ్రామిక రుణాలు పొందే విషయంలో ఉమ్మడి జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. ఈ క్రమంలో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విస్తరించాలని రైతులు అభిప్రాయపడుతున్నారు.

**కొత్తగా 39 సంఘాలు?**

ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలో 135 సహకార సంఘాలకు తోడుగా మరో 39 సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని ఆయా జిల్లాల సహకార అధికారుల నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. వీటిని ఏర్పాటు చేసిన తర్వాతే ఎన్నికలు జరగవచ్చనే ప్రచారం జరుగుతోంది.

**ఆదేశాలు రావాల్సి ఉంది**

సహకార సంఘ పాలకవర్గాల పదవీకాలం పది రోజుల్లో ముగియనుంది. వారి స్థానంలో ప్రత్యేకాధికారులను నియమించే విషయంలో ఆదేశాలు రాలేదు. అలాగే కొత్త సంఘాల ఏర్పాటు విషయంలోనూ ప్రభుత్వం ఎలాంటి మార్గదర్శకాలు చేయలేదు. ఎన్నికల విషయంలో ఆదేశాలు వస్తేనే ప్రక్రియ ప్రారంభిస్తాం.రామానుజాచార్యులు, జిల్లా సహకార అధికారి

# ప'రేషన్..'!

పెద్దపల్లి : జిల్లాలో కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లోని రేషన్ సరకులకు దూర భారం తప్పడం లేదు. కిలోమీటర్లు కాలినడకన వెళ్లి సరకులు తీసుకొచ్చే పరిస్థితి నెలకొంది. అయిదేళ్లుగా కొత్త చౌకధరల దుకాణాల ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైంది. ప్రతి నెల సమీపంలోని గ్రామాల రేషన్ దుకాణాలకు వెళ్లాల్సి వస్తోంది. పంచాయతీ సభలు, సమావేశాల్లో విన్నవించిన ప్రజల విజ్ఞప్తులు బుట్టదాఖలవుతున్నాయి. పూర్వ పంచాయతీల్లో నుంచి సరుకులు తీసుకురావడంతో సక్రమంగా అందడంలేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రేషన్ దుకాణాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

**జిల్లాలో ఇలా..**

14 మండలాల్లో 413 రేషన్ దుకాణాలున్నాయి. జిల్లాలో ఆహారభద్రత 2,07,231, అంత్యోదయ 12,290, అన్నపూర్ణ 156 మొత్తం 2,19,677 కార్డులున్నాయి. వీటిలో 6,25,090 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. అంత్యోదయ కార్డుకు నెలకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డుకు 10 కిలోల చొప్పున ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో ప్రతి నెల 322.31 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం అవుతాయి.

**ప్రతిపాదనలకు మోక్షం కరవు**

జిల్లాలో మొత్తం 267 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 65 కొత్త పంచాయతీలుగా ఏర్పాటయ్యాయి. వీటిల్లో ప్రతి నెల రేషన్ సరకులు తెచ్చుకునేందుకు ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కొత్త పంచాయతీల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించారు కానీ.. అయిదేళ్లు దాటినా ఆచరణ సాధ్యం కావడం లేదు. కొన్ని గ్రామ పంచాయతీల్లో తక్కువ రేషన్‌కార్డులు ఉన్నాయని.. ఇలాంటి చోట్ల రేషన్ దుకాణాల మంజూరు సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. అయితే రేషన్ దుకాణాలు లేని ఊళ్లలోకి డీలర్లు సరకులు తీసుకెళ్లి పంపిణీ చేయాలని గతంలో ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు ఎవరు ఎక్కడ పంపిణీ చేయాల్సి ఉంటుందో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు రేషన్ డీలర్లకు దిశానిర్దేశం చేశారు. అయితే క్షేత్రస్థాయిలో ఆశించిన మేర పర్యవేక్షణ కొరవడటం, డీలర్లు ప్రాథమిక ఆదేశాలను విస్మరించడంతో కొత్త గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.
ఇది పెద్దపల్లి మండలం బొంపెల్లి పంచాయతీ పరిధిలోని మేరపల్లి. ఇక్కడ రేషన్ దుకాణం మంజూరు చేయాలని గ్రామస్థులు ప్రజావాణిలో కోరారు. స్థానికంగా చౌకదారుల దుకాణం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
ఇవీ సమస్యలు
పూర్వ పంచాయతీ దూరం ఉండటంతో సరకులు తీసుకోవడం కష్టసాధ్యమవుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు.
వినియోగదారులకు ఎప్పుడు పంపిణీ చేస్తారో సమాచారం కొరవడుతోంది.
డీలర్ల వద్దకు సమయానికి వెళ్లకపోవడంతో సరకులు కోల్పోవాల్సి వస్తోంది. పేదలు, దివ్యాంగులు, వృద్ధులు కష్టాలు పడుతున్నారు.
సరకులు తీసుకోవడం ఇబ్బందిదాడి సంతోష్, మేరపల్లి, పెద్దపల్లి మండలం
మా గ్రామంలో రేషన్ దుకాణం లేకపోవడతో బొంపెల్లికి వెళ్లి తీసుకొస్తున్నాం. చాలాసార్లు అధికారులకు ఫిర్యాదు చేశాం. సమాచార లోపంతో పేదలకు నిత్యావసర సరకులు అందడం లేదు.

# వైకాపా హయాంలో పడక.. కూటమి పాలనలో చకచకా!



ఎలమంచిలి : జగన్ పాలనలో పడకేసిన పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు, కూటమి రాకతో పునఃప్రారంభమయ్యాయి. గత అయిదేళ్లలో కాలువలో ఒక్క తట్ట మట్టి కూడా తీయలేదు. కూటమి ప్రభుత్వ హయాంలో పోలవరం కాలువ పనులకు కొత్తగా టెండర్లు పిలవడంతోపాటు బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు చేయడంతో పూడికతీత పనులు చేపట్టారు. ఎలమంచిలి మండలంలో పనులు ఊపందుకున్నాయి. పోలవరం కాలువ ద్వారా 108 టీఎంసీల నీరు ఉమ్మడి విశాఖ జిల్లాకు వస్తుంది. ఇందులో 24 టీఎంసీల నీరు పరిశ్రమలకు కేటాయించి మిగిలిన 84 టీఎంసీల నీరు సాగునీరుగా అందించాలన్న ఆశయంతో దీన్ని రూపకల్పన చేశారు. మిగులు జలాలను ఉత్తరాంధ్రాకు తరలించాలన్నది ప్రణాళిక. గత ప్రభుత్వం పోలవరం పనులను గాలికి వదిలేసింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో పరిశ్రమలతో పాటు రైతులకు సాగునీరు అందించడానికి రూ. 677 కోట్ల అంచనాతో 84 కిలోమీటర్ల పొడవైన పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులకు 2005లో భూమి పూజ చేశారు. భూసేకరణ పూర్తి చేసి ప్రధాన కాలువను 6, 7, 8 ప్యాకేజీల కింద అప్పగించారు. ఎలమంచిలి కేంద్రంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

**6 వ ప్యాకేజీ**

పాయకరావుపేట నుంచి దార్లపూడి వరకూ ఆరో ప్యాకేజీ కింద రూ.196 కోట్ల వ్యయంతో 25 కిలోమీటర్ల పొడవునా ఎడమ ప్రధాన కాలువను తవ్వారు. ఇప్పుడు దీన్ని 6, 6ఎగా విభజించారు. మట్టి పనులు పూర్తయ్యాయి. మధ్యలో వంతెనలు, కాంక్రీట్ లైనింగ్ పనులు చాలా చోట్ల నిలిచిపోయాయి. తాండవ నదిపై నిర్మిస్తున్న కాలువ పనులు పూర్తికాలేదు. కొన్ని చోట్ల కాలువ ఎగువ గ్రామాలకు వంతెనలు నిర్మించినా అప్రోచ్ రోడ్లు వేయలేదు. కొండలపై నుంచి కొట్టుకువచ్చిన మట్టి కాలువలో మేటలు వేసింది. ఇప్పుడు పొక్లెయిన్ల సాయంతో ఈ పూడికలు తొలగిస్తున్నారు.

**7 వ ప్యాకేజీ**

దార్లపూడి నుంచి తాళ్లపాలెం వరకూ 7వ ప్యాకేజీ కింద రూ. 330 కోట్లతో 26 కిలోమీటర్ల పొడవున కాలువ పనులు ప్రారంభించారు. గత తెదేపా హయాంలోనే కాలువ తవ్వకం పనులు 90 శాతం పూర్తయ్యాయి. వరాహనదిపై సిమెంట్ కాలువ పనులు పూర్తి కాలేదు. పోలవరం కాలువకు అడ్డంగా ప్రవహిస్తున్న కొండగెడ్డల నుంచి నీరు నేరుగా కిందికి పోవడానికి నిర్మించిన కాలువల పనులు మధ్యలో నిలిచిపోయాయి. కాలువల చుట్టూ వేసిన కాంక్రీట్ లైనింగ్ దెబ్బతింది. ఈ పగుళ్లలోంచి తుప్పలు మొలిచాయి. ఇవన్నీ తొలగించి సరి చేస్తున్నారు.

**8వ ప్యాకేజీ**

తాళ్లపాలెం నుంచి కణితి రిజర్వాయర్ వరకూ 8వ ప్యాకేజీ కింద రూ. 171 కోట్ల వ్యయంతో 33 కిలోమీటర్ల పొడవునా కాలువను వెడల్పు చేసి పోలవరం కాలువకు అనుసంధానం చేశారు. దీన్ని ఇప్పుడు 8, 8ఎగా విభజించి నిధులు విడుదల చేశారు. ఏలేరు కాలువకు రెండు వైపులా మట్టి తొలగించి కాలువను వెడల్పు చేశారు. తవ్విన మట్టి తిరిగి కాలువలోకి చేరింది. ఈ కారణంగా కాలువ రూపే మారిపోయింది. ఈ పనులు ఎలా చేయాలి అన్నదానిపై అధికారులు ప్రణాళిక తయారు చేస్తున్నారు.

**బడ్జెట్‌లో రూ. 1741 కోట్లు**

పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనులకు కూటమి ప్రభుత్వం రూ.1741 కోట్లు కేటాయించింది. ఇప్పటికే అసంపూర్తి పనులకు రూ.398 కోట్లతో టెండర్లు పిలిచారు. బడ్జెట్‌లో భారీ కేటాయింపుల వల్ల చేసిన పనులకు వెంటనే చెల్లింపులు జరుగుతాయి. ఫలితంగా పనుల్లో జాప్యం ఉండదని ప్రాజెక్ట్ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

# పెద్దమంత్రిపై ఎనలేని ప్రేమ

చిత్తూరు : ఆయన ఇప్పుడు మంత్రి కాదు.. ప్రతిపక్ష పార్టీలో ఓ నాయకుడు మాత్రమే.. గతంలో పలు కీలక శాఖలు పర్యవేక్షించిన సమయాన ఎస్పీడీసీఎల్ పరిధిలో భారీగా అక్రమాలకు తెరలేచింది.. ఆయన అండతో కొందరు అవినీతి అధికారులు ఇష్టారాజ్యంగా చెలరేగిపోయారు.. దొడ్డిదారిన ఇచ్చిన సిఫార్సులు గుడ్డిగా ఆమోదించి తమ అనుచరులను నియమించారు.. ఈ అక్రమాలపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించి నెలలు గడుస్తున్నా అడుగు ముందుకు పడకపోవడం ఇప్పటికీ ఆ'పెద్ద' మంత్రిపై ఉన్న ప్రేమను తెలియజేస్తోందని కొందరు ఎస్పీడీసీఎల్ అధికారులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఐదేళ్ల వైకాపా పాలనలో విద్యుత్తు శాఖ అవినీతిలో కూరుకుపోయింది. నియంత్రికలు, అనుబంధ పరికరాల కొనుగోళ్లలో, కాలిపోయిన, తుప్పు పట్టిన కమ్మీల నుంచి రూ.వేల కోట్లు దండుకున్నారు. అవినీతి అధికారులను అందలం ఎక్కించారు. మాట వినని వారిని దూరంగా పంపేశారు. ఈ కోవలోనే షిఫ్ట్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల నియామకాలు ఇష్టానుసారంగా చేపట్టారు.



విద్యార్హత లేకున్నా నాటి మంత్రి సిఫార్సు లేఖలకు 'జీ హుజూర్' అన్నారు. ఆయన, ఆయన అనుచరులు చెప్పిన వారినే నియమించారు. ఎస్పీడీసీఎల్ పరిధిలోని ఉపకేంద్రాల్లో ఒప్పంద పద్ధతిలో 2,100 మందిని నియమించారు. ఇందులో అగ్రభాగం తిరుపతి సర్కిల్‌లోనే 1,300-1,500 మందిని నియమించినట్లు సమాచారం. విద్యార్హత లేకున్నా అప్పట్లో మంత్రి సూచించిన వైకాపాకు అంటకాగిన అభ్యర్థులను నియమించారనే ఆరోపణలున్నాయి. పుంగనూరు నియోజకవర్గంలోనే వీరి సంఖ్య అధికం.

**యాంటీ పవర్ తెఫ్ట్ స్క్వాడ్ ఎక్కడా..!**


గతేడాది నవంబరులో ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులు స్పందించి దర్యాప్తు బాధ్యతను యాంటీ పవర్ తెఫ్ట్ స్క్వాడ్(ఏపీటీఎస్) విభాగానికి అప్పగించారు. ప్రస్తుత దర్యాప్తు తీరు ప్రభుత్వ ఆదేశాలకు అడుగడుగునా తూట్లు పొడుస్తోంది. ఐదు నెలలైనా కనీస పురోగతి లేదు. ఉద్యోగంలో చేరినవారి విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను ఈఈల నుంచి సేకరించడానికే నాలుగు నెలలు పడితే ఇక విచారణ ఎప్పుడు.. వాస్తవాలు తేలేది ఎప్పుడు.. అక్రమార్కులపై చర్యలు ఎప్పుడనేది ప్రశ్నార్థకంగా మారింది. 'పెద్ద' మంత్రితో ఉన్న పరిచయాలే దర్యాప్తును ముందుకు సాగనీయడం లేదనే అంతర్గత విమర్శలు, ఆరోపణలున్న నేపథ్యంలో రాష్ట్రస్థాయి అధికారులు దృష్టిసారిస్తే తప్ప పరిస్థితిలో మార్పు కనిపించేలా లేదు.

# లాభాలంటూ ఊరించి.. ఉన్నదంతా ఊడ్చేసి

తిరుపతి : ట్రేడింగ్ మోసాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. తక్కువ సొమ్ముతో ఎక్కువ లాభాలు పొందొచ్చని ఊరిస్తూ పంపే వీడియోలు, సందేశాలను నమ్మి మోసపోతున్నారు. పక్కవారికే కాదు.. ఇంట్లో ఇల్లాలికి సైతం చెప్పకుండా పెట్టుబడులుగా పెట్టి ఉన్నది కాస్త పోగొట్టుకుంటున్నారు.

**ఇటీవల ఘటనలు పరిశీలిస్తే..**

తిరుపతికి చెందిన స్మీనియర్ కన్సల్టెంట్ వాట్సప్‌నకు వచ్చిన నకిలీ ట్రేడింగ్ యాప్ లింకులు నమ్మి ట్రేడింగ్ చేశారు. రూ.7.20 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. లాభంతో కలిపి చూపిన రూ.11.42 లక్షలు విత్‌డ్రా చేయడానికి వీలుకాక పోలీసులను ఆశ్రయించారు.



అవిలాలకు చెందిన లాజిస్టిక్ మేనేజర్ వాట్సప్‌నకు ఆన్‌లైన్ లింకులు పంపి రూ.9 లక్షల వరకు పెట్టుబడి పెట్టించారు. వాలెట్లో ఆదాయంతో కలిపి రూ.19 లక్షలు చూపి మోసగించారు.ఎస్వీయూ ఆచార్యుడి ఫోన్ నంబరును వాట్సప్ గ్రూప్‌లోకి చేర్చిన మోసగాళ్లు నకిలీ ట్రేడింగ్ యాప్‌లు పంపి వివిధ ఖాతాల నుంచి రూ.24.66 లక్షలు పెట్టుబడిగా పెట్టించి పోర్ట్‌ఫోలియో విలువ ఏకంగా రూ.2.14 కోట్లు చూపి దగా చేయడంతో ఆయన ఇటీవల పోలీసులను ఆశ్రయించారు.తిరుపతికి చెందిన ఓ వైద్యుడికి మ్యాట్రిమోనీ వేదికగా మహిళ పరిచయమైంది. సంపాదన రెట్టింపు కావడానికి షేర్ మార్కెట్ ఒక్కటే మార్గమని నమ్మించింది. మొదట కొంత పెట్టుబడి పెట్టించి రూ.7 లక్షలు డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించింది. నమ్మకం పెరిగి రూ.84 లక్షలు పెట్టుబడి పెట్టగా రూ.కోట్లలో లాభం చూపారు. దానిని డ్రా చేసుకునేందుకు యత్నించగా అసలురంగు బయటపడి పోలీసులను ఆశ్రయించారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో విద్యావంతులే ఎక్కువగా చిక్కుకుంటున్నారు. ఊరికే డబ్బులు వస్తాయని నమ్మే అమాయకులం కాదు.. అందుకే ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టి సంపాదిస్తామనే వీరు.. చివరకు ట్రేడింగ్ ఖాతాలు నకిలీవా? కాదా? అని తెలుసుకునే సామర్థ్యం లేక.. నష్టపోయామని తెలుసుకున్నా ఎక్కడ పరువుపోతుందోనని పోలీసులను సంప్రదించలేక సతమతమవుతున్నారు.

**వెంటనే పోలీసులను సంప్రదించండి**

తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చనే సందేశాలు, సమాచారాలపై అప్రమత్తంగా ఉండాలి. రిజిస్టర్ కాని సంస్థలు క్షేమం కాదు. బాధితులు 1930 నెంబరుకు ఫోన్ చేయాలి. సమీప పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలి. వినోద్‌కుమార్, సైబర్ క్రైమ్ సీఐ

జిల్లాలో 2024లో 248 సైబర్ కేసులు నమోదు కాగా.. ఏకంగా రూ.12.89 కోట్లను సైబర్ మోసగాళ్లు కాజేశారు. అంతకుముందు ఏడాదితో పోల్చితే 430 శాతం దోపిడీ పెరిగింది.

# ఆలోచనలు అంకురిస్తున్నాయ్..




విశాఖపట్నం: పోటీ ప్రపంచంలో ఉద్యోగాల కంటే సొంతంగా కంపెనీలు స్థాపించడంపైనే యువత దృష్టి సారిస్తున్నారు. ఇదే సమయంలో అంకుర సంస్థల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూత అందిస్తున్నాయి. ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ, విశాఖలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మెడ్‌టెక్ జోన్ తదితర సంస్థలు ఇందుకు సహకరిస్తున్నాయి. వైద్య రంగంలో ఆవిష్కరణలకు..అత్యాధునిక సాంకేతికతను వినియోగించి మెడ్‌టెక్ జోన్‌లో వైద్య రంగంలో అవసరమైన వినూత్న ఆవిష్కరణలు చేపడుతున్నారు. అక్కడి బయోవ్యాలీ ఇంక్యుబేషన్ కౌన్సిల్ ద్వారా ప్రయోగశాల నుంచి ఉత్పత్తులు మార్కెట్‌లోకి తీసుకెళ్లే వరకు సహకరిస్తున్నారు. బయోటెక్నాలజీ, మెడికల్ టెక్నాలజీకి సంబంధించిన హబ్ ఇది. క్రమం తప్పకుండా హ్యాకథాన్స్ నిర్వహిస్తూ.. వినూత్న ఆలోచనలున్న వారిని ఆహ్వానిస్తున్నారు. వాటిపై మరింత పరిశోధన, పరికరాల ఉత్పత్తి ఇక్కడే చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఆ ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మెడ్‌టెక్ జోన్ భరిస్తుంది. ఇక్కడ త్రీడీ బయో ప్రింటింగ్, రీజెనరేటివ్ మెడికల్ ఫెసిలిటీ, స్టెమ్ సెల్ కల్చర్ ఫెసిలిటీ, అత్యాధునిక పరికరాలతో కూడిన ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాలకు %www.biovalleyamtz.in% వెబ్‌సైట్‌లో సంప్రదించొచ్చు.

**ఐవోటీ, ఏఐ డొమైన్లపై..**

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, నాస్కామ్ సంయుక్తంగా ఏయూ ప్రాంగణంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేశారు. ఐవోటీ, ఏఐ ఆధారిత డొమైన్లపై పనిచేస్తున్న అంకుర సంస్థలను అభివృద్ధి చేస్తున్నారు. ఆయా సంస్థలకు మార్గనిర్దేశం చేయడంతోపాటు పెట్టుబడులు ఆకర్షించేందుకు సహకరిస్తున్నారు. ఐవోటీ ప్రయోగశాల, పని ప్రదేశం, అన్ని రకాల సహకారం అందిస్తుంటారు. విపణిలోకి వచ్చేందుకు సిద్ధమైన సంస్థలను పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలతో అనుసంధానం చేస్తున్నారు. 2021 నుంచి ఇప్పటివరకు 182 అంకురాలు నమోదుకాగా 1800 మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. వాటి ద్వారా రాష్ట్ర ప్రభుత్వంలో వైద్యారోగ్యం, పాఠశాల విద్య, మార్క్‌ఫెడ్, ఏపీఎస్ఆర్టీసీలో వివిధ సమస్యలకు పరిష్కారాలు చూపించారు. వినూత్న ఆలోచనలున్నవారు %andhrapradesh.coeiot.com% వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చు.

**ఐఐఎంలో..**ఐఐఎం విశాఖలోని వాణిరావు మెమోరియల్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో 2018 నుంచి వ్యాపార వ్యూహాలు, నిర్వహణ, మార్కెటింగ్, ఆర్థిక వ్యవహారాలు.. ఇలా అన్ని అంశాల్లోనూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు 180కు పైగా సంస్థలకు మార్గనిర్దేశం చేశారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వినూత్న ఆలోచనలతో వచ్చిన అభ్యర్థులను ఎంపిక చేసి, శిక్షణ అందిస్తున్నారు. పనితీరు ఆధారంగా తర్వాతి దశకు ఎంపిక చేస్తారు. అంకురాలు ఏర్పాటైన మొదట్లో సంస్థల కార్యకలాపాలకు 6 నెలల నుంచి ఏడాది వరకు ఆ ప్రాంగణాన్ని వినియోగించుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన టైడ్, నిధి ఏక్సలరేటర్, ఎంఎస్ఎంఈ, స్టార్టప్ ఇండియా తదితర కార్యక్రమాలను ఇక్కడ అమలు చేస్తున్నారు. సహకారం అవసరమైన అభ్యర్థులు iimvfield.com% వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

# ఐటీ ఉద్యోగులా.. సదుపాయాలు కావాలా

కర్నూలు : 'వర్క్ ఫ్రం హోం' చేస్తున్నారా.. మీకున్న సమస్యలేంటి.. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం కోరుకుంటున్నారు.. తదితర అంశాలపై సచివాలయ ఉద్యోగులు సర్వే చేయనున్నారు. ఇప్పటికే నంద్యాల జిల్లాలో ప్రారంభించగా కర్నూలులో నుంచి ఇంటింటి సర్వే చేయనున్నారు. ఐటీ, ఇతర ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ (డబ్ల్యూఎఫ్‌హెచ్) అవకాశాలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సర్వేకు శ్రీకారం చుట్టింది. 'వర్క్ ఫ్రం హోం' విధానాన్ని విస్తృతపరచడానికి 'కూటమి' ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా యువతకు స్వగ్రామంలోనే అన్ని సదుపాయాలు కల్పించాలని భావిస్తోంది.

**ఈనెల 10వ తేదీలోగా పూర్తి**

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల లాగిన్‌లో వర్క్ ఫ్రం హోమ్ సర్వేను జీఎస్‌డబ్ల్యూఎస్ ఎంప్లాయీస్ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశాలొచ్చాయి. ఉద్యోగుల లాగిన్ ఐడీ ఎంటర్ చేసి బయోమెట్రిక్ లేదా ముఖ ఆధారితంగా లాగిన్ అవ్వాలి. వర్క్ ఫ్రం హోమ్ సర్వే అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అందులో పలు అంశాలు నమోదు చేయనున్నారు. విద్యార్హతలు కలిగిన వారు ఐటీ, ఐటీఈఎస్/ఇతర అనుబంధ సంస్థల్లో పనిచేయడానికి ఆసక్తితో ఉన్నారా ?, లేదా..? అని తెలుసుకోనున్నారు. వర్క్ ఫ్రం హోం సదుపాయానికి ప్రైవేటు భవనాలు అందుబాటులో ఉంటే..వాటి వివరాలను సేకరిస్తున్నారు. ఈనెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో ఇప్పటివరకు 53,915 కుటుంబాలను సర్వే చేయగా, ఇంటి నుంచి 1,492 మంది పనిచేస్తున్నట్లు గుర్తించారు.

# అల్లికల పాఠాలు.. ఉపాధికి బాటలు

ఆదోని : బాలికల్లో ఆత్మస్థైర్యం నింపుతున్నారు.. భవిష్యత్తులో తమ కాళ్లపై తాము నిలబడేలా స్వయం ఉపాధి కోర్సులు నేర్పుతున్నారు. ఫ్యాషన్ డిజైనింగ్ రంగంలో రాణించేలా అల్లికలు, ఎంబ్రాయిడింగ్.. కుట్లు.. తదితర అంశాల్లో ప్రత్యేకంగా తర్ఫీదు ఇస్తున్నారు. ఈ కోర్సులో శిక్షణ పూర్తయిన తర్వాత బాలికలకు ప్రత్యేక ఒకేషనల్ పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులకు ధ్రువపత్రాలు ప్రదానం చేస్తున్నారు.

**విద్యార్థి దశ నుంచే..** ఆదోని పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(మైనార్టీ)లో సుమారు 240 మంది విద్యార్థినులు 6 నుంచి ఇంటర్మీడియేట్ వరకు చదువుతున్నారు. విద్యార్థినులకు పుస్తకాల్లోని పాఠాలే కాదు.. బతుకు బాటలు వేసేలా తీర్చిదిద్దుతున్నారు. స్వయం ఉపాధికి అవసరమైన ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. పాఠశాల ప్రిన్సిపల్ అంజనీ ఆధ్వర్యంలో ఒకేషనల్ కోర్సు ఉపాధ్యాయినీ బాలరాజేశ్వరి విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. టైలరింగ్, కుట్టు, బుట్టలు అల్లడం, రంగురంగు డిజైన్ల ఫ్లవర్‌వాజ్‌లు తయారు చేయడం, డోర్ కర్టెన్, దుస్తులపై ఎంబ్రాయిడింగ్ వంటి వాటిల్లో విద్యార్థినులను నిష్ణాతులను చేస్తున్నారు. బాలికలు తయారు చేసిన పలు డిజైన్లు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

**సొంత కాళ్లపై నిలబడేలా..** ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన గౌస్, హుసేన్‌బీ రైతు దంపతుల కుమార్తె నస్రీన్ తొమ్మిదో తరగతి చదువుతోం



ది. కష్టపడి చదువుతూనే గత రెండేళ్లుగా స్వయం ఉపాధి కోర్సులో రాణిస్తోంది. బుట్టలు అల్లడం.. డోర్ కర్టెన్ తయారు చేయడం.. కొత్త కొత్త డిజైనింగ్ వస్తువులు చేయడం నేర్చుకుంటున్నా. బాగా చదివి భవిష్యత్తులో మంచి ఉద్యోగం రాకపోయినా బాధపడకుండ ఇప్పుడు నేర్చుకున్న స్వయం ఉపాధి కోర్సుల ద్వారా తన కాళ్లపై తాను నిలబడగలననే నమ్మకం ఉంది. ఈ కోర్సులు బాలికలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెబుతోంది నస్రీన్.

**దుస్తుల కటింగే ప్రధానం**

పెద్దకడబూరు మండలం మేకడోణ గ్రామానికి చెందిన ముల్లా, ఖాజాబాను దంపతుల కుమార్తె ఎం.తరుణ్ తొమ్మిదో తరగతి చదువుతోంది. ఓ వైపు చదువుతూనే మరోవైపు స్వయం ఉపాధి కోర్సులో ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటుంది. ముఖ్యంగా ఫ్యాషన్ డిజైన్ కింద ప్రస్తుత అధునికరంగంలో యువతులు మెచ్చే డ్రస్సులు కటింగ్ చేస్తూ.. మోడ్రన్ డ్రస్సులు కుట్టడంలో శిక్షణ తీసుకుంటున్నా. ఒకటికి రెండు మూడు సార్లు కటింగ్ చేస్తూ నూతన డిజైనింగ్ నేర్చుకుంటున్నా. ఈ కోర్సు చేయడం భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని ధీమా వ్యక్తం చేస్తోంది తరుణ్.

**ఎంబ్రాయిడింగ్‌తో ఉపయోగకరం**

ఆదోని పట్టణానికి చెందిన హుసేన్, రహెమత్‌బీ దంపతుల కుమార్తె షాహీన్ కష్టపడి చదవి ఉన్నత స్థాయికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఓ వైపు చదువుతో పాటు విద్యాలయంలో నేర్పిస్తున్న స్వయం ఉపాధి శిక్షణలో రాణిస్తోంది. ఎంబ్రాయిడింగ్ కోర్సులో సాధన చేస్తూ.. రాణిస్తోంది. మార్కెట్‌లో ఎంబ్రాయిడింగ్ చేసే రవికలు, చీరలకు ప్రత్యేకమైన డిమాండు ఉంది. ఈ కోర్సు పూర్తిచేయడం ఎంతో ఉపయోగం. చదువు ముగిసిన తర్వాత ఉద్యోగం రాకపోయినా ఈ కోర్సుతో స్వయం ఉపాధి పొందగలనన్న నమ్మకం కలుగుతోందని చెబుతోంది షాహీన్.

# వీధుల్లో చెత్త గుట్టలు

ఆదోని : గత ప్రభుత్వం తీసుకొచ్చిన చెత్తపన్ను విధానాన్ని 'కూటమి' ప్రభుత్వం రద్దు చేసింది. పుర సిబ్బందే ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మున్సిపాలిటీ ప్రజారోగ్య విభాగం అధికారులు 'చెత్త'శుద్ధి చూపడం లేదు.. ఇంటింటి చెత్త సేకరణపై దృష్టి సారించలేదు. వీధుల్లో చెత్త కుప్పలు గుట్టలా పేరుకుపోయాయి. దుర్వాసన వెదజల్లుతోంది.. జిల్లాలో పలు మున్సిపాలిటీల్లో బృందం పరిశీలించగా పలు అంశాలు వెలుగులోకొచ్చాయి.కర్నూలు నగరపాలక సంస్థలో 51 ఆటోలు మినహా ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల పురపాలికల్లో చెత్త సేకరణ ఆటోలు నిలిచిపోయాయి. ప్రత్యామ్నాయంగా తోపుడు బండ్ల ద్వారా చెత్త సేకరణ చేయాలని నిర్ణయించినా.. ఆ దిశగా పుర అధికారులు అడుగులేయడం లేదు. నంద్యాలలో 36 ఆటోలను



గుత్తేదారు వెనక్కి తీసుకెళ్లారు. ఆదోని 28, ఎమ్మిగనూరు 16 చెత్త సేకరణ ఆటోలు పురపాలికల్లోనే నిలిపివేశారు. ఆత్మకూరులో ఇంతవరకు సొంతంగా డంపింగ్ యార్డు లేకపోవడం వల్ల, శివారు ప్రాంతాల్లో వేస్తున్నారు. నందికొట్కూరులోని స్థలం నిండిపోయి, ఎక్కడ వేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఏ మున్సిపాలిటీనూ తడి, పొడిచెత్త సెగ్రిగేషన్ పనులు జరగడం లేదు. వీధుల్లో చెత్తబండ్లు రాకపోవంతో కాలనీవాసులు రోడ్లపై పడేస్తున్నారు. ప్రజారోగ్య విభాగంలో కార్మికుల కొరత అధికంగా ఉంది.

పుర జనవాణిచెత్త సేకరణ అంశంపై బృందం పలు మున్సిపాలిటీల్లో వివిధ కాలనీలకు వెళ్లి 300 మందిని సర్వే చేయగా

# ప్రైవేటు దందాకు అడ్డేది..?

విశాఖపట్నం : విశాఖ నగరంలోని ద్వారకా బస్‌స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులను పిలిచి మరీ ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లోకి ఎక్కించుకుంటున్నా... ఆర్టీసీ అధికారులు స్పందించడం లేదు. నిబంధనల మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్, బస్ స్టేషన్, బస్‌స్టాపునకు 250 మీటర్లలోపు ప్రైవేటు వాహనాలు నిలపరాదు. అయినా సరే రోజూ రాత్రి 7 గంటల నుంచి ప్రైవేటు బస్సులను ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం సమీపంలోనే నిలిపి ప్రయాణికులను తమ వైపునకు తిప్పుకొంటున్నారు. ఆయా బస్సుల యాజమాన్యాలు ఏకమై.. ఆర్టీసీ అధికారుల ప్రణాళికలకు దీటుగా పథక రచన చేస్తున్నారు. రాజమహేంద్రవరం, విజయవాడ, హైదరాబాద్, కర్నూలు, కడప... ఇలా అన్ని ప్రాంతాలకు బస్సులు ఏర్పాటు చేస్తున్నారు.

**పట్టించుకోని పోలీసులు**

శిరస్త్రాణం లేకుండా ద్విచక్ర వాహనాలపై వెళ్లే సామాన్యుల వెంటపడి మరీ ఫొటోలు తీస్తున్న ట్రాఫిక్ పోలీసులు... ఆర్టీసీ బస్‌స్టాండ్ వద్ద గంటల తరబడి ప్రైవేటు వాహనాలు నిలుపుతున్నా, పట్టించుకోకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నెలవారీ మామూళ్లు స్టేషన్లకు అందుతుండడంతోనే పోలీసులు ఆయా బస్సుల



జోలికి వెళ్లడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

**పగలూ అంతే..!**

రోజూ రాత్రి పూట ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా బస్సులు నిలుపుతుండగా, ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీకాకుళం, టెక్కలి, పలాస, చాపర, రాయగడ ఇలా అన్ని ప్రాంతాలకు వెళ్లే ప్రైవేటు బస్సుల్ని 222 తగరపువలస బస్‌స్టాపునకు సమీపంలోనే నిలిపి ప్రయాణికులను తీసుకెళ్తున్నారు. ప్రతి బస్సుకు బోర్డు పెట్టి మరీ ప్రయాణికులను ఎక్కించుకుంటున్నా... అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి.. ప్రైవేటు దందాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

# పురాలకు జలధారలు

నంద్యాల : పట్టణీకరణ పెరుగుతోంది.. వివిధ అవసరాల నిమిత్తం పల్లె జనం పట్టణాల్లో నివాసం ఉంటోంది.. ఒక మనిషికి నిత్యం 135 లీటర్ల మేరకు ఇవ్వాలి.. వంద లీటర్లు కూడా ఇవ్వడం లేదు.. అది కూడా 60 శాతం మందికే అందుతోంది. ప్రస్తుత కొరత, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఇంటికి మంచినీళ్లు ఇచ్చేలా 'కూటమి' ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం పల్లెల్లో కొనసాగుతున్న జల్ జీవన్ పథకాన్ని పట్టణాల్లో చేపట్టాలని నిర్ణయించింది. జలాశయాల నుంచి తీసుకొచ్చే అవకాశాలు పరిశీలిస్తోంది. ప్రైవేటు సంస్థలతో డీపీఆర్‌లు తయారు చేయించింది.

**గాజులదిన్నె.. అలగనూరు**

ఎమ్మిగనూరు మున్సిపాల్టీకి గాజులదిన్నె ప్రాజెక్టు ద్వారా నీటిని తీసుకునేందుకు సమాలోచనలు చేస్తున్నారు.

నందికొట్కూరు పురపాలక సంఘానికి అలగనూరు జలాశయం నుంచి నీటిని అందించనున్నారు. ఇప్పటికే అలగనూరు ప్రాజెక్టు మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీనికి సమాంతరంగా పైపులైన్లు వేసి నందికొట్కూరుకు మంచినీటిని అందించనున్నారు.

ఆత్మకూరు మున్సిపాల్టీలో తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొంది. ఇక్కడ ఏళ్లుగా ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నారు. ఇక్కడి ప్రజలకు వెలుగోడు జలాశయం ద్వారా 0.453 టీఎంసీల నీటిని



వినియోగించనున్నారు. ఆరు లక్షల మందికి పైగా జనాభా ఉన్న కర్నూలు నగరపాలకకు ప్రస్తుతం అందిస్తున్న జలాలకంటే మరో 40 ఎంఎల్ నీటిని అదనంగా ఇవ్వాల్సి ఉంది. కర్నూలు నగరానికి 44 కి.మీల దూరంలో ఉన్న గోరుకల్లు ప్రాజెక్టు ద్వారా 0.675 టీఎంసీలు తీసుకోవడానికి వీలుందని ప్రతిపాదించారు.

**గోరుకల్లు జలఆశయం**

రెండు జిల్లాల్లోని పలు మున్సిపాల్టీలకు గోరుకల్లు జలాశయం నుంచి నీటిని తరలించేలా ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే బేతంచెర్ల, డోన్ పురపాలక సంఘాలకు ఇక్కడి నుంచి నీటిని తరలించే పనులు కొనసాగుతున్నాయి. కర్నూలు నగరపాలక, నంద్యాల, ఆళ్లగడ్డ పురపాలక సంఘాలకు జలాశయం ద్వారా మంచినీటిని అందించేలా డీపీఆర్ రూపొందించారు. జిల్లా కేంద్రం నంద్యాలకు ప్రస్తుతం పూటకు 32 ఎంఎల్ నీటిని ఇవ్వాల్సి ఉండగా 25 ఎంఎల్ సరఫరా చేస్తున్నారు. అమృత్ స్కీం ద్వారా వెలుగోడు రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకుని పట్టణ అవసరాలు తీర్చేందుకు పనులు చేపట్టారు. అదనంగా గోరుకల్లు నుంచి కూడా నీటిని అందించేలా ప్రతిపాదనలు చేస్తున్నారు.

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆళ్లగడ్డ మున్సిపాల్టీకి గోరుకల్లు ద్వారా నీటిని తీసుకెళ్లేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

**ఆదోనికి పులికనుమ అండ**

ఆదోని పురపాలక ప్రజలకు పులికనుమ ప్రాజెక్టు నుంచి రోజుకు అవసరమైన 25 ఎంఎల్ నీటిని అందించేందుకు నిర్ణయించారు. ప్రస్తుతం ఇక్కడ రూ.50 కోట్లతో చేపట్టిన అమృత్ పనులు ఇంకా 30 శాతం వరకు చేయాల్సి ఉంది. ఈ పనులతో పాటు ప్రతిపాదిత జల్‌జీవన్ పథకం ద్వారా 0.657 టీఎంసీల నీటిని అందిస్తే మరో 70 వేల మంది ప్రజలకు నీటి కష్టాలు తీరనున్నాయి.

పది పట్టణాలకు నిత్యం ఇవ్వాల్సింది : 400420 (మిలియన్ లీటర్లు)

ప్రస్తుతం సరఫరా చేస్తోంది : 300-325

పుర పాలికలు : 10 జనాభా : 1618 లక్షలు

# కారుణ్యంపై కరుణ చూపేరా!




అనంతపురం : ఆర్టీసీలో కారుణ్య నియామకం కోసం ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. దయతో ఇచ్చే ఉద్యోగానికి కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి. ఎవరైనా ఉద్యోగి మృతి చెందితే ఖాళీలను బట్టి ఆ ఉద్యోగి భార్య, భర్త, కుమారుడు, కుమార్తెలకు సాధారణ నియామకాలతో సంబంధం లేకుండా ఉద్యోగం ఇవ్వాల్సి ఉంటుంది. ఆర్టీసీలో ఖాళీలు, కోరుకున్న పోస్టులు లేకపోవడం తదితర కారణాలతో ఏళ్లుగా కారుణ్య నియామకాలు పొందలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించింది. అధికారులు ఆ దిశగా అడుగులు వేసినా నియామకాల్లో జాప్యం చేస్తున్నారు. కళ్యాణదుర్గం మండలం ఒంటిమిద్ది గ్రామానికి చెందిన నాగభూషణం డ్రైవర్‌గా పని చేస్తూ 2012 మే 14న మృతిచెందారు. ఆయన కుమారుడికి పక్షపాతం ఉండటంతో కూతురు లావణ్యకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామంటూ ఆర్టీసీ యాజమాన్యం హామీ ఇచ్చింది. 28 మే 2022లో ఉద్యోగం కల్పించాల్సి ఉన్నా.. ఇప్పటి దాకా పలు కారణాలతో జాప్యం చేశారు. ఇలాంటి వారు చాలా మంది ఉన్నారు.

**కూటమి ప్రభుత్వ నిర్ణయంతో ఇంకొందరికి అవకాశం**

వాస్తవానికి ఆర్టీసీ ఉద్యోగులు 1 జనవరి 2020 నుంచి ప్రజా రవాణాశాఖ ఉద్యోగులుగా విలీనం అయ్యారు. గతంలో 2016 నుంచి 2019 డిసెంబరు వరకు మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు ఇచ్చేందుకు నిర్ణయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2015 డిసెంబరు 31 ముందు మృతిచెందిన కుటుంబాలకు వర్తింప చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలో 46 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. ఇప్పటికే చాలా మందికి వయస్సు అర్హతకు ప్రతిబంధకంగా ఉండటంతో మినహాయింపు ఇవ్వాలని కొందరు కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వస్తుందని వేచి చూస్తున్నారు.

**ఇతర జిల్లాల్లో చేపట్టినా.. అనంతలో జాప్యం**

ఉమ్మడి జిల్లాలో కారుణ్య నియామకాలకు అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. 41 మంది కండక్టర్లుగా చేరడానికి ఆమోదం తెలిపారు. ఆర్టీసీలో 80 వరకు కండక్టరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొందరు ఎత్తు తక్కువగా ఉండటం, అర్హత లేకపోవడంతో ఎంపిక చేయలేదు. అర్హత ఉండి ఉద్యోగం చేయడానికి అంగీకరించిన వారికి కూడా ఇవ్వడం లేదు. ఉద్యోగాల ఎంపికకు ఇంటర్వ్యూలు, ధ్రువపత్రాలు పరిశీలించి రెండున్నర నెలలు దాటుతున్నా ఇంకా నియామకాలు చేయలేదు. కడప రీజియన్ పరిధిలోని పలు జిల్లాల్లో ఇప్పటికే నియామకాలు చేపట్టారు.

**ఆర్టీసీలో నియామకాలకు తప్పని నిరీక్షణ**

అందనంగా ప్రయోజనం పొందేవారు: 46

వయస్సు ఎక్కువ, తక్కువ, ఇతర కారణాలు: 32

ప్రభుత్వ శాఖల్లో కోరుకున్నది: 25

ఆర్టీసీలో అంగీకరించింది: 41

ఉమ్మడి జిల్లా నుంచి హాజరు: 98 మంది

కారుణ్య నియామకాలకు పరిశీలన: 26-12-2024

# రాయదుర్గం- తుమకూరు రైలు మార్గం పూర్తయ్యేదెన్నడో?



రాయదుర్గం : రాయదుర్గం-తుమకూరు బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ ఎన్‌డీఏ ప్రభుత్వంలోనైనా పూర్తవుతుందా అంటూ ఈ ప్రాంత ప్రజలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రైల్వే బడ్జెట్‌లో ఈ లైనుకు రూ.434 కోట్లు కేటాయించటంతో స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతోంది. 2011 అక్టోబర్ 21వ తేది అప్పటి రైల్వేశాఖా మంత్రి దినేశ్ త్రివేది రాయదుర్గం-తుమకూరు రైలు మార్గానికి భూమి పూజ చేశారు. ఐదేళ్లలో పనులు పూర్తి చేస్తామని అప్పటి రైల్వే అధికారులు పేర్కొన్నారు. అయితే 13 ఏళ్లవుతున్నా 50 శాతం మేర మాత్రమే పనులు పూర్తయినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణలు రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న, జీఎం అరవింద్ శ్రీవాత్సవకు విజ్ఞప్తి చేశారు.

**భూసేకరణలో జాప్యం** ఆరంభంలో భూసేకరణలో జాప్యం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వాల వాటాల విడుదలలో జాప్యం, కేంద్ర ప్రభుత్వం అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించకపోవటం, సర్వే, మార్కింగ్‌లు తదితర పనులు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం దొడ్డహళ్ళి నుంచి కర్ణాటకలోని పావగడ పట్టణాల మధ్య మట్టి పనులు, రైల్వే ట్రాక్ పనులు, స్టేషన్ భవనాల నిర్మాణాలు, వంకలపై కాజ్‌వేల పనులు జరుగుతున్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 36 ఎకరాలు సేకరించాల్సి ఉంది. 130 మంది రైతులకు పరిహారం చెల్లించాల్సి ఉంది.

**పూర్తయితే ప్రయోజనాలెన్నో..**

రాయదుర్గం- తుమకూరు రైల్వే మార్గం పూర్తయితే బెంగళూరుకు తక్కువ సమయంలో చేరుకోవచ్చు. రాయదుర్గం- బెంగళూరు మధ్య మొత్తం 411 కిలోమీటర్ల దూరం ఉండగా 140 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ప్రస్తుతం బెంగళూరుకు వెళ్లేందుకు 8 గంటల సమయం పడుతుండగా ఇకపై ఆరు గంటల్లోనే చేరుకోవచ్చు. ఆంధ్రా, కర్ణాటక రాష్ట్రాల్లో దుస్తుల పరిశ్రమ, ఇతర వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. విద్యార్థులు, ఉద్యోగులు, వలస కూలీలు సకాలంలో గమ్యస్థానాలు చేరుకోవచ్చు.

**పెరిగిన నిర్మాణ వ్యయం**

రాయదుర్గం నుంచి తుమకూరు వరకు మొత్తం 206 కిలోమీటర్ల దూరం ఉండగా ఇప్పటి వరకు 103 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. మొదట్లో రూ.1,050 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేయగా, 2012లో రూ.1,714.50 కోట్లకు బడ్జెట్ పెరిగింది. ప్రస్తుతం 50 శాతం పనులకే రూ.2,450 కోట్ల మేర ఖర్చు చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలు 50 శాతం మేర నిధులు కేటాయించాల్సి ఉంది.

**ఏయే పట్టణాల మధ్య** రాయదుర్గం, కళ్యాణదుర్గం, పావగడ, మడకశిర, మధుగిరి, కొరటగెరె, తుమకూరు పట్టణాల మధ్య రైల్వే లైన్ వెళుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో 94 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ వేయాల్సి ఉండగా ఈ నిర్మాణం పూర్తయింది. కర్ణాటకలో 113 కిలోమీటర్లమేర పనులు వేగంగా జరుగుతున్నాయి.

# వ్యూహం.. సిద్ధం!



విశాఖ : మహా విశాఖ నగరపాలక సంస్థ మేయర్ పీఠం దక్కించుకోవడానికి కూటమి నాయకులు వ్యూహాలు సిద్ధం చేసినట్టు సమాచారం. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత వైకాపా చేతిలో ఉన్న కొన్ని మున్సిపాలిటీలను కూటమి నాయకులు చేజిక్కించుకున్నారు. అయితే విశాఖ మేయర్ పీఠంపై ఇన్నాళ్లు ఎలాంటి నిర్ణయం తీసుకోని కూటమి అగ్ర నాయకులు... ఇప్పుడు మేయర్ మార్పునకు అంగీకరించినట్లు తెలిసింది.

**నాలుగేళ్లు పూర్తవడంతో..:** ఇదే అంశంపై ఇప్పటికే నగర ఎమ్మెల్యేలు ప్రత్యేక సమావేశం నిర్వహించి, వివిధ అంశాలపై చర్చించారు. మార్చి 18 నాటికి జీవీఎంసీ పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో, ఆ తర్వాత మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు కూటమి నాయకులు పావులు కదుపుతున్నారు.

ఇప్పటికే లెక్కలు, సమీకరణాలపై దృష్టి సారించిన నాయకులు, వాటిని అమలు చేయడానికి అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీవీఎంసీ బడ్జెట్ సమావేశాన్ని నేటి వరకు నిర్వహించలేదు. ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేసి, బడ్జెట్ ఆమోదించిన తర్వాత... మరో కౌన్సిల్ సమావేశంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టనున్నారు.

**'వైకాపా' ప్రయత్నాలు:** కూటమి తరఫున అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే.. మరో ఎనిమిది మంది కార్పొరేటర్ల మద్దతు అవసరం ఉంటుంది. కలెక్టర్‌కు ఇచ్చే నోటీసులో సంతకాలు పెట్టాల్సి ఉండటంతో, వైకాపా కార్పొరేటర్లు బయటకు వస్తారా..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల వైకాపా ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కార్పొరేటర్లతో సమావేశం ఏర్పాటు చేసి, పార్టీ మారొద్దని, భవిష్యత్తు బాగుంటుందని హితబోధ చేశారు. అయితే మేయర్‌పై ఉన్న వ్యతిరేకతతో కార్పొరేటర్లు సంతకాలు చేసేందుకు ముందుకొస్తారని కూటమి నాయకులు చెబుతున్నారు.

**సంతకాలపై దృష్టి:** అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే ముందు మెజార్టీ సభ్యుల సంతకాలు సేకరించాల్సి ఉంటుంది. ఆ సంతకాలతో పాటు, అవిశ్వాసం పెట్టడానికి వీలుగా సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం కౌన్సిల్‌లో 97 మంది సభ్యులు ఉండగా, 64 మంది కార్పొరేటర్లు అవిశ్వాసానికి అనుకూలంగా సంతకాలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత బలాబలాలు చూస్తే కూటమికి 56 మంది, వైకాపాకు 39 మంది, సీపీఎంకు ఒకరు, సీపీఐకి ఒకరు ఉన్నారు.

# లెక్క తప్పిన ముక్క

ఆదోని : ఆదోని మండలం మండిగిరి బీసీ వసతి గృహంలో 225 మంది విద్యార్థులు ప్రవేశం తీసుకొన్నారు. ఆదివారం 140 మంది విద్యార్థులే ఉన్నారు.. వారికి అన్నం, పప్పు, రసం వడ్డించారు. సంక్షేమాధికారి అందుబాటులో లేరు. మంచినీటి క్యాన్లలో విద్యార్థులే నీటిని నింపి తాగడానికి సిద్ధం చేసుకొన్నారు. వసతిగృహాల్లో మంగళ, శుక్రవారాలు రాత్రి భోజనంలో చికెన్ కర్రీ ఇవ్వాలి. ఆదివారం మధ్యాహ్నం చికెన్ బిర్యానీ పెట్టాలి. చాలా వసతిగృహాల్లో బిర్యానీకి బదులు చికెన్ కర్రీతో సరిపెట్టారు. ఎక్కడా సంక్షేమాధికారులు లేరు.. అక్కడి సిబ్బందే దగ్గరుండి చూసుకొన్నారు. కొన్నిచోట్ల రైతా ఇవ్వలేదు. గోంగూర చట్నీ మాత్రమే ఇచ్చి పెట్టింది తినమని హెచ్చరించారు." చిన్న పిల్లలకు ఒక్కటి.. పెద్దోళ్లకు రెండు.. దుకాణంలో తీసుకొచ్చింది ఎక్కువ.. విద్యార్థులకు వడ్డించింది తక్కువ.. సంక్షేమ అధికారులు లేరు.. సిబ్బంది పెట్టిందే లెక్క.. ఇది వసతి గృహాల్లో ఆదివారం అమలైన చికెన్ మెనూ. సెలవు రోజు కావడంతో కొందరు విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు.. మరికొందరి విద్యార్థుల తల్లిదండ్రులు ఇంటి భోజనమే తెచ్చి పెట్టారు.. కానీ వీరంతా వసతి గృహంలో తిన్నట్లే లెక్కలు రాసుకొన్నారు. బృందం జిల్లా వ్యాప్తంగా పలు వసతి గృహాలను పరిశీలన చేయగా లెక్క తప్పిన 'ముక్క' అంశాలు వెలుగులోకి వచ్చాయి."

**బిర్యానీ మాయం**



తొలిదళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య గ్రామమైన పెద్దపాడులోని సాంఘిక సంక్షేమ వసతిగృహంలో 245 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. ఆదివారం 220 మంది విద్యార్థులే ఉన్నారు. ఆదివారం చికెన్ బిర్యానీకి బదులుగా చికెన్ కూర, గోంగూర చట్నీ, అన్నం వడ్డించారు. సంక్షేమాధికారి అందుబాటులో లేరు.

**వేసేది ఒకట్రెండు ముక్కలే**

బీసీ, సాంఘిక సంక్షేమ, గిరిజన వసతిగృహాల విద్యార్థులకు వారానికి మూడుసార్లు విధిగా చికెన్ ఇవ్వాలి. ఆదివారం మధ్యాహ్న భోజనంలో, మంగళ, శుక్రవారాల్లో రాత్రివేళల చికెన్ వడ్డించాలి. ప్రతి విద్యార్థికి 100 గ్రాముల చికెన్ కచ్చితంగా ఇవ్వాల్సి ఉంది. కానీ వసతిగృహ నిర్వాహకులు సగటున ఒక్కో విద్యార్థికి 70- 80 గ్రాముల్లోపే అందిస్తున్నారు. కొన్నిచోట్ల మరీ నామమాత్రంగా చిన్న ముక్క ఒకటి వేస్తున్నారంతే. వసతిగృహాల సమీపంలోని మాంసం దుకాణాల నుంచే చికెన్ కొనుగోలు చేస్తున్నారు. ఈ సెంటర్ల నుంచి ఏడాది పొడువునా ఒకే పరిమాణంలో చికెన్ కొనడం లేదు. ఒకరోజు ఒక్కో పరిమాణంలో కొంటున్నారు. విద్యార్థుల సంఖ్య ఒకేలా ఉన్నాసరే చాలా తక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు.

# బిల్లు తగ్గించేద్దాం

కర్నూలు : మార్చి వచ్చేసింది.. సూరీడు సుర్రుమంటున్నాడు.. ఇంట్లో ఉంటేనే 'మాడి'పోతోంది.. జనం ఉక్కపోతకు తాళలేక చల్లదనం కోసం పరుగులు పెడుతున్నారు. ఇళ్లల్లో ఫ్యాన్లు వేగంగా తిరుగుతున్నాయి.. ఏసీలు ఆగడం లేదు.. చల్లని వస్తువుల కోసం ఫ్రిజ్ తలుపులు పదే పదే తెరవాల్సి వస్తోంది.. దీంతో ఇంట్లో విద్యుత్తు మీటరు గిర్రున తిరుగుతోంది..వచ్చే నెల గుండె గు'బిల్లు'మనడం ఖాయం.. ఈ నేపథ్యంలో కొన్ని మెలకువలు పాటిస్తే విద్యుత్తు వినియోగాన్ని తగ్గించొచ్చని విద్యుత్తుశాఖ కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి అంటున్నారు.

**బల్బులు** సాధారణ గుండ్రని ఫిలమెంట్ బల్బు ఎక్కువ విద్యుత్తును వినియోగిస్తుంది. అదే ఎల్ఈడీ బల్బు అయితే తక్కువ విద్యుత్తును తీసుకుంటుంది. 60 వాట్ల ఫిలమెంటు బల్బు ఇచ్చే వెలుగును.. 9 వాట్స్ ఎల్ఈడీ బల్బు ఇస్తుంది.

**ఫ్యాన్లు** బీఎల్‌డీసీ టెక్నాలజీతో తయారు చేసిన ఫ్యాన్ల వాడకంతో విద్యుత్తు వినియోగం కొంత వరకు తగ్గించుకోవచ్చు. రెగ్యులేటర్లు పనిచేయక ఫుల్ స్పీడుతో తిరుగుతుంటాయి. దీని వల్ల బిల్లు అధికంగా వస్తుంది. 1 లేదా 2 వేగంతో తిరిగితే సగం బిల్లు ఆదా అవుతుంది. దెబ్బతిన్న బేరింగ్(శబ్ధం వస్తుంది)లు వెంటనే సరి చేయించాలి లేదంటే మోటారుపై లోడు పడి ఎక్కువ విద్యుత్తు వినియోగమవుతుంది.

**ఏసీ** ఏసీ కెపాసిటీని టన్నుల్లో కొలుస్తారు. సాధారణంగా ఒక టన్ను నుంచి 2 టన్నుల వరకు ఏసీలు ఉంటాయి. 3 స్టార్ ఏసీ కొంత ఎక్కువ విద్యుత్తును వినియోగిస్తే.. 5స్టార్ ఏసీ తక్కువ విద్యుత్తును



వినియోగిస్తుంది. వెయ్యి వాట్ల ఏసీ ఒకగంట సేపు పని చేస్తే ఒక యూనిట్ విద్యుత్తు కాలుతుంది. అదే 1500 వాట్ల ఏసీ గంటసేపు పనిచేస్తే 1.5 యూనిట్లు ఖర్చవుతుంది. ఏసీ సెట్టింగ్‌ను 24 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఎప్పటికప్పుడు పిల్లర్లు శుభ్రంగా ఉంచుకోవాలి. బయట నుంచి వేడి గాలులు రాకుండా కర్టెన్లు వేసి ఉంచాలి. కొంతసేపు వేసుకొని.. తర్వాత ఫ్యాన్ వేసుకుంటే గది చల్లగా ఉంటుంది.

**ఫ్రిజ్** ఫ్రిజ్ తలుపు ఒక్కసారి తెరిస్తే అరగంట కూలింగ్ నష్టపోవాల్సి ఉంటుంది. కాబట్టి సాధ్యమైనంత వరకు తక్కువసార్లు తెరవాలి. వేడిఉన్న చోట్ల పెడితే ఎక్కువ విద్యుత్తు వినియోగమవుతుంది. వెనుక భాగాన్ని గోడకు ఆనకుండా గాలి తగిలేలా ఉంచాలి.

# పల్లెల్లో విద్యుత్తు కష్టాలకు చెక్

తాళ్లూరు : జిల్లాలోని అన్ని గ్రామాలకు నిరంతరాయంగా త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా చేసేందుకు ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలోని 38 మండలాల పరిధిలో ఇప్పటి వరకు త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా లేని దాదాపు 500లకు పైగా పల్లెలను గుర్తించి కరెంటు సరఫరా చేసేందుకు పనులు జరుగుతున్నాయి. వాస్తవంగా వైకాపా ప్రభుత్వ హయాంలోనే ఇలాంటి సౌకర్యం కల్పించేందుకు రెండున్నర సంవత్సరాల క్రితమే విద్యుత్తు పంపిణీ వ్యవస్థ పునరుద్ధీకరణ పనుల్లో భాగంగా ఆర్డీఎస్ఎస్ ద్వారా రూ.550 కోట్ల మేరకు నిధులు మంజూరు చేసి వెంటనే టెండర్లు కూడా ఖరారు చేశారు. నాటి జగన్ పాలనలో పనులు చేసినా సకాలంలో బిల్లులు రావనే ఉద్దేశంతో గుత్తేదారుడు ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బిల్లులు వస్తాయనే నమ్మకం కలగడం, జిల్లా ఉన్నతాధికారులు చొరవచూపి గుత్తేదారుడితో మాట్లాడడంతో పనులు ప్రారంభమయ్యాయి. దీంతో నాలుగైదు నెలల నుంచి జిల్లా వ్యాప్తంగా కొత్త విద్యుత్తు లైన్ల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి.



తాళ్లూరు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు.

**వ్యవసాయ, ఇంటి అవసరాలకు వేర్వేరుగా..** ఇక నుంచి వ్యవసాయావసరాలకు వేరుగా.. గృహాలు, పరిశ్రమలు, వ్యాపార సంస్థల అవసరాలకు మరో లైన్ ద్వారా విద్యుత్తు సరఫరా చేసేందుకు వీలుగా పనులు చేపడుతున్నారు. గతంలోని స్తంభాలు శిథిలమైనా, లైన్ బాగు లేకున్నా వాటిని తొలగించి వాటిస్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని జిల్లా ఉన్నతాధికారులు సూచించడంతో ఆ పనులు కూడా చేస్తున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన కూలీలు, బీహార్ రాష్ట్రం వచ్చిన వారిని 26 బృందాలుగా ఏర్పాటు చేసి పనులు చేస్తున్నారు. ఇప్పటికి 30 శాతం మేరకు దాదాపు రూ.150 కోట్లతో పనులు జరిగాయని విద్యుత్తు శాఖ ఎస్ఈ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. మార్చి నెలలోగా పనులు పూర్తి చేయాల్సి ఉన్నా, మరో రెండు, మూడు నెలలు అదనంగా సమయం తీసుకొని పూర్తి చేయిం చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ పనులన్నీ పూర్తయితే జిల్లాలోని అన్ని గ్రామాల ప్రజలకు నిరంతరాయంగా త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా కానుంది.

# ఎస్వీయూ.. దూరవిద్య గాడినపడేనా..?

తిరుపతి : ఎంతో ఘన చరిత్రగల ఎస్వీ యూనివర్సిటీ కొన్నాళ్లుగా దూరవిద్య విభాగం పనితీరుతో అపకీర్తి మూటగట్టుకుంటోంది. గత ఐదేళ్లలో జరిగిన ప్రవేశాలు, పరీక్షలు, నిబంధనల ఉల్లంఘనలు ఓ మాయని మచ్చలా మారాయి. మరోవైపు ప్రవేశాలు పొంది పరీక్షలు జరగక ఏళ్లుగా పట్టాలు చేతికందక వేలమంది విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**స్టడీ సెంటర్ల పేరుతో దోపిడీ..**

ఏటా 30 వేలమంది విద్యార్థుల ప్రవేశాలతో వర్సిటీ దూరవిద్య విభాగం ఒకప్పుడు కళకళలాడేది. వర్సిటీకి రూ.40 కోట్లకు పైగా ఆదాయం సమకూరేది. విభాగాన్ని బంగారు బాతులా మార్చుకున్న గత పాలకులు ఇష్టానుసారంగా స్టడీ సెంటర్ల ఏర్పాటుతో అక్రమార్జనకు వేదికగా మార్చుకున్నారు. ఇటీవల కేరళ రాష్ట్రానికి చెందిన ఓ ప్రైవేటు స్టడీ సెంటర్ నిర్వాహకులు ఎస్వీయూ దూరవిద్య విభాగంలో ప్రవేశాలంటూ అక్రమ వసూళ్లపర్వానికి తెరలేపారు. తర్వాత ఈ బాగోతం వెలుగులోకి రావడంతో నామమాత్రపు చర్యలకు అధికారులు ఉపక్రమించారు.



ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనూ పలు కేంద్రాల నిర్వాహకులు దోపిడీకి పాల్పడిన ఉదంతాలు లేకపోలేదు.

**ఫలించని పాలకుల ప్రయత్నాలు**

జనవరి 7, 8, 9 తేదీల్లో యూజీసీ నిపుణుల కమిటీ వర్సిటీ దూరవిద్య విభాగాన్ని సందర్శించి వెళ్లింది. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు సిద్ధమైనా క్షేత్రస్థాయిలో లోటుపాట్లు శాపంగా మారాయి. కేంద్రాలు మార్పుచేసి పారదర్శకతను పాటించిప్రవేశాలు చేపట్టాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

**డెబ్ అనుమతుల రద్దుతో**

దూరవిద్యలో నిబంధనలకు విరుద్ధంగా తరగతులు, ప్రవేశాలు, పరీక్షలు నిర్వహిస్తుండటం.. ఉల్లంఘనలు శ్రుతి మించిన నేపథ్యంలోనే యూజీసీ డెబ్ అనుమతులు రద్దు చేసింది. 2021 నుంచి ప్రవేశాలు నిలిచిపోయాయి. అప్పటికే ప్రవేశాలు పొందిన విద్యార్థులు నేటికీ పరీక్షలు రాయలేక వర్సిటీ చుట్టూ తిరుగుతున్నారు.

# ప్రతి రైతుకూ ప్రత్యేక గుర్తింపు



మార్కాపురం : దేశానికి అన్నం పెట్టేది రైతులే. వీరి సంక్షేమానికి ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. నేల తల్లినే నమ్ముకుని వ్యవసాయం సాగించే కర్షకులపై కొన్నిసార్లు వాతావరణం కత్తి దూస్తుంటుంది. అలాంటి వేళ వారిని ఆదుకునేందుకు., పథకాలు, సేవలు సక్రమంగా అందించేందుకు కొన్నిసార్లు క్షేత్రస్థాయిలో అడ్డంకులు ఎదురవుతున్నాయి. బాధితులెవరో గుర్తించేందుకు అవాంతరాలు తలెత్తుతున్నాయి. అధిగమించి సేవలను సమర్థంగా, పారదర్శకంగా అందించాలని ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఆ మేరకు ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో ప్రతి రైతుకు 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వాలని నిర్ణయించాయి. ప్రస్తుతం ఆధార్ తరహాలో ఇకపై ఈ సంఖ్య ప్రామాణికం కానుంది.

**ఇవీ ప్రయోజనాలు**

భూమి గల రైతులను త్వరగా గుర్తించడంలో దోహదం.

ప్రభుత్వ రాయితీలు, పంటల బీమా అర్హులకు వర్తింపు.

భూ ఆధారిత రైతు పథకాలైన పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీపై వ్యవసాయ పరికరాలు తదితర పథకాలను నేరుగా పొందే వీలు.

ప్రకృతి వైపరీత్యాలతో పంటలు చేతికి అందకుంటే సత్వరమే నష్ట పరిహారం అందించేందుకు చర్యలు.

నీటిపారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు అందించడం.

ఇలా వివరాల నమోదు ప్రత్యేక గుర్తింపు సంఖ్య నమోదుకు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లాలి.

ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం నకళ్లతో పాటు చరవాణి సంఖ్య గ్రామ వ్యవసాయ సహాయకుడికి అందించాలి.

వివరాలను వీఏఏ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

రైతు చరవాణికి ఓటీపీ వస్తుంది.

ఆ సంఖ్యను చెప్పడం ద్వారా వీఏఏ లాగిన్‌లో రైతుల వివరాలు 80 నుంచి 100 శాతం కచ్చితంగా ఉంటే సరి. 60 నుంచి 80 శాతమే సరిపోలితే వీఆర్వో లాగిన్‌కు వెళ్తుంది. 40 నుంచి 60 శాతమే కచ్చితమైతే తహసీల్దార్ లాగిన్‌కు వెళ్తుంది.

తహసీల్దార్ తప్పులను సరిచేసి తర్వాత వీఏఏ లాగిన్‌కు పంపుతారు.

ఆ తర్వాత సమస్య పరిష్కారం అవుతుంది.

రైతుకు చెందిన భూమి వివరాల్లో తప్పులు లేకుంటే ప్రత్యేక గుర్తింపు సంఖ్య అందిస్తారు.రైతు కుటుంబాలు 2.86 లక్షలు

ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం 4.64

లక్షలు రబీలో సాగయ్యే విస్తీర్ణం 3.53

లక్షలు జిల్లాలోని మండలాలు 38

# పొట్లాలుగా కట్టి.. సిగరెట్లుగా చుట్టి..!



కనిగిరి : కనిగిరి పట్టణంలో తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. రాత్రి తొమ్మిది గంటలు దాటిన తర్వాత కొందరు యువకులు ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్, రోడ్లపైనే గొడవలు పెట్టుకోవడం షరా మామూలైంది. గంజాయి ముఠాలు సరకు ఎంత కావాలంటే అంత ఎక్కడికి కావాలంటే అక్కడికి సరఫరా చేస్తున్నాయి. కనిగిరి, దర్శి, పామూరు, పొదిలి, కొండపి, టంగుటూరు తదితర ప్రాంతాల్లో బడ్డీకొట్లునే కేంద్రాలుగా చేసుకుని వ్యాపారం సాగిస్తున్నారు. ఫలితంగా ఎంతో మంది యువత దీని బారిన పడుతున్నారు.

**అడ్డాగా మారిన దొరువు..**

బడ్డీకొట్లలో 50, 100 గ్రాముల పరిమాణంలో పొట్లాలుగా కట్టి రూ.150 చొప్పున విక్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో కనిగిరి పట్టణంలో రెండు సార్లు ఇలాగే అమ్ముతూ పోలీసులకు నిందితులు చిక్కారు. మరికొందరు దుకాణదారులు సిగిరెట్లలో గంజాయి దట్టించి ఒక్కొక్కటి రూ.300 వరకు అమ్ముతున్నారు. కనిగిరి మున్సిపాలిటీలోని దుర్గం దొరువు గంజాయికి అడ్డాగా మారిందని ఇటీవల పోలీసుల విచారణలో తేలింది. వృద్ధాశ్రమం, మంగళమాన్యం, కొత్తూరు, ఒంగోలు బస్టాండ్, గార్లపేట రోడ్డు, గ్యాస్ గోడౌన్, శివనగర్ కాలనీ వాటర్ ప్లాంటు, అర్బన్ కాలనీ తదితర ప్రాంతాల్లో కొంత మంది ఇదే పనిగా వ్యాపారం సాగిస్తూ యువతను మత్తులోకి దింపుతున్నారని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బస్సులు, రైళ్లలో తీసుకొచ్చి...**

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, అనకాపల్లి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి రైళ్లు, బస్సుల్లో గంజాయిని తాళ్లూరు మండలం తూర్పుగంగవరం, పొదిలి, నెల్లూరు జిల్లా కందుకూరుకు చేర్చుతున్నారు. అక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. అక్కడ కిలో రూ.5 వేలకు కొనుగోలు చేసి ఇక్కడ కిలో రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు విక్రయిస్తున్నారు. తెలిసిన వారికి కోడ్ భాషలో తెలిపి, వారు అడిగితేనే సరకు చేరవేస్తారు. నాలుగు నెలల క్రితం కనిగిరి పట్టణంలోని పామూరు బస్టాండ్ వద్ద గల ఓ హొటల్‌లో పనిచేస్తున్న సర్వర్‌ను గంజాయి మత్తులో ముగ్గురు యువకులు చితకబాదారు.

ఇటీవల పట్టణంలో చెప్పుల బజారు సమీపంలోని ఓ హొటల్ వద్ద కొందరు యువకులు గంజాయి మత్తులో గొడవపడి దారిన పోయే వారిని కొట్టారు.

**విక్రయిస్తే కఠిన చర్యలు**

గంజాయి విక్రయించినా, కొనుగోలు చేసినా నేరం. గంజాయి ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచాం. యువతకు మత్తు వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్నాం. గురువారం పట్టణంలో 340 గ్రాముల సరకు స్వాధీనం చేసుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నాం. ఈశ్వర్ సాయి యశ్వంత్, డీఎస్పీ, కనిగిరి

# పశువైద్యుల కొరత.. తీరని వెత



అనంతపురం : పశువైద్యుల కొరత వేధిస్తుండటంతో పశు పోషకులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. మూగ జీవాలకు సకాలంలో మెరుగైన వైద్యం అందడం కష్టంగా మారింది. ఈ పరిస్థితి ఉరవకొండ పశువసంవర్ధక డివిజన్‌లో మరింత అధికంగా ఉంది. ఉరవకొండ పశుసంవర్ధక డివిజన్‌లో రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లోని 15 మండలాలు ఉన్నాయి. ఒక్కో మండలంలో 25 వేలకు పైగా పశుసంపదతో పాటు, 50 వేలకు పైగా జీవాల సంఖ్య ఉంది. ఈ డివిజన్‌లో 8 సహాయ సంచాలకుడి (ఏడీ) స్థాయి, 28 డాక్టర్ స్థాయి పశువైద్యశాలలు ఉన్నాయి. ప్రస్తుతం ముగ్గురు ఏడీలు ఉండగా, 5 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. 12 మంది పశువైద్యులు విధులు నిర్వర్తిస్తుండగా, 16 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న ముగ్గురు ఏడీలు అదనంగా మరో రెండు పశువైద్యశాలలు, వైద్యులు మరో ఆసుపత్రి బాధ్యతను చూడాల్సిన పరిస్థితి. దీని కారణంగా మెరుగైన పశువైద్యం లభించడం కష్టంగా మారింది.

**డిప్యుటేషన్‌లో ఐదుగురు ఏడీలు**

ఉరవకొండ పశుసంవర్ధక డివిజన్‌లో 8 మంది ఏడీల్లో ఐదుగురు డిప్యుటేషన్‌లో నలుగురు ఇతర జిల్లాల్లోనూ, ఒకరు జేడీ కార్యాలయంలో విధుల్లో ఉంటున్నారు. దీని కారణంగా ఏడీ స్థాయి ఆసుపత్రుల్లో కింది స్థాయి సిబ్బంది పశువైద్యానికి దిక్కుగా మారింది. ఈ డివిజన్ రాష్ట్ర సరిహద్దులో ఉంటోంది. పశుపోషణ పరంగా క్రమంగా అభివృద్ధి చెందుతోంది. ఇలాంటి తరుణంలో ఏడీ స్థాయి అధికారులు ఉండి, తమ తమ మండలాల్లో మెరుగైన పశువైద్యం అందించడంతో పాటు పథకాల అమలులోనూ చొరవ చూపితే పశుపోషణ పరంగా మరింత అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుంది.

**ప్రజా ప్రతినిధులు చొరవ చూపితే**

ఉరవకొండ పశుసంవర్ధక డివిజన్‌కు పూర్తి స్థాయిలో వైద్యులు, ఏడీలను నియమించడంలో గత వైకాపా ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఈ కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్యానికి ఇక్కట్లు తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో మంత్రి పయ్యావుల కేశవ్‌తోపాటు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ చూపి, వైద్యులను నియమించడంతో పాటు ఇప్పటికే డిప్యుటేషన్లలో ఉన్న ఏడీలను ఇక్కడ తిరిగి నియమించేలా చొరవ చూపితే పశువైద్య సేవలు మెరుగు పడనున్నాయి.

**ప్రతిపాదించాం - డాక్టర్ వెంకటేశ్, డీడీ, ఉరవకొండ**

మా డివిజన్‌లో ఉన్న వైద్యులు, ఏడీలతో పశువైద్యం, ఇతర కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఇదే క్రమంలో ఖాళీగా ఉన్న పశు వైద్యులు, ఏడీల భర్తీకి మాశాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదించాం. వారు లేని కారణంగా ఉన్న ఇబ్బందులను వారితో ప్రస్తావించాం. మరోసారి విషయాన్ని వారి దృష్టికి తీసుకుపోతాము.

# మీనం.. మేతలో అనర్థం

కొనకనమిట్ల : చేపలు అనగానే మాంసాహార ప్రియులు ఇష్టంగా తింటారు. ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఆశిస్తారు. కొందరు చేపల చెరువుల యజమానుల తీరు మాత్రం వారి ఆరోగ్యంతో చెలగాటమాడేలా ఉంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు అర్జించాలన్న దురాశతో చేటు తెస్తున్నారు. ప్రమాదకరమని తెలిసీ కోళ్లు, చనిపోయిన జంతువులు వ్యర్థాలను చేపలకు ఆహారంగా వేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇటీవల కాలంలో కోడిమాంసం దుకాణాలు ఎక్కువ సంఖ్యలో వెలిశాయి. వీటి నుంచి కోళ్ల వ్యర్థాలను తరలించేందుకు దుకాణదారులతో కొందరు చెరువుల యజమానులు ఒప్పందం చేసుకున్నారు. కేవలం మార్కాపురం, కొనకనమిట్ల, పొదిలి వంటి ప్రాంతాల నుంచే



నిత్యం రెండు, మూడు మినీ లారీల్లో వ్యర్థాలను తీసుకెళ్లి చేపలకు మేతగా వేస్తున్నారు. వాస్తవానికి వీటిని చేపలకు మేతగా వేయడాన్ని నిషేధిస్తూ ఎనిమిదేళ్ల కిందటే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయినా కొందరు ఆ పంథా వీడలేదు.

**అత్యాశతో ప్రజారోగ్యానికి చేటు**

చేపలకు మేతగా వేసే డీవోబీ(నూనె తీసిన తవుడు) వేరుసెనగ చెక్క ధర ఎక్కువ. ఆరు నెలలకు సగటున రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుంది. సంప్రదాయ మేత కిలో రూ.35 ఉండగా కోడిమాంసం వ్యర్థాలు మాత్రం కిలో రూ.10కే లభిస్తున్నాయి. ఒక ఎకరా విస్తీర్ణంలోని చెరువుకు సంప్రదాయ మేతగా రోజుకు 20 కిలోలు వినియోగించాల్సి ఉంటుంది. అందుకు రూ.700 వరకు ఖర్చవుతుంది. కూలి మరో రూ. 500 అదనం. నెలకొచ్చేసరికి సుమారు రూ.30 వేల వరకు ఇందుకు వ్యయమవుతుంది. అదే కోళ్ల వ్యర్థాలు 200 కిలోల డ్రమ్ముకు సుమారు రూ.1,500 చెల్లిస్తే సరిపోతుంది. ఈ తీరులో నెలకు రూ.10 వేలు మాత్రమే ఖర్చవుతుంది. దీంతో అత్యాశకు పోతున్న కొందరు డంపింగ్ యార్డులకు తరలించాల్సిన వ్యర్థాలను చేపలకు మేతగా వేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

# ఒక్కరుంటే ఒట్టు..!

పుత్తూరు : క్రీడల్లో ప్రతిభచూపి ఖ్యాతిని దేశ, అంతర్జాతీయ స్థాయిలో చాటాలని మన నేతలు గొప్పగా మాటలు చెబుతుంటారు.. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి.. విద్యార్థుల దశ మలుపు తిప్పే జూనియర్ కళాశాలల్లో క్రీడా ప్రమాణాలు పూర్తిగా అంతరించిపోతున్నాయి.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని అందులో అంతర్భాగమేనన్నది అక్షర సత్యం.. అయితే అమల్లో మాత్రం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. జడ్పీ ఉన్నత పాఠశాలల వరకు పీటీఈలు ఉన్నారు. అదే ఇంటర్మీడియెట్‌లో అసలు క్రీడల వైపు అడుగుపడటం లేదు. నీట్, ఎంసెట్, డీఎడ్, ఐదేళ్ల లాసెట్ తదితర కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఈ నేపథ్యంలో ఆటలపై ఆసక్తి తక్కువే. ఈ దశలో మెరుగ్గా రాణించిన క్రీడాకారులు ఎందరో క్రీడా రిజర్వేషన్ పొంది ఇంజినీర్లుగా, డాక్టర్లుగా, రైల్వే, బ్యాంకు, పోలీసు, సైనికులుగా స్థిరపడ్డారు. ఉద్యోగం, ఉన్నత చదువుల్లో రిజర్వేషన్ పొందే అవకాశం ఉన్నా ఆదిశగా ఆలోచించడంలేదు.

**ఉమ్మడి చిత్తూరు జిల్లాలో..**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 53 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకుల నియామక ప్రక్రియ ఆగిపోవడంతో ఒకరిద్దరున్నా వారు సైతం ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జూనియర్ కళాశాల్లో ఒక్క పీడీ (ఫిజికల్ డైరెక్టర్) కూడా లేరు. పాఠశాలల్లో పనిచేస్తున్న పీఈటీలు ఎంపీఈడీ కోర్సు పూర్తి చేశాఖ వ్యాయామ అధ్యాపకులుగా ఉద్యోగోన్నతులు పొందుతూ వచ్చారు. దీనిపై కోర్టులో వ్యాజ్యం ఉన్నందున రెండు దశాబ్దాల నుంచి అవి ఆగిపోయాయి. పీఈటీలు పాఠశాలల్లోనే ఉద్యోగ విమరణ పొందుతుంటే ఇంకొందరు హెచ్ఎంలవుతున్నారు.

**ఉద్యోగోన్నతులు కల్పించాలి..**కోర్టులో ఉన్న వ్యాజ్యంను పరిష్కరించి పీఈటీలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి. కొన్నేళ్లుగా తాము పోరాటం చేస్తున్నా పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలి. తద్వారా పీఈటీలు అందరికీ న్యాయం జరుగుతుంది.బాబు, జిల్లా కార్యదర్శి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, తిరుపతి జిల్లా

# పనుల్లో నేతల పెత్తనం

నంద్యాల : కేజీబీవీల్లో అదనపు గదుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలోనే పనులు జరగాలని ఆదేశించింది. ఈ నిధులపై కొందరు నాయకులు కన్నేశారు. వాటిని కాజేసేందుకు పావులు కదిపారు. పేరుకు ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నట్లు కనిపిస్తున్నా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేజీబీవీల పనుల్లో నాయకులే పెత్తనం చెలాయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

**25 శాతం మంజూరు** కర్నూలు జిల్లాలో 17, నంద్యాల జిల్లాలో 22 కస్తూర్బా విద్యాలయాల్లో అదనపు గదుల నిర్మాణానికి గతేడాది సెప్టెంబరులో నిధులు మంజూరయ్యాయి. తొలి విడత 25 శాతం నిధులు మంజూరు చేశారు. కర్నూలు జిల్లాలో రూ.4.46 కోట్లకుగాను రూ.1.12 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.6.32 కోట్లకుగాను రూ.1.58 కోట్లు విడుదలయ్యాయి. సమగ్ర శిక్షా పర్యవేక్షణలో కేజీబీవీల్లో పీఎఫ్ఎంఎస్ (పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) విధానంలో నిధులు ఖర్చు చేయాల్సి ఉంది.


**పర్యవేక్షణ కరవై..**నిర్మాణ పనులను గుత్తేదారులు చేయరు. ఇందులో ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు)లు జోక్యం చేసుకోవు. అన్నీ ప్రిన్సిపాళ్లే చేయించాల్సి ఉంది. వీరికి సివిల్ పనులపై అవగాహన లేకపోవడం.. అకడమిక్ పనులతో ఒత్తిడి ఎక్కువవడం.. ఇసుక, కంకర సకాలంలో తెప్పించలేకపోవడం.. కూలీలతో మాట్లాడలేకపోవడం కొందరు నాయకులకు వరంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విడుదల చేసిన నిధులపై స్థానిక నాయకులు కన్నేశారు. ఇంజినీర్లను మధ్యవర్తులుగా పంపి ప్రిన్సిపాళ్లతో మాట్లాడించి పనులు హస్తగతం చేసుకున్నారు. సంతకాలు మాత్రమే వారితో తీసుకుని పనులు చేస్తున్నారు. ఆళ్లగడ్డ, నందికొట్కూరు, పాణ్యం, బనగానపల్లి, డోన్ నియోజకవర్గాల్లో పనులన్నీ వారి కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. **నిబంధనల అడ్డంకి**సాధారణంగా నిధుల విడుదలను బట్టి పనులు చేయడం పరిపాటి. ఇందుకు విరుద్ధంగా కస్తూర్బాల్లో అదనపు గదుల నిర్మాణానికి ప్రిన్సిపాళ్లే ముందుగా నిధులు ఖర్చు చేసి ఆ తర్వాత ఎం.బుక్కులు చేయాలంటూ సమగ్రశిక్షా కార్యాలయం ఇంజినీర్లు చెబుతున్నారు.

# అర్జీల పరిష్కారంలో అలసత్వం

అనంతపురం : రెవెన్యూ శాఖలో నిర్లక్ష్యం.. బాధ్యతారాహిత్యం వెళ్లూనుకుంది. ప్రజా సమస్యల పరిష్కారంలో బాధ్యత లేకుండా పనిచేస్తోందన్న విమర్శను మూటగట్టుకుంది. రాష్ట్రంలో తెదేపా కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జరిపిన 'గ్రామ రెవెన్యూ సదస్సు'ల ముఖ్యోద్దేశానికి తూట్లు పొడుస్తున్నారు. గ్రామ సదస్సులు ముగిసి దాదాపు నెల రోజులు గడుస్తున్నా పరిష్కార శాతం అంతంత మాత్రమే నమోదైంది. కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణ శర్మ అడపాదడపా వీక్షణ సమీక్షలు నిర్వహించినా పెద్దగా ప్రయోజనం ఒనగూరడం లేదు. ఇప్పటికీ 53.77 శాతం సమస్యలు మాత్రమే పరిష్కరించినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇంకా 46.23 శాతం అర్జీలు ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి.

**గ్రామాల్లో 33 రోజులు**

గత వైకాపా ప్రభుత్వంలో రెవెన్యూ యంత్రాంగం అస్తవ్యస్తంగా తయారు కావడంతో ప్రజా సమస్యలు అటకెక్కాయి. ఈ శాఖను గాడిలో పెట్టడంతోపాటు బాధితుల సమస్యల పరిష్కారానికి గతేడాది డిసెంబరు 6 నుంచి ఈ ఏడు జనవరి 8వ తేదీ దాకా.. దాదాపు 33 రోజులపాటు 503 గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులను తహసీల్దార్లు తూతూమంత్రంగా నిర్వహించినా 51 రకాల సమస్యలపై 6,877 అర్జీలు దాఖలు కావడం విశేషం.



**ఆ నాలుగుచోట్ల అధ్వానం**

జిల్లాలో 32 మండలాలుండగా కంబదూరు, తాడిపత్రి, శింగనమల, బ్రహ్మసముద్రం మండలాల్లో అర్జీల పరిష్కారంలో అధ్వానస్థితి నమోదైంది. అత్యధికంగా కంబదూరులో 174లో 129 సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. తాడిపత్రిలో 141లో ఇంకా 101 పెండింగే. శింగనమలలో 272లో 179, బ్రహ్మసముద్రంలో 200లో 125 ప్రకారం పెండింగ్‌లో ఉన్నాయి. రాప్తాడు, కుదేరు, బీకే సముద్రం, పామిడి, గుత్తి మండలాల్లో 50 శాతంపైగానే పరిష్కరించాల్సి ఉంది. ఒక్క బొమ్మనహాళ్‌లో మాత్రమే 52 అర్జీలు వస్తే.. అన్నింటినీ పరిష్కరించారు. నిర్దేశిత గడువు రెండు వారాలే ఉండేది. ఈలోపు దృష్టి సారిస్తారా లేదా అన్నది అనుమానమే. **కాళ్లరిగేలా తిరుగుతున్నా-దాసరి నారాయణస్వామి, కదవకల్లు, శింగనమల** మా ఊర్లో సొంత భూమి 13.45 ఎకరాలు ఉంది. దీన్ని కొందరు స్థానికులు ఆక్రమించారు. ఏడాది కాలంగా రెవెన్యూ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా స్పందన లేదు. మా తండ్రి చనిపోయారు. నేను, మా అమ్మ జిల్లా, మండల అధికారులకు అనేక అర్జీలిచ్చినా ఫలితం లేదు.

# తల్లులుగా బాలికలు

అనంతపురం : ఆటపాటలతో హాయిగా గడిచే బాల్య దశ అది. అభం శుభం తెలియని కౌమార వయసు (18ఏళ్ల లోపు) బాలికల్లో సంసార భారాన్ని మోపుతున్నారు. పూర్తి స్థాయి శారీరక ఎదుగుదల లేకుండానే తల్లులు అవుతున్నారు. బంగారు బాల్యం బుగ్గిపాలవుతోంది. రాష్ట్రంలోనే అత్యధిక బాల్య వివాహాలు చాపకింద నీరులా జోరుగా సాగుతున్నా అధికార యంత్రాంగం మొద్దునిద్ర వీడటంలేదు. పౌష్టికాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణి, తల్లుల వివరాలను తరిచి చూస్తే బాల్య వివాహాల బాగోతం తేటతెల్లమవుతోంది. ఏటా కనీసం 2 వేలకుపైగా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

**ఆ నాలుగు చోట్లే ఎక్కువ**

ప్రస్తుత అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన కౌమార వయసు(టీనేజీ) కలిగిన బాలికలు గర్భిణి/తల్లిగా నమోదైనవారే 1,618 మంది ఉన్నట్లు తేలింది. ఇందులో గర్భిణులు 861 మంది, తల్లులు 757 మంది ప్రకారం ఉన్నారు. ఉరవకొండ, రాయదుర్గం, కంబదూరు, గుత్తి ప్రాజెక్టుల్లోనే అత్యధికంగా బాల్య వివాహాలు సాగుతున్నాయి. ఒక్క ఉరవకొండ ప్రాజెక్టులోనే 290 మంది ఉండటం విశేషం. చిన్న వయసులోనే బాలికలు తల్లులైతే తీవ్ర అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. తల్లీబిడ్డపై ప్రభావం ఎక్కువే.

**తూతూమంత్రంగా అవగాహన**

అత్యంత దయనీయ ఏమిటే.. బాలికకు 12 ఏళ్లకే పెళ్లి చేస్తున్నారు. 15 ఏళ్లలోపే తల్లులు అవుతున్నారు. తాజా గణంకాల్లో 1618 మందిలో ఓ 200 మందికిపైగా ఆడపిల్లలు 15 ఏళ్లకే తల్లులు అవుతుండటం విస్మయాన్ని కల్గిస్తోంది. ఆడపిల్లల కనీస పెళ్లి వయసు 18 ఏళ్లుగా నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో బాల్య వివాహాలను నియంత్రించేందుకు ప్రత్యేక యంత్రాంగం ఉన్నా నిష్ప్రయోజనంగా మారింది. అడపాదడపా ప్రచార గోడపత్రాల ఆవిష్కరణ, కొన్నిచోట్ల అవగాహన సమావేశాలకే పరిమితం అవుతున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఆధునిక సమాజ పురోగతికి బాల్య వివాహాలు తీవ్ర ఆటంకంగా పరిణమించే ప్రమాదం ఉంది.

# నరకం వీడింది.. దారి తీరు మారింది..



చెన్నేకొత్తపల్లి: వైకాపా ఐదేళ్ల పాలనలో రోడ్లపై అడుగు పెట్టాలంటే నరకంగా ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడు నెలల్లోనే పలు రహదారులు సుందరంగా రూపుదిద్దుకున్నాయి. సీకేపల్లి మండలం నాగసముద్రం గ్రామానికి రోడ్డు నిర్మించడంపై ఆ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2019లో అప్పటి తెదేపా ప్రభుత్వం నాగసముద్రం నుంచి ధర్మవరం-ఎన్ఎస్‌గేట్ ప్రధాన రహదారి వరకు రూ. 1.7 కోట్లతో 2.2 కి.మీ రోడ్డు నిర్మించేందుకు పనులు ప్రారంభించింది. 80 శాతం పూర్తయిన సందర్భంలో ఎన్నికలు రావడం, ఆపై వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఐదేళ్లు పనులు నిలిచిపోయాయి. చెరువు కట్ట దారి కంకరతేలి, భారీ గుంతలు ఏర్పడి ప్రయాణం నరకంగా మారింది. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురైన ఘటనలు అనేకం. ఇలాంటి తరుణంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక దృష్టి సారించి రూ. 1.7 కోట్ల నిధులతో దారి నిర్మాణం పూర్తి చేయించడంతో స్థానికుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

# నిధులపై కన్నేసి.. పైప్‌లైను పేరుతో కాజేసి



కర్నూలు : కర్నూలు నగరానికి ప్రధాన నీటి వనరు సుంకేసుల జలాశయం. దీని ఆధారంగానే నగరానికి తాగునీరు సరఫరా అవుతోంది. నగరంలోని కాలనీలకు ప్రతి రోజూ తాగునీరు సరఫరా చేస్తుండగా కల్లూరు కాలనీలకు మాత్రం రెండు మూడు రోజులకు ఒకసారి నీటిని వదులుతున్నారు. శివారు కాలనీలు, విలీన గ్రామాల్లో సరఫరా అంతంతమాత్రంగానే ఉండటంతో జనం దూరప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. డబ్బులు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. కొన్ని ప్రాంతాల్లో నగరపాలక ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో కానరావడం లేదు.

**వారి స్వార్థం.. నగరపాలకకు భారం**

గత ప్రభుత్వ హయాంలో కొందరు నేతలు తమ స్వార్థం కోసం సుంకేసుల నుంచి మునగాలపాడు వరకు పైప్‌లైను పనులు చేపట్టారన్న ఆరోపణలున్నాయి. సుంకేసుల నుంచి కేసీ కాలువకు నీరు వదిలిన సమయంలో మార్గమధ్యలో రైతులు తమ పొలాలకు నీరు వాడుకుంటున్నారని.. మరికొన్నిచోట్ల నీరు వృథాగా పోతోందంటూ సమస్యను పెద్దదిగా చూపి నిధులపై కన్నేశారు.

**నాలుగు నెలలకు రూ.2.40 కోట్లు**

సుంకేసుల జలాశయం నుంచి మునగాలపాడు పంప్‌హౌస్‌కు పైప్‌లైను ద్వారా నీటిని తీసుకునేందుకు నాలుగు నెలల పాటు విద్యుత్తు ఛార్జీలు భారీగా వస్తాయని నగరపాలక అధికారులు చెబుతున్నారు. నెలకు రూ.60 లక్షల వరకు విద్యుత్తు చార్జీలు చెల్లించాల్సి వస్తుందని.. నాలుగు నెలలకు రూ. 2.40 కోట్ల వరకు నగరపాలక సంస్థపై భారం పడుతుందని పేర్కొంటున్నారు. దీనికితోడు నిర్వహణ భారం అదనమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**రెండేళ్లు గడిచినా..**

సుంకేసుల నుంచి మునగాలపాడు వరకు 20.5 కి.మీ. మేర పైప్‌లైను పనులు చేపట్టారు. ఇందుకు రూ.84 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేశారు. పనులు పూర్తైతే సుంకేసుల జలాశయం నుంచి మునగాలపాడు పంప్‌హౌస్‌కు పైప్‌లైను ద్వారా నేరుగా చేరుకుంటాయి. 2022 డిసెంబరులో పనులు ప్రారంభించినప్పటికీ నేటికీ పూర్తికాక పోవడం గమనార్హం.కమీషన్లు ఇవ్వాలని వైకాపా నేతలు సతాయించడంతో పనులు చేయడంలో గుత్తేదారు ఆలస్యం చేశారు. మార్చి నాటికి పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు.

నగరంలో వార్డులు : 52
జనాభా : సుమారు 6.50 లక్షలు
నీటి నిల్వ ట్యాంకు సామర్థ్యం : 0.15 టీఎంసీ
ఏటా నగరానికి అవసరమైన నీరు : 1.7 టీఎంసీ
ప్రతిరోజూ నీటి అవసరం : 120 ఎంఎల్‌డీ
ప్రస్తుతం సరఫరా : 95 ఎంఎల్‌డీ

# ఇసుక తోడేళ్ల వికటాట్టహాసం



ఒంగోలు :సుమారు నెల రోజుల క్రితం.. కిమ్స్ ఆసుపత్రి సమీపంలోని పైవంతెన కింద ఓ వాహనాన్ని ప్రైవేట్ ముఠా అడ్డుకుంది. ఇసుకను తమ వద్ద అన్‌లోడ్ చేయాలని పట్టుబట్టింది. యజమాని ససేమిరా అనడంతో ద్విచక్ర వాహనాన్ని అడ్డుగా పెట్టి రెండు రోజుల పాటు అక్కడే నిలిపివేశారు. ఆయనో మాజీ సైనికుడు. కార్గిల్ యుద్ధ వీరుడు. పోరాడుతూ గాయపడి సైన్యం నుంచి బయటకు వచ్చారు. లారీలో నెల్లూరు జిల్లా నుంచి ఇసుక రవాణా చేస్తూ జీవిస్తున్నారు. గత నెల 28న ఒంగోలు శివారులో ప్రైవేట్ సైన్యం ఆయన వాహనాన్ని అడ్డుకుంది. ఇసుకతో సహా లారీని తీసుకెళ్లిపోయింది. బాధితుడు వాళ్ల చుట్టూ తిరుగుతూ ప్రాధేయపడుతున్నా వదలడం లేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆయన వాపోయారు. గత కొన్నిరోజులుగా ఒంగోలులో ఇసుక తోడేళ్లు మోహరించాయి. అర్ధరాత్రి వేళ జాతీయ రహదారిపై స్వైర విహారం చేస్తున్నాయి. లోడుతో వస్తున్న వాహనాలను అడ్డుకుంటున్నాయి. దాడులు, దౌర్జన్యాలతో బెంబేలెత్తిస్తున్నాయి. తమకే విక్రయించాలని హుకూం జారీ చేస్తున్నాయి. అంగీకరిస్తే సరి, లేదంటే సదరు వాహనాలను తమ ఆధీనంలోకి తీసుకుంటున్నాయి. జీ హుజూర్ అంటూ కాళ్లబేరానికి వచ్చిన తర్వాతే విడిచి పెడుతున్నాయి.

**ప్రభుత్వ విధానానికి తూట్లు:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన ఇసుక విధానాన్ని తెచ్చింది. రవాణా ఛార్జీలు మినహా ఇతరత్రా రుసుములు ఏవీ లేవని ప్రకటించింది. పలుచోట్ల యార్డులను ఏర్పాటు చేసింది. వీటి నిర్వాహకులు కొందరు ఇప్పుడు ప్రైవేట్ సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఒంగోలుకు నాలుగు వైపులా ప్రధాన రహదారుల్లో వారిని మోహరిస్తున్నారు. జిల్లాలో ఎక్కడా అధికారిక ఇసుక రీచ్‌లు లేవు. దీంతో అవసరమైన వారు నిబంధనల పాటిస్తూ నెల్లూరులోని పెన్నా తీర ప్రాంతంలోని రీచ్ వద్ద నుంచి గనుల శాఖ వద్ద నమోదు చేసుకున్న లారీలు, టిప్పర్లలో జిల్లాకు రవాణా చేసుకుంటున్నారు. కొనుగోలు చేసిన వ్యక్తి పేరిట బిల్లులతో వస్తున్న వాహనాలను ప్రైవేట్ ముఠాలు అడ్డుకుంటూ ప్రభుత్వ విధానానికి తూట్లు పొడుస్తున్నాయి.

**ఎంతిస్తే అంత..** ఎప్పుడిస్తే అప్పుడు: నెల్లూరు జిల్లాలోని ఇసుక రీచ్‌ల నుంచి జిల్లాలోని యార్డులకు ఇసుక రవాణా చేస్తే టన్నుకు రూ.820 వాహన యజమానికి రవాణా ఛార్జీలు చెల్లించాలి. సదరు ఇసుకను యార్డు నుంచి టన్ను రూ.980కి విక్రయించుకునే అవకాశాన్ని ప్రభుత్వమే కల్పించింది. ఆచరణలో ఇందుకు భిన్నంగా సాగుతోంది. స్వల్పకాలంలోనే లబ్ధి పొందాలనే ఆత్రుతతో ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే అధికానికి విక్రయిస్తున్నారు. రవాణాదారులకు చెల్లింపుల విషయంలోనూ ఇదేతీరు నడుస్తోంది. అదేమని అడిగితే 'మేం ఎంతిస్తే అంత.. ఎప్పుడిస్తే అప్పుడే తీసుకోవాల..' అని హుకూం జారీ చేస్తున్నారు. **ప్రైవేట్ వ్యక్తులు అడ్డుకుంటున్నది వాస్తవమే.. :** ఒంగోలు కేంద్రంగా ఇసుక రవాణాను కొందరు ప్రైవేట్ వ్యక్తులు అడ్డుకుంటున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇటీవలే యార్డు ఏర్పాటు చేసేందుకు ఖర్చయిందంటూ ఇతర ప్రాంతాల నుంచి ఇసుక లోడు తెచ్చి ఒంగోలులో విక్రయిస్తున్న వారిని అడ్డుకుంటున్నట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం అడ్డుకోకూడదు. వారిపై చర్యలు తీసుకుంటాం. - రాజశేఖర్‌బాబు, డిప్యూటీ డైరెక్టర్, గనుల శాఖ

# తవ్వేయ్.. అమ్మేయ్..!

పుత్తూరు : భారీ పొక్లెయిన్లు, యంత్ర సామగ్రి సాయంతో సహజసిద్ధ కొండలు తవ్వేస్తున్నారు.. టిప్పర్లు వరుసకట్టి రేయింబవళ్లు వాహనాలతో అక్రమంగా తరలిస్తున్నారు.. తమ సంపద కొల్లగొడుతున్నారంటూ అధికారులకు గ్రామస్థులు వేడుకుంటున్నా వాహనాలను నిలువరించాలన్న ధ్యాస అధికారులకు లేపోవడం గమనార్హం.. స్థానికులు అడ్డుకున్న సమయంలో తనిఖీల పేరిట నామమాత్రంగా పరిశీలించి చేతులు దులుపుకొంటున్నారు.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సూళ్లూరుపేట, చంద్రగిరి, గూడూరు, గంగాధర నెల్లూరు, నగరి, సత్యవేడు నియోజకవర్గాల్లోని కొండలను యథేచ్ఛగా గ్రావెల్ తవ్వి తరలించేస్తున్నారు.చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో నాలుగు, ఆరు వరసల రహదారుల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. వీటికి విరివిగా లక్షల టిప్పర్ల గ్రావెల్ అవసరం. దీంతో ఉమ్మడి జిల్లాలో కొందరు నాయకులు తమ పరిధిలోని రహదారుల గుత్తేదారులతో మాట్లాడుకుని వారికి గ్రావెల్ తరలిస్తున్నారు. కొండల్లోతే తమ అనుచరులకు ఆ పనులు అప్పగించేశారు. వారే అన్నీ తామై చూసుకుంటున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన వ్యక్తి కనుసన్నల్లోనే గ్రావెల్ తరలిస్తున్నారని, ఇదెక్కడి దోపిడి అని అధికార పార్టీ నాయకులు విస్తుపోతున్నారు. ఇటీవల పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం పంచాయతీలోని కైలాసపురంలో సైతం సదరు నాయకుడే టిప్పర్లలో గ్రావెల్ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయిం చాడు. గత ప్రభుత్వం హయాంలో పుత్తూరు, వడమాలపేట మండలాల్లో భారీగా గ్రావెల్ తరలించి మాజీమంత్రి బంధువర్గానికి మామూళ్లు ముట్టజెప్పారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ప్రకృతి సంపద తరలిపోకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఎక్కడెక్కడంటే..



తిరుపతి జిల్లా పరిధిలోని రామచంద్రాపురం మండలంలోని పిల్లారికోన, ఎల్విపురం పరిధిలోని కొండలను నాయకులు పిండి చేస్తున్నారు. నిత్యం వంద టిప్పర్లలో మట్టి తరలిస్తున్నారు. పిల్లారికుప్పం కొండ పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి.

సూళ్లూరుపేట నియోజకవర్గంలోని మట్టి మాఫియా ఆగడాలు ప్రతిమించాయి.సత్యవేడు నియోజకవర్గంలోని సత్యవేడు, వరదయ్యపాళెం, నారాయణవనం తదితర ప్రాంతాల నుంచి ఇష్టానుసారంగా గ్రావెల్ మట్టి తరలించేస్తున్నారు. నగరి నియోజకవర్గంలోని వడమాలపేట మండలం పూడి నుంచి అప్పాయిగుంటకు వెళ్లే మార్గంలో కొండను తవ్వేస్తున్నారు.నగరి, విజయపురం మండలాల్లో.. జీడీ నెల్లూరు నియోజకవర్గం లోని పాలసముద్రం, ఎస్ఆర్‌పురం, కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల పరిధిలో గ్రావెల్ తరలింపు యథేచ్ఛగా సాగుతోంది.

పాలసముద్రం మండలంలోని వనదుర్గాపురం నుంచి నిత్యం వందల కొద్దీ టిప్పర్లు గ్రావెల్ తరలిస్తున్నారు. ఇదంతా నియోజకవర్గంలోని ఓ కీలక నేత కనుసన్నల్లో సాగుతోందనే విమర్శలున్నాయి.

# బడిలో లోపించిన ప్రత్యేకత

కదిరి : ప్రభుత్వ బడుల్లోని పదో తరగతి పిల్లలు వందశాతం ఉత్తీర్ణత సాధించాలి. ప్రైవేటు, కార్పొరేట్‌కు పోటీగా ఫలితాలు సాధించాలి. అందుకు పాఠశాల సమయంలో బోధనతో పాటు ప్రత్యేక శిక్షణ తరగతులతో వందరోజుల కార్యక్రమాన్ని చేపట్టారు. సెలవు రోజుల్లోనూ ప్రత్యేక తరగతులు, మధ్యాహ్న భోజనం వడ్డించాలని విద్యాశాఖ జిల్లా అధికారులు ఆదేశాలిచ్చారు. దీంతో ఆదివారం తెలుగు, హిందీ భాషా తరగతులు నిర్వహించారు. అయితే తరగతుల నిర్వహణలో ప్రత్యేకత లోపించింది. చాలాచోట్ల బడులే తెరుచుకోలేదు. కొన్నిచోట్ల తూతూమంత్రంగా జరిగాయి. కొందరు భోజనం వద్దనకు మంగళం పాడారు. ఇలా ఒక్కోచోట ఒక్కోలా తరగతులు నిర్వహించారు. బోధనకు నిర్లక్ష్యం ఆవహిస్తే, పరీక్షల్లో ఆశించిన ఫలితాలు ఎలా సాధ్యమని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యవేక్షణ కొరవడటంతో లక్ష్యం నీరుగారుతోందని ఆవేదన చెందుతున్నారు.

**తెరుచుకోని బడి తలుపులు**

కదిరి నియోజకవర్గం తలుపులలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 140 మంది, గుండువారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 17 మంది విద్యార్థులు ఉన్నారు. సెలవురోజు ప్రత్యేక తరగతులు, భోజనం పెట్టాలన్న ఆదేశాలను గాలికి వదిలేశారు. కదిరి పట్టణంలోని ప్రభుత్వ




బాలుర ఉన్నత పాఠశాలలో 142కి 46 మందే హాజరయ్యారు. ఈ బడి తెరిచినా మధ్యాహ్న భోజనం వడ్డించలేదు. తనకల్లులోనూ ఆదివారం తరగతులు తూతూమంత్రమే. హిందీ ఉపాధ్యాయ పోస్టు ఖాళీతో ప్రత్యేక తరగతి కరవైంది. తలుపులలో విద్యార్థులకు ఆదివారం బస్సుపాసు చెల్లదని, అందుకే రామని చెప్పడంతో ప్రత్యేక తరగతులు నిర్వహించలేదని ప్రధానోపాధ్యాయుడు చెబుతున్నారు.

**అరకొరగా నిర్వహణ**

పుట్టపర్తి మున్సిపల్ పరిధి ఎనుములపల్లి ఉన్నత పాఠశాలలో 76 మంది 47 మంది విద్యార్థులు హాజరయ్యారు. వందరోజుల కార్యక్రమంతో ప్రత్యేక తరగతులు నిర్వహించి, ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆదివారమూ తరగతులు పెట్టలన్నారు. అయితే ఉపాధ్యాయులు ఆ స్థాయిలో చొరవ చూపకున్నారు. ఇందుకే అరకొరగా విద్యార్థులు ప్రత్యేకశిక్షణలో పాల్గొంటున్నారు. ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తున్నా బోధనలో ఉపాధ్యాయులు ప్రత్యేకతను చాటలేకున్నట్లు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయంపై జిల్లా విద్యాధికారి కిష్టప్పను వివరణ కోరగా ఆదివారం సెలవైనా ప్రత్యేక తరగతులకు ఆదేశాలిచ్చాం. హాజరైన ప్రతి విద్యార్థికీ భోజనం వడ్డించాల్సిందే. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు ఉంటాయి. వచ్చే ఆదివారం పదో తరగతి ప్రత్యేక తరగతులపై పర్యవేక్షిస్తాం. నిర్లక్ష్యం కనిపిస్తే తీవ్రంగా పరిగణిస్తామని వివరించారు.

జిల్లా: శ్రీసత్యసాయి
మండలాలు: 32
ఉన్నత పాఠశాలలు: 312
మొత్తం విద్యార్థులు: 15,961
ఆదివారం హాజరు: 9,819

# 'క్రిటికల్ కేర్'పై నిర్లక్ష్యం

అనంతపురం : అత్యవసర, క్లిష్ట పరిస్థితుల్లో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు అనంతపురంలోని సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ఆవరణలో పీఎం అభిమ్ పథకం కింద కేంద్ర నిధులతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవన నిర్మాణ పనులు ఆగుతూ సాగుతున్నాయి. భవన నిర్మాణం గత నెల 6వ తేదీనాటికి పూర్తి కావాల్సి ఉన్నా.. వివిధ కారణాలతో జాప్యం చేస్తున్నారు. దీనిని ప్రారంభిస్తే ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీకి రోగుల తాకిడి తగ్గనుంది. సర్వజన వైద్యశాలలో కేవలం 20 పడకల సామర్థ్యం ఉంది. రోజూ క్యాజువాలిటీకి 300 మంది వరకు రోగులు, క్షతగాత్రులు వస్తుంటారు. పడకలు లేకపోవడంతో ఒకే పడకపై ఇద్దరిని ఉంచి చికిత్సలు అందిస్తున్నారు. అదే క్రిటికల్ కేర్ ప్రారంభమైతే రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించే అవకాశం ఉంటుంది. రోగులు, ప్రమాదాలకు గురైన క్షతగాత్రులు వ్యయప్రయాసలకు ఓర్చి ఇతర ప్రాంతాలు, ప్రైవేట్, కార్పొరేట్ వైద్యశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండదు. సకాలంలో వైద్యసేవలు అందించేందుకు ఒక వరంగా మారుతుంది.

**ఇవీ సౌకర్యాలు** సర్వజన వైద్యశాలకు అనుబంధంగా క్రిటికల్ కేర్‌ను



కేటాయించారు. వాస్తవానికి సర్వజన వైద్యశాలలోనే ఏర్పాటు చేయాల్సి ఉండగా స్థలం కొరత కారణంగా సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో ఏర్పాటు చేసేందుకు అప్పట్లో నిర్ణయించి అధికారులు కేంద్రానికి ప్రతిపాదనలు పంపగా ఆమోదం లభించింది. క్రిటికల్ కేర్ ప్రారంభమైతే అత్యవసర కేసులకు సంబంధించి ఆర్థో, న్యూరోసర్జరీ, గుండె, యూరాలజీ, డెర్మటాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీతో పాటు ఇతర విభాగాలకు సంబంధించిన వైద్యసేవలు అందుబాటులో ఉంటాయి. రెండు ఆపరేషన్ థియేటర్లు, 50 ఐసీయూ పడకలు ఉంటాయి. రోగులకు అందించే వైద్యసేవలకు సంబంధించిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తారు. **గడువు పెంచాలని కోరాం- శ్రీనివాసులునాయుడు, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ** ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. గడువు పెంచాలని కోరుతూ ఉన్నతాధికారులకు నివేదించాం. నలభై శాతం వైద్యసామగ్రితో పాటు 26 ఐసీయూ మంచాలు వచ్చాయి. త్వరగతిన పనులు పూర్తిచేసి క్రిటికల్ కేర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

## ట్రెడిషనల్ టచ్ తో పాయల్ మాయ

పాయల్ రాజ్‌పుత్ ఎప్పటికప్పుడు తన గ్లామర్ తో అలరిస్తూ ఉంటుంది. కానీ ఈసారి మాత్రం ట్రెడిషనల్ లుక్ లో మెరిసిపోతూ, అందరి హృదయాలను దోచుకుంటోంది. తాజా ఫోటోల్లో ఆమె స్కై బ్లూ కలర్ లెహంగా ధరించి, సంప్రదాయ ఆభరణాలతో రాజసంగా మెరిసిపోతోంది. మెహందీ, హారం, చెవి కమ్మలు, గాజులతో ఆమె రూపం సంప్రదాయ శోభను చాటుతోంది. చిరునవ్వుతో మెరిసిపోతూ, ఒలకబోసిన గ్రేస్ ఆమెను మరింత అందంగా మార్చింది. ఈ ఫోటోల్లో పాయల్ స్టైలింగ్ చూసిన వారెవరైనా ఒక్కసారి మాత్రం ఫిదా అవ్వాల్సిందే. నీలి లెహంగా, వెండి అంచులు కలిగిన డిజైన్ ఆమె లుక్‌కు ప్రత్యేకమైన ఆకర్షణను జోడించాయి. గ్రీన్ బ్యాక్‌డ్రాప్ లో ఆమె ఫోటో షూట్ మరింత లైమ్‌లైట్‌లోకి తీసుకువచ్చింది. చేతినిండా మెహందీ, గాజులతో సంప్రదాయ అమ్మాయిగా దర్శనమిస్తున్న ఈ



ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పాయల్ రాజ్‌పుత్ తెలుగు ప్రేక్షకులకు 'RX 100' సినిమాతో పరిచయమైంది. ఆ సినిమాలో ఆమె నటన, పాత్ర హాట్ టాపిక్‌గా మారాయి. ఆ తర్వాత 'వెంకీమామ', 'డిస్కో రాజా' వంటి చిత్రాల్లో నటించినప్పటికీ, తొలి సినిమా స్థాయిలో మరో విజయం రాలేదు.

అలాగే మంగళవారం సినిమాలో చేసిన క్యారెక్టర్ కు మంచి గుర్తింపు దక్కింది కానీ ఆ సినిమా కమర్షియల్ గా పెద్దగా సక్సెస్ కాలేకపోయింది. కానీ ఆమె గ్లామర్, ఫ్యాషన్ సెన్స్ మాత్రం ఎప్పటికప్పుడు చర్చనీయాంశం అవుతూనే ఉంది. ప్రస్తుతం పాయల్ తన కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాలని చూస్తోంది. కొత్త కథల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ పెడుతోంది. లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లో నటించాలని భావిస్తున్న ఈ బ్యూటీ, త్వరలోనే తన కొత్త ప్రాజెక్ట్స్‌పై అధికారిక సమాచారం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

## మేడ మీద బ్యూటీ మళ్లీ ఇటువైపు చూడదా?

కేరళ కుట్టీ నిఖిలా విమల్ సుపరిచితమే. అమ్మడు చైల్డ్ ఆర్టిస్ట్ గానే మాలీవుడ్ లో లాంచ్ అయింది. అటుపై టాలీవుడ్ లో 'మేడ మీద అబ్బాయ్', 'గాయత్రి' లాంటి చిత్రాల్లో నటించింది. కానీ ఈ రెండు సినిమాలు ఆశించిన ఫలితాలు సాధించలేదు. దీంతో మరో ఆలోచన లేకుండా నిఖల మాలీవుడ్ కి వెళ్లిపోయింది. కొంత కాలంగా అక్కడే నటిగా కనసాగుతుంది. తమిళ్ లో కూడా బాగానే పని చేస్తోంది. ప్రస్తుతం హీరోయిన్ గా రెండు భాషల్లోనూ బిజీగానే ఉంది. గత ఏడాది నాలుగైదు సినిమాలతో అలరిం చింది. ఇదే ఏడాది కూడా నాలుగైదు సినిమాలతో ప్రేక్షకుల్లో ఉండేలా కనిపిస్తుంది. సినిమాలు కూడా మంచి విజయాలు సాధించడంతోనే ఈరకంగా బిజీగా ఉంది. లేకుంటే ఇంత బిజీగా ఉండే ఛాన్స్ లేదు. ఆ రకంగా నిఖిలా విమల్ కెరీర్ సాగిపోతుంది. అయితే ఈ భామ మళ్లీ టాలీవుడ్ వైపు చూడదా? అన్నది సందేహంగా మారింది. ఎవరికైనా



జయపజయాలు సహజం. సక్సెస్ ..పెయిల్యూర్ ని బ్యాలెన్స్ చేస్తూ ముందుకెళ్లాలి. కానీ ఈ విషయంలో టాలీవుడ్ పరంగా చూస్తే నిఖిల ఫెయిల్యూర్ ని బ్యాలెన్స్ చేయలేకపోయింది.

రెండు పెయిల్యూర్స్ వచ్చే సరికి మళ్లీ టాలీవుడ్ వైపు చూడటమే మానేసింది. నిజానికి కొంత కాలంగా కేరళ భామలకు టాలీవుడ్ పెద్ద పీట వేస్తుంది. అందులోనూ సక్సెస్ ల్లో ఉన్న భామల్ని నెత్తిన పెట్టుకుంటుంది. ముంబై భామల్ని పక్కనబెట్టి మరీ కేరళ కుట్టీలను ఎంపిక చేస్తున్నారు. వాళ్లలో నేచురల్ బ్యూటీకి కనెక్ట్ అవ్వడంతో పాటు అంతే సహజంగా నటన ఉండటంతో? వాళ్లే ఉత్తమంగా మేకర్స్ ఎంపిక చేస్తున్నారు. కానీ నిఖిలా విమల్ మాత్రం ఇండస్ట్రీకి పూర్తిగా దూరమై ఎలాంటి కంబ్యాక్ ప్రయత్నాలు చేయకుండా తప్పు చేస్తోంది అన్న వాదన తెరపైకి వస్తోంది.




## అత్యధిక కలెక్షన్స్ రాబట్టిన హిస్టారికల్ సినిమాలు.. టాప్ 4 ఇవే!



సినీ ప్రేమికులకు రెగ్యులర్ కమర్షియల్ సినిమాలు కంటే కూడా చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రాలంటే విపరీతమైన మక్కువ పెరిగిపోయింది. భారీ మేకింగ్, గ్రాండ్ విజువల్స్, గొప్ప కథనంతో కూడిన ఇతిహాస చిత్రాలు ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని కలిగిస్తున్నాయి. గతంలో 'బాజీరావు మస్తాని', 'తన్హాజీ', 'పద్మావత్' లాంటి సినిమాలు హిస్టారికల్ జానర్‌లో ఘనవిజయం సాధించాయి. అయితే ఇప్పుడు ఆ లిస్టులోకి మరో అద్భుత చిత్రం చేరింది.. అదే 'ఛావా'. విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. చరిత్రలో మరిచిపోలేని పాత్రలతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న ఈ నాలుగు హిస్టారికల్ మూవీ రికార్డుల కలెక్షన్స్ ఈ విధంగా ఉన్నాయి.

**'ఛావా' – 601 కోట్ల కలెక్షన్లతో అగ్రస్థానంలో...** ఇటీవల 'ఛావా' చిత్రం బాలీవుడ్‌లో అంచనాలకు మించి ఘనవిజయం సాధించింది. శంభాజీ మహారాజ్ జీవితగాథ ఆధారంగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకుల హృదయాలను కదిలించింది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా తొలివారమే రూ. 300 కోట్లకు పైగా వసూలు చేయగా, రెండవ వారంలోనే 555 కోట్ల మార్కును దాటింది. తాజాగా ప్రపంచవ్యాప్తంగా రూ. 601 కోట్లను రాబట్టి 'హయ్యెస్ట్ గ్రాసింగ్ హిస్టారికల్ ఫిల్మ్'గా నిలిచింది. ఇందులో విక్కీ కౌశల్ శంభాజీ పాత్రలో జీవించి పోయాడు, రష్మిక మందన్నా, అక్షయ్ ఖన్నా కీలక పాత్రలు పోషించారు. ఇక ఈ వారం తెలుగులో కూడా రిలీజ్ అవుతోంది. దీంతో లెక్క మరింత పెరిగే అవకాశం ఉంది.

**'పద్మావత్' – 580 కోట్లు...** బాలీవుడ్ దర్శక దిగ్గజం సంజయ్ లీలా భన్సాలీ రూపొందించిన 'పద్మావత్' 2018లో విడుదలై అద్భుతమైన వసూళ్లు సాధించింది. దీపికా పదుకొణే, రణవీర్ సింగ్, షాహిద్ కపూర్ నటించిన ఈ సినిమా విజువల్ మాస్టర్ పీస్‌గా నిలిచింది. రాజపుత్ రాణి పద్మావతి కథ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం విడుదలకు ముందు ఎన్నో వివాదాల్లో చిక్కుకుంది. అయితే విడుదలైన తర్వాత అంచనాలకు మించి ప్రేక్షకుల మద్దతును పొందింది. ప్రపంచవ్యాప్తంగా రూ. 580 కోట్ల గ్రాస్ వసూలు చేసి హిస్టారికల్ మూవీస్ లిస్టులో రెండవ స్థానాన్ని దక్కించుకుంది.

**'తన్హాజీ' – 373 కోట్లు...** 2020లో విడుదలైన 'తన్హాజీ' సినిమా మరాఠీ వీరుడైన సుభేదార్ తన్హాజీ మాలుసారే కథ ఆధారంగా తెరకెక్కింది. అజయ్ దేవగన్ టైటిల్ రోల్ పోషించగా, సైఫ్ అలీ ఖాన్ ప్రతినాయక పాత్రలో కనిపించాడు. ఈ సినిమా కేవలం 3 వారాల్లోనే రూ. 250 కోట్లకు పైగా వసూలు చేయగా, ఫుల్ రన్ లో రూ. 373 కోట్లను రాబట్టి అద్భుతమైన హిట్‌గా నిలిచింది. సినిమాలోని యుద్ధ సన్నివేశాలు, గ్రాండ్ విజువల్స్ ప్రేక్షకులను అబ్బురపరిచాయి.

**'బాజీరావు మస్తాని' – 355 కోట్లు...** 2015లో వచ్చిన 'బాజీరావు మస్తాని' చిత్రాన్ని దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ అత్యద్భుతంగా తెరకెక్కించారు. బాలీవుడ్ హిస్టారికల్ మూవీస్‌లో వన్ ఆఫ్ ది బెస్ట్‌గా నిలిచిన ఈ సినిమాలో రణవీర్ సింగ్, దీపికా పదుకొణే, ప్రియాంకా చోప్రా కీలక పాత్రల్లో నటించారు. బాజీరావు–మస్తాని ప్రేమకథ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ. 355 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. 'ఛావా' సినిమా సృష్టించిన రికార్డులు చూస్తుంటే బాలీవుడ్‌లో ఇకపై మరిన్ని హిస్టారికల్ మూవీస్ వచ్చేలా ఉన్నాయనిపిస్తోంది. ఈ చిత్రాలు ప్రజల్లో చరిత్రపై ఆసక్తిని పెంచడంతో పాటు, భారీ వసూళ్లు రాబట్టే సత్తా కూడా చాటుతున్నాయి. మరి ఈ హిస్టారికల్ హిట్ లిస్టులో నెక్స్ట్ ఏ సినిమా చేరుతుందో చూడాలి.

## కొత్త ఏడాదిలో అన్నీ శుభవార్తలేనా?




హీరోయిన్ గా రాణించాలంటే పెళ్లి చేసుకోకూడదు...తల్లి కాకూడదు అన్నది నాటి రూల్. నేడు రూల్ ఆ పాత రూల్ కి పూర్తి కాంట్రెస్ట్. హీరోయిన్ గా సక్సెస్ అవ్వాలంటే పెళ్లి చేసుకోవాలి...తల్లి అయితే ఇంకా క్రేజ్ ఉంటుందన్నది నేటి రూల్ గా మారింది. తల్లులైన అందమైన బాలీవుడ్ భామలంతా నటీమణులు ఎంత బిజీగా ఉన్నారు అన్నది చెప్పాల్సిన పనిలేదు. దీపికా పదుకొణే, కరీనా కపూర్ , అనుష్క శర్మ, అలియాభట్ లు కొందరైతే అద్దె గర్భం ద్వారా తల్లులైన వారు మరికొంత మంది . నయనతార, ప్రియాంక చోప్రా ఇలా కొంత మంది ఉన్నారు. వీరంతా ప్రొఫెషనల్ గా ఎంతో బిజీగా ఉన్నారు. పెళ్లి..తల్లి అనే బంధంతో సంబంధం లేకుండా నటీమణులుగా కొనసాగుతున్నారు. ఇండస్ట్రీలో అత్యధిక పారితోషికం కూడా అందుకుంటున్నారు. త్వరలో మరికొంత మంది కూడా తల్లులు కాబోతున్నారు. వారంతా ఇప్పటికే గర్భం దాల్చిన విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. నిన్నటి రోజున కియారా అద్వాణీ గర్భందాల్చిన విషయాన్ని రివీల్ చేసింది. భర్త సిద్దార్థ్ మల్హోత్రాతో కలిసి విషయాన్ని పంచుకుంది. నటిగా ఇప్పటికే బిజీగా ఉంది. ఇకపై కియారా మరింత బిజీగా మారుతుంది. ప్రస్తుతం టాక్సిక్, వార్ 2 చిత్రాల్లో కియారా నటిస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే సునీల్ శెట్టి కుమార్తె అతియాశెట్టి కూడా గర్భంతో ఉంది. ఇదే ఏడాది తల్లిగా పిలుపు అందుకోబోతుంది. అలాగే ఇలియానా, అమీజాకన్స్ కూడా తమ ప్రెగ్నెన్సీ వార్తను ఇప్పటికే కన్ఫమ్ చేసారు. ఇద్దరు సెకెండ్ చైల్డ్ కి రెడీ అవుతున్నారు. కత్రినా కైఫ్ కూడా శుభవార్త చెబుతుందని అంతా ఆశిస్తున్నారు.

ఇప్పటికే ఆమె గర్భవతి అని పలుమార్లు మీడియాలో కథనాలు వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఇంకా మీడియాకు ఇలాంటి విషయాలు వెల్లడించకుండా గోప్యత వహించే వారు మరికొంత మంది ఉన్నారు.

## కయదు వీడియోస్ ట్రెండ్ చేస్తున్నారుగా..!

ప్రదీప్ రంగనాథన్ తో డ్రాగన్ సినిమాలో నటించిన కయదు లోహార్ కు ఆ సినిమాతో సూపర్ పాపులారిటీ వచ్చింది. సినిమాలో అనుపమ పరమేశ్వరన్ కూడా ఒక హీరోయిన్ కాగా ఆమె కన్నా కయదు యూత్ ఆడియన్స్ కు దగ్గరైంది. ముఖ్యంగా సినిమాలో ఆమె గ్లామర్ లుక్స్, యాక్టింగ్ అంతా నచ్చేసింది. డ్రాగన్ సినిమాతో కయదు లోహార్ సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. ఆ సినిమా చూసిన తమిళ ఆడియన్స్ ఆమె గురించి ఆహా ఓహో అనేస్తుంటే తెలుగు ఆడియన్స్ కూడా అమ్మడిని తెగ ఫాలో అవుతున్నారు. ఐతే కయదు లోహార్ ఆల్రెడీ తెలుగులో 3 ఏళ్ల క్రితమే ఒక సినిమా చేసింది. శ్రీ విష్ణు చేసిన అల్లూరి సినిమాలో అమ్మడు హీరోయిన్ గా నటించింది. ఐతే ఆ సినిమా పెద్దగా ఆడకపోవడంతో ఆ టైం లో ఆమెను ఎవరు పట్టించుకోలేదు. కానీ డ్రాగన్ సినిమా సూపర్ హిట్ అవ్వడంతో ఇప్పుడు అల్లూరి సినిమా క్లిప్స్, సాంగ్స్ సోషల్ మీడియాలో ట్రెండ్



చేస్తున్నారు. డ్రాగన్ చూశాక ఆమెను మరింత ట్రెండ్ చేస్తున్నారు. తెలుగు సోషల్ మీడియాలో కయదు లోహార్ ఒక ట్రెండింగ్ టాపిక్ గా మారింది. అమ్మడి గురించి ప్రత్యేకమైన చర్చలు జరుపుతున్నారు. ఇక కయదుకి ఆఫర్లు కూడా వరుస కడుతున్నాయి. ఇప్పటికే అనుదీప్, విశ్వక్ సేన్ కాంబో సినిమా ఫంకీలో అమ్మడు ఛాన్స్ అందుకుందని తెలుస్తుంది. ఈ సినిమాతో పాటు మరో రెండు సినిమాలు డిస్కషన్ స్టేజ్ లో ఉన్నాయని తెలుస్తుంది. కయదు కూడా తెలుగు ఆడియన్స్ తనపై చూపిస్తున్న ఈ ప్రేమకు సూపర్ హ్యాపీగా ఉంది. తెలుగులో ఒక్కసారి క్లిక్ అయితే ఆ హీరోయిన్ కి స్టార్ రేంజ్ వచ్చినట్టే లెక్క. తెలుగులో స్టార్ స్టేటస్ వస్తే మిగతా అన్ని భాషల్లో కూడా అదే రేంజ్ ఆఫర్లు వస్తాయి. సో డ్రాగన్ సినిమా వల్ల హీరో ప్రదీప్ రంగనాథన్, డైరెక్టర్ అశ్వత్ మారిముత్తుకి ఎంత పేరు వచ్చిందో హీరోయిన్ గా కయదు లోహార్ కి అంతకుమించి పాపులారిటీ వచ్చింది. తెలుగు సోషల్ మీడియాలో అయితే గత కొద్ది రోజులుగా కయదు స్పెషల్ టాపిక్ గా మారింది. తెలుగులో మళ్లీ రీ ఎంట్రీ ఇస్తుంది కాబట్టి అమ్మడికి ఈసారి లక్ కలిసి వచ్చేలానే ఉంది. తమిళ్ లో కూడా ప్రస్తుతం కయదు ఇదయం మురళి సినిమాలో నటిస్తుంది.

## సమంత 15 ఏళ్ల జర్నీ.. స్టన్నింగ్ గోల్డెన్ లుక్

టాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న స్టార్ హీరోయిన్ సమంత.. 15 ఏళ్ల సినిమా ప్రయాణాన్ని పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఆమెకు ప్రెస్టీజియస్ అవార్డు లభించింది. తాజాగా చెన్నైలో జరిగిన బిహైండ్ వుడ్స్ గోల్డ్ అవార్డ్స్ వేడుకలో, 'సిటాడెల్: హనీ బన్నీ' వెబ్ సిరీస్ లోని ఆమె పాత్రకు బెస్ట్ యాక్ట్రెస్ అవార్డు దక్కింది. ఈ ప్రత్యేక గౌరవాన్ని అందుకున్న సమంత.. తన ఎమోషనల్ జర్నీ గురించి సోషల్ మీడియాలో షేర్ చేస్తూ, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపింది. ఈ అవార్డు ఫంక్షన్ కోసం సమంత ఎంచుకున్న లుక్ స్పెషల్ హైలైట్ గా మారింది. అద్భుతమైన గోల్డ్ కలర్ శారీలో మెరిసిపోయిన ఆమె లుక్ రాయల్ ఎలిగెన్స్ ను చూపించింది. మినిమల్ జువెలరీ, సింపుల్



మేకప్ తో తళుక్కున మెరిసిన సమంత.. తన స్టన్నింగ్ లుక్ తో ఫ్యాన్స్ ను ఫిదా చేసింది. ఇంతకుముందు కూడా ట్రెడిషనల్ అవుట్ ఫిట్స్ లో మెస్మరైజ్ చేసిన సమంత.. ఈసారి మరింత గ్లామరస్ గా కనిపించింది. 15 ఏళ్ల ఫిల్మీ కెరీర్ లో సమంత అనేక రోల్స్ చేసి ప్రేక్షకులను అలరించింది. ఆమె కెరీర్ లో 'ఏ మాయ చేసావే' ప్రత్యేక స్థానం కలిగి ఉంది. ఆ సినిమా విడుదలైనప్పటి నుంచీ ఆమెకు వరుసగా విజయాలు దక్కాయి. ఆ తర్వాత 'ఎటో వెళ్ళిపోయింది మనసు', 'మనమ్', 'రంగస్థలం', 'మజిలీ' లాంటి బ్లాక్ బస్టర్స్ తో తన స్థాయిని మరింత పెంచుకుంది. బాలీవుడ్ లో కూడా అడుగుపెట్టి వెబ్ సిరీస్ 'సిటాడెల్' తో కొత్త అవతారం ఎత్తింది. ప్రస్తుతం సమంత వ్యక్తిగతంగా కొన్ని హెల్త్ ఇష్యూస్ తో బ్రేక్ తీసుకున్నప్పటికీ, సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ఫ్యాన్స్ కు టచ్ లోనే ఉంది. ఇటీవల ఆమె తన ఆరోగ్యం మెరుగుపడిందని తెలిపిన విషయం తెలిసిందే. త్వరలోనే వెండితెరపై మరిన్ని సినిమాలతో రీఎంట్రీ ఇవ్వనున్నట్లు సమాచారం. ఇక ఆమె నెక్స్ట్ ప్రాజెక్ట్ ఏంటనే ఆసక్తిగా ఎదురు చూస్తున్న అభిమానులకు త్వరలోనే మరో అప్డేట్ ఇవ్వనుందట.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536